ఆదివారం
గత వారం సంచికలపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
: fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
29-9-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 240 పేజీలు: 10+4 వెల: 6.50

సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ రాజీనామా 5

రూ. 60 కోట్లతో కాటమయ్య రక్షణ కవచాలు 6

విదేశాలకు అక్రమంగా
## నిధుల తరలింపు!
ప్రముఖ నటి రకుల్‌ప్రీత్‌సింగ్, ప్రొడ్యూసర్ వాసుభగ్నానిపై ఆరోపణలు, ఐటి సోదాలు


3

యుపిఐ ఎండిఆర్ ఛార్జీలపై
## సుప్రీం విచారణ
ఆర్బీఐ, ఎన్‌పిసిఐలకు నోటీసులు


5

ఆసియా గేమ్స్:
## షూటింగ్‌లో ఈషాకు రజతం


ఆటలో



సోమవారం హైదరాబాద్‌లో ఇసి కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్తున్న డి.సిఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, పిసిసి చీఫ్ మహేష్ గౌడ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు

# జ్ఞానేశ్ దిగిపోవాలి

### తీవ్ర నిరసనతో నినదించిన కాంగ్రెస్
### కేంద్రం, ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా భారీ ప్రదర్శన
### బిజెపికి అనుకూలంగా మారిన ఇసి: మహేష్ గౌడ్
### ఆందోళనలో పాల్గొన్న డి.సిఎం భట్టి, పలువురు మంత్రులు

**హైదరాబాద్,సెప్టెంబరు28,ప్రభాతవార్త:** దేశంలో ఎన్నికల నిర్వహణ, ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. కేంద్రంలోని నరేంద్ర మోదీ, అమిత్ షాల వైఖరితో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడిందని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు వ్యవహరిస్తూ బీజేపీకి అనుకూలంగా మారిందని విమర్శించారు. ఎన్నికల నిర్వహణలో అక్రమాలు >>2

దేశవ్యాప్తంగా
## ఆందోళనలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** ఓటు చోరీ వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష పార్టీలు సోమవారం దేశవ్యాప్తంగా నిరసనలకు దిగాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ >>2

# ఇక సర్ గో బ్యాక్

### సైమన్ గో బ్యాక్ తరహాలో సరికొత్త ఉద్యమం
### తెలంగాణ అభివృద్ధికి మోడీ సహకరించడం లేదు..
### ఎన్నికల సంఘంతో కలిసి ప్రధాని పెద్దకుట్ర
### ఢిల్లీలో జరిగిన కాంక్లేవ్‌లో సిఎం రేవంత్



ప్రధాని మోడీ, ఎన్నికల సంఘం పేరుతో పెద్ద ఎత్తున కుట్ర చేస్తున్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ సమస్య కాదు.. దేశ ప్రజాస్వామిక సమస్య అని సిఎం స్పష్టం చేశారు.'నార్త్ కొరియాలో కిమ్‌దే పార్టీ. ఆయనకే ఓటు వేయాలి. ఒకటే టీవీ ఆయననే చూపించాలి. జ్ఞానేశ్ కుమార్‌ను పది రోజులు నార్త్ కొరియా పంపిస్తే, కిమ్ దగ్గర శిక్షణ తీసుకొని వచ్చి మోదీకి వందకు వంద శాతం ఓట్లు వేయిస్తారు, సైమన్ గ్యోబాక్ నినాదం కింద నాడు దేశం ఏకమైనట్లు, రానున్న రోజుల్లో సర్ గో బ్యాక్ నినాదం కింద దేశం ఏకమవుతుంది.

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 28:** సైమన్ గ్యోబాక్ నినాదం కింద నాడు దేశం ఏకమైనట్లు, రానున్న రోజుల్లో సర్ గో బ్యాక్ నినాదం కింద దేశం ఏకమవుతుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం ఢిల్లీలో ఓ కాంక్లేవ్‌లో ఇండియాస్ నెక్స్ట్ చాప్టర్ అంశంలో పలు అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అభిప్రాయాలు వెల్లడించారు. ముఖ్యమంత్రి వెల్లడించిన అభిప్రాయాలు ఆయన మాటల్లో 'సైమన్ గోబ్యాక్ ఉద్యమం గుర్తుంది కదా..? 1919లో భారత ప్రభుత్వ చట్టం అమలు, దేశంలో పాలనా నిబంధనలు సమీక్షకు 1928లో సైమన్ కమిషన్‌ను నియమించారు. అందులో ఏడు గురికి ఏడుగురు బ్రిటిషర్లు ఉంటే మాకు ఏం న్యాయం ఏం జరగుతుందని లాలా లజపతి రాయ్ ఉద్యమం లేవదీశారు. సైమన్ గో బ్యాక్ నినాదాన్ని ఇచ్చారు. దేశమంతా ఏకమైంది. ఆందోళనలపై లాఠీఛార్జీ చేశారు. అందులో లాలా లజపతి రాయ్ చనిపోయారు. అప్పుడు భగత్ సింగ్ జెండా ఎత్తారు. 1929 తర్వాత వందేళ్ల అనంతరం మోదీజీ ఎన్నికల కమిషన్‌ను సైమన్ కమిషన్ మాదిరే ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారు. బ్రిటిష్ జనతా పార్టీ (బిజెపి)అవే ఎత్తుగడలు వేస్తోందని దుయ్యబట్టారు. స్వాతంత్ర్యం వచ్చాక రాజ్యాంగ సభలో చర్చించి ప్రతిఒక్కరికి ఓటు హక్కు ఇచ్చారు.నాడు ఓటు హక్కు ఇచ్చేందుకు తాత ఎవరు, తండ్రి ఎవరనే వివరాలు అడిగారు. ఓ రికార్డు కోసం నాడు చేశారు. తర్వాత అనేకసార్లు సర్ ప్రక్రియ జరిగింది. ప్రతిసారి ఓటు హక్కు ఇచ్చేందుకు దాన్ని చేపట్టారు. ఈసారి ఓటు హక్కు తొలగించేందుకు చేస్తున్నారు అని ఆరోపించారు. '2014లో మోదీ ప్రధానమంత్రి అయ్యారు. నాడు 81 కోట్ల ఓట్లు, 2019లో మోదీ ప్రధానమంత్రి అయ్యారు. 91 కోట్ల ఓట్లు, 2024లో 97 కోట్ల ఓట్లు.. 2029 ఎన్నికలకు సంబంధించి 13 కోట్ల ఓట్లు తొలగించారు. దేశంలో జనాభా పెరిగితే ఓట్లు పెరుగుతాయి. నాడు దేశంలో 35 కోట్ల జనాభా ఉంటే ఇప్పుడు 140 కోట్ల జనాభా. >>2




## అక్టోబరు, నవంబరులో ఉద్యోగాలకు పరీక్షలు

### 4 రకాల ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి చర్యలు
### సిబిటి విధానంలోనే పరీక్షలు: టిజిపిఎస్సీ

**హైదరాబాద్,సెప్టెంబరు28,ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కీలక అప్డేట్ ఇచ్చింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీకి గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్లకు సంబంధించిన నియామక పరీక్షల తేదీలను ప్రకటించింది. మొత్తం 4 రకాల పోస్టులకు సంబంధించిన పరీక్షలను అక్టోబర్, నవంబర్ నెలల్లో నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ పరీక్షలన్నీ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలోనే జరుగుతాయని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. సోమవారం ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఓ ప్రకటన విడుదల చేశారు. పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ప్రకటించిన తేదీలను గమనించి తమ ప్రిపరేషన్‌ను అందుకు అనుగుణంగా కొనసాగించాలని కమిషన్ సూచించింది. తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్॥) పోస్టుల భర్తీకి సంబంధించిన కంప్యూటర్ ఆధారిత పరీక్షను అక్టోబర్ 24వ తేదీన నిర్వహించనున్నారు. ఈ కేటగిరీలో 20 పోస్టులు ఉన్నట్లు షెడ్యూల్‌లో పేర్కొన్నారు పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోనే అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టుల నియామక పరీక్ష అక్టోబర్ 26వ తేదీన జరగనుంది. ఈ పోస్టులకు సంబంధించిన పరీక్ష కూడా సీబీటీ విధానంలోనే నిర్వహిస్తారు. ఈ విభాగంలో 19 పోస్టులకు నోటిఫికేషన్ వెలువడినట్లు అభ్యర్థులకు >>2

# భూ సమస్యలకు 'రీసర్వే'

### ప్రతి జిల్లాలో 70 వేల రెవెన్యూ గ్రామాలతో తొలిదశ అమలు
### నక్షలు లేని మరో 413 గ్రామాల్లో సర్వే జరిపిస్తాం
### రికార్డుల ఆధునీకరణే భూభారతి లక్ష్యం: మంత్రి పొంగులేటి


వనపర్తిలో సోమవారం నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రులు జూపల్లి, వాకిటి

**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** రాష్ట్రంలో భూసమస్యల శాశ్వత పరిష్కారానికి భూ సర్వే ఏకైక పరిష్కార మార్గమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం ప్రకారం భూసమస్యలకు సంబంధించి దీర్ఘకాలిక సమస్యల్లో కొన్నింటిని ఇప్పటికే పరిష్కరించడం జరిగిందని త్వరలో మరికొన్నింటికి పరిష్కారం చూపిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగా నాలుగు గోడల మధ్య ఆలోచన చేయకుండా ప్రజల కోణంలో ఆలోచన చేసి సమస్యను పరిష్కరిస్తున్నామని అన్నారు. భూ భారతి చట్టంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి భూ పార్శిల్‌కు ప్రత్యేక గుర్తింపు, జియో కోఆర్డినేట్స్‌తో కూడిన మ్యాప్, ఎల్‌పీఎం నంబర్ అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి వివరించారువనపర్తిలో సోమవారం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లావ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్,హౌసింగ్ అంశాలపై సమీక్ష అనంతరం మంత్రి పొంగులేటి తన సహచర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు.. రాష్ట్రంలో ధరణి చట్టం వలన ప్రజలకు కలిగిన అసౌర్యాలు,అవస్థలను రూపుమాపుతూ భూభారతి పోర్టల్‌లో పేర్కొన్నవిధంగా భూధార్‌కార్డులను అందించడమే ధ్యేయంగా ఈ ప్రజా ప్రభుత్వం సర్వే కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. భూ భారతి కింద 70 రెవెన్యూ గ్రామాలను తొలి దశలో సర్వేకు ఎంపిక చేయగా, రాష్ట్రంలో నక్షాలు అందుబాటులో లేని సుమారు 413 రెవెన్యూ గ్రామాలను కూడా దశలవారీగా సర్వే చేసే కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. భూ సర్వేను వేగవంతం చేసేందుకు అత్యాధునిక సాంకేతిక పరికరాలను ప్రభుత్వం పెద్ద ఎత్తునసమకూర్చిందని మంత్రి తెలిపారు. తొలి దశలో కొనుగోలు చేసిన రోవర్లతో పాటు రెండో దశలోనూ అదనపు రోవర్లను సమకూర్చి, జిల్లాల వారీగా అవసరానికి అనుగుణంగా అందిస్తున్నామని చెప్పారు. >>2

## ఓటుకు నోటు కేసులో రేవంత్‌కు ఊరట
రూ.50 లక్షల అటాచ్‌మెంట్ ఆర్డర్ రద్దు 3



## హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్‌కు పదోన్నతి

### సుప్రీం కోర్టుకు ముగ్గురు హైకోర్టు సిజెలను సిఫారసు చేసిన కొలీజియం
### తెలంగాణ హైకోర్టుకు మళ్లీ జస్టిస్ టి. వినోద్‌కుమార్ రాక

**హైదరాబాద్,సెప్టెంబరు28,ప్రభాతవార్త:** సుప్రీం కోర్టుకు కొత్తగా ముగ్గురు న్యాయమూర్తులు రానున్నారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో సోమవారం సమావేశమైన కొలీజియం మూడు రాష్ట్రాల హైకోర్టుల సీజేల పేర్లను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని సోమవారం నిర్ణయించింది. వీరిలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ ఉన్నారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ పీఎస్ నరసింహ సుప్రీంకోర్టు కొలీజియంలో సభ్యులుగా ఉన్నారు. సుప్రీం కోర్టులో మంజూరైన న్యాయమూర్తుల సంఖ్య 38 కాగా, ప్రస్తుతం 34 మంది న్యాయమూర్తులు ఉన్నారు. ఈ సిఫార్సులను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోద ముద్ర వేసిన తర్వాత కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ వీరి నియామకాల ఉత్తర్వుల్ని జారీ చేస్తుంది. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్, 2023 >>2

# లారీని ఢీకొన్న ఆటో


మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో ప్రమాదానికి గురైన ఆటో

### నస్పూర్‌లో ఘోర ప్రమాదం
### నలుగురు మహిళలు దుర్మరణం, ముగ్గురికి తీవ్రగాయాలు
### తక్షణ ఆర్థిక సాయం ప్రకటించిన మంత్రి వివేక్

**నస్పూర్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త:** మరో పది నిమిషాల్లో గమ్యస్థానానికి చేరుకోవాల్సిన వారిని లారీ రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. మంచిర్యాల జిల్లా నస్పూర్ పట్టణంలోని నస్పూర్ గేట్ సమీపంలోని 63వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళా ఉద్యోగులు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.మందమర్రి మండలం గుడిపల్లి, పొన్నారం గ్రామాలకు చెందిన పలువురు >>2



# మార్కెట్ 'ప్లేవర్' లేని కాలీఫ్లవర్!

### పంట పండినా పలకని ధర
### గిట్టుబాటులేక అలమటిస్తున్న రైతులు
### రవాణా ఖర్చులైనా రాక పంటను నేలపాలు చేస్తున్న దుస్థితి

ప్రభాతవార్త / న్యూస్ నెట్‌వర్క్

తెలుగు రాష్ట్రాల్లో కాలీఫ్లవర్ రైతులు పడుతున్న కష్టాలు కంటనీరు పెట్టిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి కాలిఫ్లవర్ పెద్దఎత్తున దిగుబడి వచ్చింది. తమ కష్టాలకు ప్రతిఫలం వచ్చిందని ఆశపడ్డ రైతులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర రాకపోవడంతో ఆడియాశలు అయ్యాయి. పంటను మార్కెట్‌కు తరలించేందుకు అయ్యే ఖర్చు కూడా రాకపోవడంతో చేలలోనే పంటను దుక్కిదున్ని మరో విడత సాగుకు సిద్దపడుతున్నారు. ఏపీ, తెలంగాణలో సుమారు 4,400 ఎకరాల్లో కాలీఫ్లవర్ సాగుచేస్తున్నారు. సుమారు 43 వేల టన్నులకు పైగా దిగుబడి వస్తోంది. ఈ సీజన్‌లో మరింత దిగుబడి పెరిగింది. కేజీకి కనీసం 8 నుంచి పది రూపాయలు ధర పలికితే ఖర్చులు పోను కొంత సొమ్ము మిగులుతుంది. అయితే వ్యాపారులు కేవలం రెండు నుంచి మూడు రూపాయలు ఇస్తానని చెప్పడంతో రైతులు చేలలోనే చతికిలపడే దుస్థితి ఏర్పడింది. ఒక ఎకరంలో పంటను పండించాలంటే సుమారు 60 నుంచి 80 వేల రూపాయలు ఖర్చు అవుతుంది. కూలీలకే 15 నుంచి 20 వేల రూపాయల వ్యయం అవుతుంది. ఇక రవాణాకు >>2



జీతాల కోసం సోమవారం గువాహాటిలో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు

# లారీని ఢీకొన్న ఆటో

>> మహిళలు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆసుపత్రి, డీమార్ట్, షాపింగ్ మాల్స్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం గుడిపల్లికి చెందిన సెగ్గెం ప్రశాంత్ ఆటోలో మంచిర్యాలకు బయలుదేరారు. నస్పూర్ గేట్ వద్దకు రాగానే అకస్మాత్తుగా ఎదురొచ్చిన బైక్‌ను తప్పించబోయిన ఆటో అదుపుతప్పి రాంగ్ రూట్‌లోకి దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న లారీ (టీఎస్ 19టీ 4959)ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రమాద తీవ్రతకు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి నర్సు అగ్గు సౌందర్య (38), షాపింగ్ మాల్ సేల్స్ గర్ల్ చింతకుంట లక్ష్మి (27) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. తీవ్రంగా గాయపడిన తోటపల్లి సోనియా (20), డీమార్ట్ సేల్స్ గర్ల్ సుమలత (25) మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. తీవ్ర గాయాలపాలైన రామటెంకి దివ్యవాణి, నారమల్ల లక్ష్మిలు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, పరిస్థితి విషమంగా ఉన్న నల్లూరి లక్ష్మిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. మృతురాలు సౌందర్య సోదరుడు అగ్గు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీసీ నస్పూర్ ఎస్సై ఎండీ తహసీనుద్దీన్ కేసు నమోదు చేయగా, మంచిర్యాల రూరల్ సీఐ గోపతి రవీందర్ దర్యాప్తు చేస్తున్నారు.

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీపీ**

ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, ఏసీపీ ఆర్. ప్రకాష్‌తో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ... ప్రాథమిక సీసీటీవీ దృశ్యాల ప్రకారం ఆటో రాంగ్ రూట్‌లోకి వచ్చి ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టినట్లు తెలుస్తోందన్నారు. డివైడర్‌లో ఉన్న ఖాళీ ద్వారా ప్రమాదకరంగా వాహనాలు మలుపు తిరుగుతున్నట్లు గుర్తించామని, రోడ్డు భద్రతా మార్గాలు చేపట్టి ఆ ఖాళీని మూసివేయిస్తామని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు కలెక్టర్‌తో సమన్వయం చేస్తున్నామని చెప్పారు.

**మంత్రి వివేక్ వెంకటస్వామి దిగ్భ్రాంతి - ఆర్థిక సాయం ప్రకటన**

ఈ ప్రమాదంపై రాష్ట్ర విద్యుత్, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు వ్యక్తిగతంగా రూ. 25 వేల చొప్పున, తీవ్రంగా గాయపడిన ముగ్గురు క్షతగాత్రులకు రూ. 10 వేల చొప్పున తక్షణ ఆర్థిక సాయం ప్రకటించారు. జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి, బాధితులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని ఆదేశించారు.



ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని మన్నూరు గ్రామంలో ట్రాక్టర్‌తో పంటను నేలమట్టం చేస్తున్న దృశ్యం

# మార్కెట్ 'ఫ్లేవర్' లేని కాలీఫ్లవర్!

>> 5 నుంచి పదివేల రూపాయలు చెల్లిం చాల్సి ఉంటుంది. ఒక ఎకరానికి సుమారు 9 వేల కిలోల పంట చేతికి వస్తుంది. కిలో పది రూపాయలకు విక్రయిస్తే ఖర్చులు పోను సుమారు 30 వేల మిగులుతాయి. అయితే ప్రస్తుతం రెండురూపాయలు ధర పలకడంతో కూలీల ఖర్చు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఆంధ్రప్ర దేశ్‌లో సెప్టెంబర్ పలమనేరు మార్కెట్‌లో కాలీఫ్లవర్ ధర క్వింటాల్‌కు మూడు వందల నుంచి నాలుగు వందలు పలికింది. కాలి ఫ్లవర్ అధికంగా సాగుచేసే ఆదిలాబాద్‌లో కూడా దాదాపు ఇదే పరిస్థితి కనిపించింది. గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కాలీఫ్లవర్ పాడైపోయే కూరగాయ కావడంతో రైతుకు ఎక్కువ రోజులు నిల్వ చేసుకునే అవకాశం ఉండదు. ధర తగ్గితే అయినకాడికి అమ్ము కునే దుస్థితిలో ఉన్నారు.

సాగు ఖర్చులు పెరగడం, విత్తనాలు, నారు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చు, నీటి పారుదల, రవాణా ఖర్చులు పెరగడం వల్ల రైతు పెట్టుబడి పెరుగుతోంది. మార్కెట్‌లో కాలిఫ్లవర్ ధర ఇటీవల కాలంలో తీవ్ర హెచ్చుతగ్గులు ఉండటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో రైతులు పూర్తిగా మధ్యవర్తులపై ఆధారపడటం వల్ల ఆశించిన మేరకు ధర లభించడం లేదు. చిన్న రైతులకు నేరుగా పెద్ద మార్కెట్లు లేదా విని యోగదారులకు అమ్మే అవకాశం తక్కువగా ఉన్నాయి. దీంతో స్థానిక వ్యాపారులు, కమీ షన్ ఏజెంట్లపై ఆధారపడాల్సి వస్తుంది. నిల్వ సదుపాయాల కొరతతో ఎక్కువ కాలం నిల్వ చేయడం సాధ్యం కాకపోవ డంతో ధర తగ్గినప్పుడు కూడా అమ్మక తప్పని పరిస్థితి ఎదురౌతోంది. ముఖ్యంగా ఈ పంటకు వాతావరణ పరిస్థితులు సహకరించాలి. ప్రస్తుత ఎల్‌నినో ప్రభావం వల్ల ఆశించిన మేరకు వర్షాలు కురవడం లేదు. అయినప్పటికీ దిగుబడి సాధించేందకు రైతులు అనేక అవస్థలు పడ్డారు. ఆశించిన మేరకు పంట దిగుబడిని సాధించేందుకు ఎరువులు, క్రిమి సంహారక మందుల కోసం ఎకరానికి సుమారు పది వేల రూపాయల వరకు ఖర్చు చేశారు. గత దశాబ్దకాలంగా చూస్తే ఇప్పటికి నాలుగైదు సార్లు ఇలాంటి పరిస్థితి ఎదురైంది. మరోసారి ధరలు తగ్గిపోతే కాలిఫ్లవర్‌ను సాగును పూర్తిగా నిలిపివేసే ప్రమాదం ఉంది. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని తమకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా 92,88,180 ఎస్ఐఆర్ నోటీసులు: సిఇఓ సుదర్శన్‌రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబరు28,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) నోటీసుల ప్రక్రియ కొనసాగుతోంది. 92,88,180 ఎస్ఐఆర్ నోటీసులు జనరేట్ చేసినట్లు సీఈవో సుదర్శన్ రెడ్డి సోమవారం వెల్లడించారు. ఇందులో 87,85,739 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. ఇంకా 5,02, 441 మందికి నోటీసులు జారీ కావాల్సి ఉందన్నారు. నోటీసులు అందుకున్నవారిలో 58,97,432 మంది ఓటర్ల హియరింగ్ పూర్తైందని తెలిపారు. సరైన పత్రాలు సమర్పించిన 45,54,236 ఓటర్లను తుది జాబితాకు అర్హులుగా నిర్ధారించినట్లు వివరించారు.

# భూ సమస్యలకు 'రీసర్వే'

>> అలాగే వేలాది మంది సర్వేయర్లకు లైసెన్సులు మంజూరు చేసి క్షేత్రస్థాయిలో సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామని తెలిపారు. సర్వేయర్లు ఎలాంటి రాజకీయ ప్రచారాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వ కార్యక్రమంలో భాగస్వాములై రైతులకు శాశ్వత ప్రయోజనం చేకూర్చాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా సాగులో ఉన్న ప్పటికీ సరైన టైటిల్ లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాల సమస్యలను కూడా గుర్తించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. సాదాబైనా మాలు, భూ హద్దుల వివాదాలు, పాత రికా ర్డుల్లోని లోపాలు, అబాది ఆస్తుల వివరాలు వంటి గ్రామీణ ప్రాంత సమస్యలకు సమగ్ర సర్వే ద్వారా శాశ్వత పరిష్కారం చూపవచ్చ న్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రికార్డులు, మ్యాపులను ఆధునీకరించడం భూ భారతి లక్ష్యమన్నారు. గ్రామాల్లో ఇళ్ల స్థలాలు, నివాస ప్రాంతాలు, అబాది ఆస్తుల పై గతంలో విస్తీర్ణానికి సంబంధించిన స్పష్ట మైన మ్యాపింగ్ లేకపోయిన సందర్భాలు ఉన్నాయని మంత్రి చెప్పారు. ఇకపై సర్వే ద్వారా ఆ ఆస్తి ఎన్ని గజాల్లో ఉంది, దాని హద్దులు ఎక్కడున్నాయి అనే వివరాలను మ్యాప్‌తో సహా రికార్డుల్లో పొందుపరుస్తా మని తెలిపారు. భూ భారతి చట్టం అబాది, వ్యవసాయేతర భూములకు ప్రత్యేక రికార్డులు నిర్వహించడం, వాటి మూలలను జియోకోఆర్డినేట్లతో మ్యాప్ చేయడం కోసం నిబంధనలు కలిగి ఉందని వివరించారు.

**ఇందిరమ్మ ఇళ్లలో రాజకీయాలకు తావులేదు..**

భూ సమస్యల పరిష్కారంతో పాటు పేదల సొంతింటి కలను సాకారం చేయడంలోనూ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి తెలిపారు. తొలి విడతలో మంజూరైన 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో ఇప్పటికే రెండు లక్షలకు పైగా ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్లను కూడా లక్ష్యబద్ధంగా పూర్తి చేస్తామని చెప్పారు. రెండో విడతలో నిర్మాణం ప్రారంభించే ఇళ్లలో గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పేదల ఇళ్లకు కూడా ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. "గుడిసె లేని రాష్ట్రం" చేయాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రెండో విడతలో అవకాశం రాని అర్హులైన పేదలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆర్థిక పరిస్థితులు ఎన్ని సవాళ్లు ఎదురైనా మూడో విడత, నాలుగో విడతల ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి స్పష్టం చేశారు.

## వారం - వర్జ్యం

29-09-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం, చిత్త కార్తె
తి. తదియ సా.5.08, న. అశ్వని ఉ.9.02
వ.సా.6.04 - రా.7.34
దు.ఉ.8.21 - ఉ.9.09
2) రా.10.47 - రా.11.35
రాహు. మ.3.00-4.30 శుభ స. ఉ.6.00 - ఉ.7.00

## వార్తాఫలం

**మేషం:** పలుకుబడి హోదా పెంపొందుతాయి. అలవాట్లలో మార్పులు చేస్తారు. గోప్యతకు ప్రాధాన్యతనిస్తారు.

**వృషభం:** క్రయవిక్రయాలలో మధ్యవర్తులను ఆశ్రయిస్తారు. కీళ్ళ నొప్పులు బాధిస్తాయి. రహస్య ఋణాలను చేస్తారు.

**మిథునం:** చిన్నవిషయాలపైన కూడా శ్రద్ధను కనబరుస్తారు. సన్నిహితుల సహాయ సహకారాలను సంపూర్ణంగా అందుకుంటారు.

**కర్కాటకం :** వ్యూహాత్మకంగా వ్యవహరిస్తారు. వినోద కార్యక్రమాలలో చురుగ్గాపాల్గొంటారు. విదేశీయాన ప్రయత్నాలు కలిసి వస్తాయి.

**సింహం :** బాధ్యతలకు ప్రాధాన్యతనిచ్చి కుటుంబ అవసరాలపైన దృష్టిని సారిస్తారు. ఉద్యోగ యత్నాలు కలిసి వస్తాయి.

**కన్య :** ఎలక్ట్రానిక్ మీడియాపట్ల అమితంగా ఆకర్షితులవుతారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి అడుగును జాగ్రత్తగా వేస్తారు.

**తుల :** వ్యవహారాలలో ప్రత్యక్ష పర్యవేక్షణ అవసరమ వుతుంది. వినోద కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటారు.

**వృశ్చికం :** సన్నిహితుల సహాయ సహకారాలను సంపూర్ణంగా అందుకుంటారు. సౌందర్య సాధక చిట్కాల పట్ల ఆకర్షితులవుతారు.


**ధనుస్సు:** సహోదర, సహోదరీ వర్గానికి మీ వంతు సహాయ సహకారాలను అందిస్తారు. అధికంగా శ్రమిస్తారు.

**మకరం:** శత్రువర్గం నుండి పరోక్షంగా చికాకులను ఎదుర్కొంటారు. దిశా, దశా లేకుండా ఆలోచనలు సాగిస్తారు.

**కుంభం:** ఆత్మసాక్షికి విరుద్ధంగా ఏపనీ చేయరు. వ్యాపారస్తులకు నేడు అనుకూలంగా ఉంది. మధ్యవర్తులను ఆశ్రయిస్తారు.

**మీనం :** మీరు చేసే మంచి పనికి గాను ప్రోత్సాహం లభిస్తుంది. పరోపకార బుద్ధిని కలిగి ఉంటారు. అధికంగా శ్రమిస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న డి.సిఎం భట్టి, మంత్రులు, పిసిసి చీఫ్ తదితరులు

# దేశవ్యాప్తంగా ఆందోళనలు

>> చేశాయి. దేశంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ పై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు 10 నెలల వ్యవధిలో 14 అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన నివేదికల నేపథ్యంలో కాంగ్రెస్, ఇతర విపక్ష పార్టీలు జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి. ముఖ్యంగా ఫారం6 చేర్పు సహా పలు అంశాలపై అభ్యంతరాలు వ్యక్తమైనట్లు విపక్షాలు పేర్కొంటున్నాయి. ఈ నివేదికలు వెలువడిన తర్వాత ఎన్నికల విశ్వసనీయతపై విపక్షాలు ప్రశ్నలు లేవనెత్తాయి. లక్షలాది మంది ఓటర్ల పేర్లను తొలగించారంటూ గతంలో చేసిన ఓటు చోరీ ఆరోపణలను మరోసారి తెరపైకి తెచ్చాయి. సర్ విషయంలో ఎన్నికల సంఘంలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం ఎన్నికల పవిత్రతను దెబ్బతీస్తోందని ఆరోపించాయి. సర్‌కు ముందు ఉన్న ఓటర్ల జాబితాను పునరుద్ధరించాలని, జ్ఞానేశ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలను రద్దు చేయాలని, ప్రస్తుత సీఈసీని అరెస్టు చేసి అభిశంసనకు గురిచేయాలని కూడా విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. కాంగ్రెస్ దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నికల సంఘం, ముఖ్యంగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారని ఆయన తెలిపారు. తమిళనాడులోని శివగంగై జిల్లా కారైకుడిలో నిర్వహించిన నిరసనలో పాల్గొన్న చిదంబరం మాట్లాడుతూ ప్రజల్లో ఎన్నికల సంఘంపై తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తమైందని చెప్పారు. ఓటర్ల జాబితా నుంచి 13.30 కోట్ల మంది పెద్దల పేర్లు తొలగించారని ఆయన ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లోని గత అనుభవాలను పరిశీలిస్తే, ఈ వ్యక్తులు ట్రైబ్యునల్‌ను ఆశ్రయిస్తే వారి అప్పీళ్లలో 91 శాతం వరకు అనుకూలంగా తీర్పు వచ్చి పేర్లు తిరిగి ఓటర్ల జాబితాలో చేరే అవకాశం ఉందని చిదంబరం పేర్కొన్నారు. భారీ స్థాయిలో ఓటు హక్కు కోల్పోయే పరిస్థితికి ఎన్నికల సంఘమే పూర్తి బాధ్యత వహించాలని ఆయన అన్నారు. సర్ ప్రక్రియలోని లోపాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని ఆరోపించారు. సర్‌ను వెంటనే నిలిపివేసి, ఓటు హక్కు కోల్పోయిన వారికి న్యాయం చేసేందుకు మార్గాలను అన్వేషించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ కార్యకర్తల ర్యాలీకి పోలీసుల అడ్డుకట్టఢిల్లీలో కాంగ్రెస్ కార్యకర్తలు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లోని పార్టీ కార్యాలయం వద్దకు చేరుకుని, అక్కడి నుంచి ఎన్నికల సదన్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని అడ్డుకున్నారు. ప్రత్యేకంగా జేజే క్లస్టర్లు, అనధికార కాలనీల్లో నివసించే ప్రజలు ఎన్నికల అధికారులు కోరిన పత్రాలను నిర్ణీత గడువులో సమర్పించడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారని కాంగ్రెస్ ఆరోపించింది.




సోమవారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

# ఇక సర్ గో బ్యాక్

>> ఏటా జనాభా పెరుగుతోంది. మన ఓటు హక్కును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించుకున్నాం. ఎందుకు ప్రధానమంత్రి మోదీ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ కోట్ల ఓట్లు తొలగిస్తారు. దాని అర్థం ఏమిటి?
అని ప్రశ్నించారు. 'ప్రజల సగటు ఆయుర్ధాయం పెరిగింది. ఓట్లు పెరుగుతాయి. గతంలో ఓట్లు పెరిగిన తీరు చూడండి. ఇప్పుడు 30 కోట్ల ఓట్లు తొలగించాని మోదీ చూస్తున్నారు. తనను ఎవరైతే వ్యతిరేకించారో వాళ్ల ఓట్లు తొలగిస్తారు. వాళ్లకు ఉన్న ఆయుధం వాట్సాప్, సోషల్ మీడియా. ఎవరైతే వాళ్లకు వ్యతిరేకంగా పోస్టులు పెడతారో, వాళ్ల మతం, కులం ఏవీ పట్టించుకోకుండా ఓట్లు తొలగిస్తారు. మోదీజీకి అనుకూలంగా ఉన్నవారికి ఓటు హక్కు ఉంటుంది' ఆరోపించారు. 'గతంలో బూత్ లెవల్ అధికారం బూత్ లెవల్ అధికారికి, కలెక్టర్ అధికారం కలెక్టర్‌కి ఉండేది. ఇప్పుడు బూత్ లెవల్ అధికారి నుంచి ఎన్నికల కమిషన్ వరకు అన్ని అధికారాలు ఎన్నికల కమిషన్ గుప్పిట్లో పెట్టుకున్నారు. నా గ్రామంలో ఎవరు ఉన్నారో, ఎవరు చనిపోయారో, ఎవరు ఊరు వదిలారో నాకు తెలుసు, ఇప్పుడు ఏఐ టెక్నాలజీ వాడి ఓట్లు తీసివేస్తున్నారు. ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో ఇద్దరు కమిషనర్లకు తెలియకుండా జ్ఞానేష్ కుమార్ అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు. మన భారత రాజ్యాంగ నేతలు ఈ దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలను అభిలాషించారు. కానీ, ప్రధాని మోదీ, ఎన్నికల సంఘం పేరుతో పెద్ద ఎత్తున కుట్ర చేస్తున్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ సమస్య కాదు.. దేశ ప్రజాస్వామిక సమస్య అని స్పష్టం చేశారు. 'నార్త్ కొరియాలో కిమ్‌దే పార్టీ. ఆయనకే ఓటు వేయాలి. ఒకటే టీవీ ఆయననే చూపించాలి. జ్ఞానేష్ కుమార్‌ను పది రోజులు నార్త్ కొరియా పంపిస్తే, కిమ్ దగ్గర శిక్షణ తీసుకొని వచ్చి మోదీకి వందకు వంద శాతం ఓట్లు వేయిస్తారు, సైమన్ గోబ్యాక్ నినాదం కింద నాడు దేశం ఏకమైనట్లు, రానున్న రోజుల్లో సర్ గో బ్యాక్ నినాదం కింద దేశం ఏకమవుతుంది. అది మమతా బెనర్జీ, శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే, స్టాలిన్ ఎవరైనా కావచ్చు. అంతా ఒకటవుతారు అని చెప్పారు. తెలంగాణలో విద్యార్థి సంఘాలు చాలా తక్కువ.. లెఫ్ట్, రైట్ సంఘాలున్నాయి. ఎన్ఎస్ఐయూ ప్రభావం పెద్దగా లేదు. ఉత్తర భారతదేశంలో, దక్షి ణ భారతదేశంలో రాజకీయాల శైలి వేరు... మా దగ్గర యూనివర్సిటీ లా కాలేజ్, ఆర్ట్స్ కాలేజీ నాయకునిగా ఏబీవీపీలో గెలిచిన వారు తర్వాత కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తారు. యూనివర్సిటీలో విద్యార్థి సంఘంలో ఉన్నా, గ్రామానికి వెళ్లిన తర్వాత ఆ కుటుంబం కాంగ్రెస్‌లోనే ఉంటుంది. తెలంగాణలో బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం లేదు. స్టూడెంట్ రాజకీయాల్లో ఏబీవీపీ ప్రభావం ఉంటే.. రాజకీయాల్లోకాంగ్రెస్ ప్రభావం ఉంటుంది అని చెప్పారు. 'రాష్ట్రంలో 2014 ఎన్నికల తర్వాత పోటీ కేసీఆర్, రేవంత్ మధ్య పోటీగా మారింది. ఆయన నన్ను అనేక సార్లు జైలుకు పంపారు. నేను అసెంబ్లీకి కన్నా జైలుకే ఎక్కువ సార్లు పోయా... రాహుల్ గాంధీని కలిసిన తర్వాత 15 నిమిషాలు మాట్లాడాం.. ఆ రోజే ఆయన నా నాయకుడి అని నిర్ణయించుకున్నా... రాహుల్ గాంధీకి ఎటువంటి వ్యక్తిగత అజెండాలు లేవు.. ఆయనకు దేశమే ముఖ్యం.. నేను విద్యార్థి సంఘంలో ఉన్నా.. నాయుడు పార్టీలో ఉన్నా దేశం, రాష్ట్రం కోసం ఏదైనా చేయాలనుకున్నా అని చెప్పారు. గుజరాత్ సీఎంగా మోదీ ఉన్నప్పుడు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ తన హుందాతనంతో వ్యవహరించి గుజరాత్ అభివృద్ధి చాలా సహకరించారు. మన్మోహన్ సింగ్ మోదీకి ఇచ్చిన మద్దతులో 10 శాతం కూడా ఆయన మాకు మద్దతు ఇవ్వడం లేదు' అని ఆరోపిచారు. మన్మోహన్‌సింగ్ గుజరాత్‌కు అవసరమైనవన్నీ ఇచ్చారు. మేం కలిసినప్పుడు మోదీ మంచిగానే ఉంటారు. కానీ మా రాష్ట్రానికి మెట్రో రైలు, రీజినల్ రింగు రోడ్డు, జాతీయ రహదారుల విస్తరణకు ఏమాత్రం సహకరించడం లేదు. 360 కిలోమీటర్ల రీజినల్ రింగు రోడ్డుకు టెండర్లు పిలిచాం. రెండేళ్లవుతున్నా పీఎం కార్యాలయంలో ఉంచుకున్నారు. మేం నితిన్ గడ్కరీని ఎప్పుడూ అడిగినా... నా చేతిలో ఏమీ లేదు, మోదీ దగ్గర ఫైల్ ఉందంటాడు. ప్రధానమంత్రి అయిన తర్వాత గుజరాత్, తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ లకు ఉన్న అవకాశాలను ప్రోత్సహించాలి. గుజరాత్‌లో పోర్ట్ ఉంది. వాళ్లకు ఉన్న అవకాశం అంది. మా దగ్గర ఎయిర్‌పోర్ట్, జ్ఞానవంతులు ఉన్నారు.. సత్య నాదెళ్ల, శంతను నారాయణన్, అజయ్ బంగా, ప్రేమ్ శ్రీవాత్సవ్ అంతా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్నారు. నాకు ఐఎస్‌బీ, ఐఐటీ, నల్సార్ ఉన్నాయి. ఎక్కడో నిపుణులుంటారో అక్కడకు కంపెనీలు వస్తాయి. సెమీ కండక్టర్ ప్రాజెక్టును చివరి నిమిషంలో గుజరాత్ తీసుకెళ్లారు అని ఆరోపించారు. మోదీ ఉత్తరప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నా గుజరాత్‌కే అన్నీ తీసుకెళుతున్నారు. బెదిరించి తీసుకెళుతున్నారు. ఉత్తరప్రదేశ్‌కు ఎన్ని కంపెనీలు తీసుకెళ్లారు.. గుజరాత్‌కు ఎన్ని తీసుకెళ్లారు అని విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన సమస్య ఏమిటంటే రాజకీయాలు అంకెల ఆట... సమ ఉజ్జీల మధ్య సంప్రదింపులు సాగుతాయి.. బలవంతులు, బలహీనుల మధ్య కాదు...రాజకీయాల్లో మీ దగ్గర సంఖ్యా బలం ఉంటేనే ఢిల్లీ పిలిచి మాట్లాడుతుంది. లేకపోతే గేటు దగ్గరకు రానివ్వరు.. అందుకే నేను సాధారణమైన పరిష్కారం చూపుతున్నా... 1976లో ఇందిరా గాంధీ గారు 543 సీట్లకు లోక్‌సభ స్థానాలను ఫ్రీజ్ చేశారు. కేంద్రం కుటుంబ నియంత్రణ పిలుపునిస్తే దక్షి ణాది రాష్ట్రాలు అమలు చేశాయి. ఉత్తరాదిలో అది జరగలేదు. దీంతో జనాభాలో హెచ్చుతగ్గులు పెరిగాయి. అందుకే ఇందిరా గాంధీ గారు 25 ఏళ్లు ఆ సంఖ్యను ఫ్రీజ్ చేశారు. తర్వాత వచ్చిన వాజ్‌పేయీ జీ మరో 25 ఏళ్లు దాన్ని పొడిగించారు. 2026లో మోదీ అలానే మరో 25 ఏళ్లు పొడిగిస్తే ఎవరికీ ఇబ్బంది రాదు. కానీ, మోదీజీ ... డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల పేరుతో పెద్ద రాష్ట్రాలకు మరింత ప్రాతినిధ్యం పెంచుతూ, చిన్న రాష్ట్రాలను ఖతం చేయాలని చూస్తున్నారు. కేరళలో ప్రస్తుతం 20 లోక్‌సభ సీట్లు, ఉత్తరప్రదేశ్‌లో 80 సీట్లు ఉన్నాయి. ఈ రెండింటి మధ్య 60 సీట్లు తేడా ఉన్నాయి. 50 శాతం పెంచితే కేరళలో 30, ఉత్తరప్రదేశ్‌లో 120 సీట్లు అవుతాయి. అప్పుడు ఈ రెండు రాష్ట్రాల మధ్య సీట్ల తేడా 90 అవుతుంది. ఒక్క నెంబర్‌తో అటల్ జీ ప్రభుత్వం పడిపోయింది. ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్, రాజస్థాన్, బీమారు రాష్ట్రాలకు భారీగా సీట్లు పెరుగుతాయి. మా దగ్గర నెంబర్లు లేనప్పుడు మాకు ఏం ప్రాధాన్యత ఉంటుంది అని ప్రశ్నించారు.

# జ్ఞానేశ్ దిగిపోవాలి

>> జరుగుతున్నాయన్న ఆరోపణలపై ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ నగరంలోని నెక్లెస్ రోడ్డులో సోమవారం కాంగ్రెస్ నేతలు నిరసనకు దిగారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో లోపాలకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి ఈసీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నేతలు నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల నిర్వహణలో నిష్పాక్షికత లోపించిందని ఓటర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని పేర్కొన్నారు. దేశంలో ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేలా వ్యవహారాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ల పనితీరుపై అధికారుల్లోనూ అసంతృప్తి ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గుతోందన్నది కాంగ్రెస్ పార్టీ ప్రధాన ఆరోపణగా పేర్కొన్నారు. బిహార్‌లో ఆర్జేడీ, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల ఫలితాల వెనుక ఎన్నికల సంఘం మోసపూరిత వైఖరి ఉందని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత మీనాక్షి నటరాజన్ గెలవాల్సిన రాజ్యసభ స్థానాన్ని కూడా కుట్రపూరితంగా కోల్పోయేలా చేశారని విమర్శించారు. ఓట్ల అక్రమాల ద్వారా ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతోందని ఆయన అన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

# అపరేష్‌కు పదోన్నతి

>> జూలై నుంచి గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె 1990లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 2011 నవంబర్ లో అలహాబాద్ హైకోర్టుకు పదోన్నతి పొందారు. పదోన్నతి పొందితే సుప్రీం కోర్టు పదవీ విరమణ వయస్సు అయిన 65 సంవత్సరాలకు చేరుకోవడానికి ఆమెకు దాదాపు ఐదు సంవత్సరాల సమయం ఉంటుంది. జస్టిస్ ఉపాధ్యాయ 2023 జూలై నుంచి బొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. ఆ తర్వాత 2025 జనవరి నుంచి ఢిల్లీ హైకోర్టు సీజేగా కొనసాగుతున్నారు. ఆయన 1991లో న్యాయవాదిగా నమోదు చేసుకుని, 2011 నవంబర్ లో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. పదోన్నతికి ముందు, ఆయన ఉత్తర ప్రదేశ్ ప్రధాన స్టాండింగ్ కౌన్సెల్‌గానూ పనిచేశారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఆపరేషన్ సింగ్, పట్నా, ఝార్ఖండ్ హైకోర్టుల్లో ప్రాక్టీస్ చేశారు. జస్టిస్ సింగ్ ఢిల్లీ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం అభ్యసించారు. ఆయన 1990 నుంచి 2000 వరకు పట్నా హైకోర్టులో, ఆ తర్వాత 2012లో ఝార్ఖండ్ హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందే వరకు అక్కడే న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2022 డిసెంబర్ 20 నుంచి 2023 ఫిబ్రవరి 19 వరకు ఆ హైకోర్టుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. అనంతరం త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొంది 2023 ఏప్రిల్ 17న ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత 2025 జూలైలో తెలంగాణ హైకోర్టు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల సుప్రీంకోర్టుకు న్యాయమూర్తులుగా కొత్తగా ఐదుగురిని కొలీజియం నియమించింది. పంజాబ్ హరియాణా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శీల్‌నాగు, బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీచంద్రశేఖర్, మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ, జమ్మూకశ్మీర్‌లద్దాఖ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుణ్‌పల్లి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వెంకిట సుబ్రమణి మోహన పేర్లను సుప్రీంకోర్టు న్యాయమూర్తి పదవులకు పదొన్నతి కల్పించింది. కాగా, ప్రస్తుతం చెన్నై హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ టి. వినోద్‌కుమార్‌ను మళ్లీ తెలంగాణ హైకోర్టు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియ నిర్ణయం తీసుకుంది. గతంలో తెలంగాణ హైకోర్టులో పనిచేసి చెన్నైకి బదిలీ అయ్యారు.

# ఉద్యోగాలకు పరీక్షలు

>> అందుబాటులో ఉన్న సమాచారం చెబుతోంది. రోడ్లు, భవనాల శాఖ (ఆర్ అండ్ బీ)లోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (సివిల్) పోస్టులకు సంబంధించిన నియామక పరీక్షను 2 రోజుల పాటు నిర్వహించనున్నారు. నవంబర్ 6, 7వ తేదీల్లో సీబీటీ విధానంలో పరీక్షలు జరుగుతాయి. ఈ కేటగిరీలో 222 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (సివిల్) పోస్టులకు సంబంధించిన నియామక ప్రక్రియ కొనసాగుతోంది. ఇంజినీరింగ్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు పరీక్ష తేదీలను దృష్టిలో ఉంచుకుని సబ్జెక్టుల వారీగా ప్రిపరేషన్‌ను పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. పాఠశాల విద్యాశాఖలోని డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ (డీఈఓ)/గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్‌। పోస్టులకు సంబంధించిన పరీక్షలను నవంబర్ 12, 13వ తేదీల్లో నిర్వహించనున్నట్లు టీజీపీఎస్సీ వెల్లడించింది. ఈ పరీక్ష కూడా కంప్యూటర్ ఆధారిత విధానంలోనే ఉంటుంది. ప్రస్తుతం టీజీపీఎస్సీ పరీక్షల తేదీలను ప్రకటించింది. పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు, పరీక్షా కేంద్రాల వివరాలను త్వరలో అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు కమిషన్ తెలిపింది. అభ్యర్థులు టీజీపీఎస్సీ నుంచి వచ్చే తదుపరి అధికారిక ప్రకటనలను గమనిస్తూ ఉండాలని పేర్కొంది.

# లోకల్ రిజర్వేషన్‌పై 'సుప్రీం' స్పష్టత

**హైదరాబాద్,సెప్టెంబరు28,ప్రభాతవార్త:** తెలంగాణలో లోకల్ రిజర్వేషన్‌కు సంబంధించి సుప్రీంకోర్టు మరోసారి స్పష్టతనిచ్చింది. తెలంగాణ లోకల్ రిజర్వేషన్‌కు నాలుగేళ్ల రూల్ తప్పనిసరి అని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారమే స్థానిక రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే అని పేర్కొంది. గతంలో జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఈరోజు సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. తెలంగాణ లోకల్ రిజర్వేషన్‌కు నాలుగేళ్ల విద్యాభ్యాసం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ అంకిత వేసిన పిటిషన్‌ను ధర్మాసనం డిస్మిస్ చేసింది. ఈ నిబంధన ఏకపక్షంగా ఉందన్న వాదనను జస్టిస్ పీఎస్ నరసింహా ధర్మాసనం కొట్టివేసింది. ఎంబీబీఎస్ అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులకే స్థానిక రిజర్వేషన్ వర్తిస్తుందని స్పష్టం చేసింది. తెలంగాణ ప్రభుత్వం గతంలో విడుదల చేసిన జీవోను సుప్రీం ధర్మాసనం మరోమారు సమర్థించింది

తెలంగాణ ప్రభుత్వం

**రెవెన్యూ (భూసేకరణ) శాఖ**

**ఫారం-సి**

**ప్రకటన**

(చట్టం యొక్క సెక్షన్ 11 క్రింద ఏదైతే 10 మినహాయింపు ఇవ్వబడినది)(రూల్ 6/12 చూడండి)

నం. రెవ్/జి1/ఎల్ఏజి/0034/2026-జి-సెక్షన్ తేది: 18.09.2026.

గజిట్ నం.67/2026 తేది: 21.09.2026

ఏదైతే, తెలంగాణ ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్ వారు భావించునది ఏమనగా, పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ క్రింద గుర్‌కుంట గ్రామ యొక్క గ్రామపరిధిలో కి.మీ. 0.700 నుండి 1.137 వరకు ఉదండపూర్ రిజర్వాయర్ నుండి కెపి లక్ష్మిదేవిపల్లి రిజర్వాయర్ వరకు ఉమ్మడి కాలువ పేరేతో, ప్రజాఅవసరార్థం, మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట్ మండలం యొక్క గుర్‌కుంట గ్రామంలో మొత్తం **ఎక. 102.08 1/2 గుంటల** విస్తీర్ణపు భూమి అవసరమైనదిగా భావిస్తుంది. భూ సేకరణ, పునరావాస చట్టం 2013 (కేంద్ర చట్టం 30 ఆఫ్ 2013) లో ఆర్ఎఫ్‌సిటి ఎల్ఏ ఆర్& ఆర్ (తెలంగాణ సవరణ చట్టం 2016 (చట్టం నం.21 ఆఫ్ ఆఫ్ 2017) ద్వారా పారదర్శక పరిహారం మరియు పారదర్శకత్వంకు హక్కుల యొక్క చాప్టర్-2&3 యొక్క నియమాల యొక్క దరఖాస్తు నుండి పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ జి.ఓ.ఎంఎస్.నం.37. ఐ& సిఏడి (ఎల్ఏ. ఆర్& ఆర్/ఏ2) శాఖ ఆధారంగా ప్రభుత్వం మినహాయింపును ఇచ్చింది.

చట్టం యొక్క రూల్స్ & ప్రొక్యూర్‌మెంట్ నం.రెవ్/జి1-మహబూబ్‌నగర్ కలెక్టర్ వారి ఎల్ఏజి/0174/2017- జి-సెక్షన్ తేది: 24.10.2017 క్రింద, భూసేకరణ అధికారి గా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, యూనిట్-2, మహబూబ్‌నగర్ వారిని నియమించారు.

కావున ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, మహబూబ్‌నగర్ జిల్లా యొక్క నవాబ్‌పేట్ మండలం యొక్క గుర్‌కుంట గ్రామంలో పై సదరు ప్రాజెక్ట్ కొరకు స్టాండర్డ్ ప్రమాణాల యొక్క **ఎక. 102.08 1/2 గుంటలకు** కొంతమేర ఎక్కువ లేదా తక్కువ భాగం, ఏదైతే దిగువ విధంగా వివరించినట్లు భూసేకరణచేయబడును.

గ్రామం: గుర్‌కుంట మండలం: నవాబ్‌పేట్ జిల్లా: మహబూబ్‌నగర్

| క్ర. సం. | సర్వే నెం | మెట్ట/ ఐడీ/ తరి | భూమి రకం | భూసేకరణలో ప్రతిపాదనలో ఉన్న ప్రాంతం ఎకరాలు, గుంటలు | ఆసక్తిగల వ్యక్తి పేరు మరియు చిరునామా | సరిహద్దులు | | | | చెట్లు | నిర్మాణములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 1 | 125 | మెట్ట | పట్టా | 1.08 | సల్లా సంధ్య భర్త సల్లా దేవేందర్ యాదవ్ | | | | | | |
| 2 | 125 | మెట్ట | పట్టా | 0.16 | మల్లుంకర్ శ్రీను తండ్రి బలరామ్ | | | | | మర్రిచెట్టు -1 | |
| 3 | 125 | మెట్ట | పట్టా | 0.23 | గోడ గోపాల్ తండ్రి గోడ రాంచంద్రయ్య | | | | | | |
| 4 | 125 | మెట్ట | పట్టా | 0.23 | గోడ పురుషోత్తం తండ్రి గోడ రాములు | | | | | | |
| 5 | 125 | మెట్ట | పట్టా | 0.20 | పాలు ప్రకాశ్ ఘునాకర్ తండ్రి మురలీధర్ | | | | | | |
| 6 | 125 | మెట్ట | పట్టా | 0.18 | బి శైలజ తండ్రి విజయ ప్రకాశ్ | | | | | | |
| 7 | 125 | మెట్ట | పట్టా | 0.10 | నర్సింలు తండ్రి చిన్న బుగ్గోజి | | | | | జమ్మి-2 | |
| 8 | 125 | మెట్ట | పట్టా | 0.06 1/2 | ఎం. ఆదర్శ్ కుమారి తండ్రి చంద్ర బాబా | | | | | | |
| 9 | 125 | మెట్ట | పట్టా | 0.10 | మలుతుకర్ చిన్నకిషన్ జీ తండ్రి బొగ్గోజి | | | | | | |
| 10 | 125 | మెట్ట | పట్టా | 0.20 | మలుతుకర్ మహేశ్వర్‌జీ తండ్రి మొగులాజీ | | | | | | |
| 11 | 125 | మెట్ట | పట్టా | 0.06 1/2 | మలుతుకర్ మహేశ్వర్‌జీ తండ్రి మొగులాజీ | | | | | | |
| 12 | 125 | మెట్ట | పట్టా | 0.07 | కటికే నర్సింలు తండ్రి కటికే మొగులాజీ | | | | | | |
| 13 | 126 | మెట్ట | పట్టా | 0.05 | పోమల రాఘవేందర్ తండ్రి క్రిష్టయ్య | | | | | పామ్‌ఆయిల్ మొక్కలు40 | |
| 14 | 126 | మెట్ట | పట్టా | 0.06 | పోమల మహేష్ తండ్రి క్రిష్టయ్య | | | | | వేప-1 | |
| 15 | 127 | మెట్ట | పట్టా | 0.26 | శ్రీనివాసులు తండ్రి బొర్ర రాంచంద్రయ్య | | | | | మామిడి-9 చింత-3 మర్రిచెట్లు1 మేరడిచెట్లు టేకుచెట్లు3 వేపచెట్లు 6 జామచెట్లు5 | బోర్‌బావులు 4, బావి1 పైప్‌లైన్2, పశువుల పాకలు 2 |
| 16 | 127 | మెట్ట | పట్టా | 1.07 | బొర్ర శ్రీశైలం తండ్రి బొర్ర రామ్ చంద్రయ్య | | | | | - | |
| 17 | 127 | మెట్ట | పట్టా | 1.06 | బి క్రిష్టయ్య తండ్రి బొర్ర రామ్ చంద్రయ్య | | | | | - | |
| 18 | 127 | మెట్ట | పట్టా | 0.01 | బొర్ర బుద్దమ్మ భర్త మైసయ్య | | | | | - | |
| 19 | 127 | మెట్ట | పట్టా | 1.01 | బొర్ర బంజయ్య తండ్రి హన్మయ్య | | | | | వేప-10 టేకు-10 | |
| 20 | 127 | మెట్ట | పట్టా | 3.03 | బొర్ర కాశమ్మ భర్త రాంచంద్రయ్య | | | | | టేకు-10 వేప-5 | |
| 21 | 127 | మెట్ట | పట్టా | 0.26 | శ్రీనివాసులు తండ్రి రాంచంద్రయ్య | | | | | | |
| 22 | 128 | మెట్ట | పట్టా | 0.30 | బొండపాటి శ్రీనివాస్‌గౌడ్ తండ్రి బొండపాటి బాల్‌రాజ్ గౌడ్ | | | | | | |
| 23 | 128 | మెట్ట | పట్టా | 0.23 | పాలమోని పద్మమ్మ భర్త వెంకటయ్య | | | | | తుమ్మ-5 | |
| 24 | 128 | మెట్ట | పట్టా | 3.00 | పోమల చిలకమ్మ భర్త వెంకటయ్య | | | | | | |
| 25 | 128 | మెట్ట | పట్టా | 1.20 | మల్లే మైబయ్య తండ్రి మల్లే యల్లప్ప | | | | | | బోర్‌బావులు 2, పైప్‌లైన్ 1,పశువుల పాక-1 |
| 26 | 128 | మెట్ట | పట్టా | 1.38 | చెన్నయ్య భర్త వెంకటయ్య | | | | | | బోర్‌బావులు 3,పైప్‌లైన్ 1,పశువుల పాక-1 |
| 27 | 128 | మెట్ట | పట్టా | 0.20 | మచ్చమోని శ్రీనివాస్ తండ్రి మచ్చమోని యాదయ్య | | | | | | |
| 28 | 129 | మెట్ట | పట్టా | 0.25 | బొర్ర శ్రీశైలం తండ్రి బొర్ర రామ్ చంద్రయ్య | | | | | | బోర్‌బావులు 1,పైప్‌లైన్ |
| 29 | 129 | మెట్ట | పట్టా | 0.25 | బి. క్రిష్ణ తండ్రి బొర్ర రాంచంద్రయ్య | | | | | | 1,పైప్‌లైన్ 1 |
| 30 | 129 | మెట్ట | పట్టా | 1.20 | గుండ్ల రాములు తండ్రి గుండ్ల మైసయ్య | | | | | | |
| 31 | 129 | మెట్ట | పట్టా | 0.20 | యం. సురేష్ తండ్రి క్రిష్టయ్య | | | | | మామిడి-8 వేప-10 టేకు-6 తుమ్మ-3 మర్రి-1 నేరేడి-1 | పశువుల పాక-1, బావి-1 |
| 32 | 129 | మెట్ట | పట్టా | 1.00 | గోరిగాని బాలమణి భర్త ఎం.సురేష్ | | | | | | బోర్ బావి 1 |
| 33 | 129 | మెట్ట | పట్టా | 1.20 | గుండ్ల క్రిష్టయ్య తండ్రి మైసయ్య | | | | | | |
| 34 | 129 | మెట్ట | పట్టా | 0.36 | రాజు తండ్రి చెన్నయ్య | | | | | | |
| 35 | 129 | మెట్ట | పట్టా | 4.09 | గోరిగాని రామయ్య తండ్రి రామయ్య | | | | | | బోర్ బావి 1 |
| 36 | 129 | మెట్ట | పట్టా | 0.04 | బొర్ర శివలీల భర్త బొర్ర శ్రీనివాసులు | | | | | | |
| 37 | 129 | మెట్ట | పట్టా | 0.20 | శ్రీవాణి తండ్రి బాలస్వామి | | | | | | |
| 38 | 130 | మెట్ట | పట్టా | 0.02 | సి. స్వాతి భర్త బాలకిష్టయ్య | | | | | | |
| 39 | 130 | మెట్ట | పట్టా | 0.02 | బొర్ర శ్రీశైలం తండ్రి బొర్ర రాం చంద్రయ్య | | | | | | |
| 40 | 130 | మెట్ట | పట్టా | 0.02 | బి క్రిష్ణ తండ్రి బొర్ర రాం చంద్రయ్య | | | | | బోర్ బావి 1,పైప్‌లైన్ బావి ట్రాన్స్‌ఫార్మర్ | |
| 41 | 130 | మెట్ట | పట్టా | 0.20 | నర్సింలు తండ్రి చెన్నయ్య | | | | | | |
| 42 | 130 | మెట్ట | పట్టా | 0.39 | రాములు తండ్రి చెన్నయ్య | | | | | | |
| 43 | 130 | మెట్ట | పట్టా | 1.34 | చెన్న కిష్టయ్య తండ్రి చెన్నయ్య | | | | | మామిడి-2 చింత-2 టేకు-2 | |
| 44 | 130 | మెట్ట | పట్టా | 2.00 | గోరిగాని రాజు తండ్రి రాములు | | | | | చింత-3 నేరేడి-3 | బోర్ బావి 1, బావి1, పశువుల పాక-1 |
| 45 | 130 | మెట్ట | పట్టా | 2.00 | గోరిగాని వెంకటేష్ తండ్రి రాములు | | | | | టేకు-4 నిమ్మ-2 | బోర్ బావి 1 |
| 46 | 130 | మెట్ట | పట్టా | 0.02 | బొర్ర శివలీల తండ్రి బొర్ర శ్రీనివాసులు | | | | | | |
| 47 | 131 | మెట్ట | పట్టా | 1.35 | విప్ప సుధా రెడ్డి తండ్రి విప్ప శేఖర్ రెడ్డి | | | | | | |
| 48 | 131 | మెట్ట | పట్టా | 6.13 | బలబోని వెంకటస్వామి యాదవ్ తండ్రి పాపయ్య | | | | | ఆకాశమల్లె 1400, వేప-4 | బోర్ బావి 2,పైప్‌లైన్ 1 |
| 49 | 132 | మెట్ట | పట్టా | 2.00 | పద్మమ్మ భర్త మల్లయ్య | | | | | టేకు-35 వేప-5 జామ-1 | బోర్ బావి 1, బావి 1 |
| 50 | 132 | మెట్ట | పట్టా | 0.12 | నడిపెనమోని రాంచంద్రయ్య తండ్రి చిన్న కిష్టయ్య | | | | | మామిడి-1 చింత-2 టేకు-2 నిమ్మ-1 | |
| 51 | 132 | మెట్ట | పట్టా | 0.06 | చింతకింది శ్రమంత్ తండ్రి చింతకింది క్రిష్టయ్య | | | | | | |
| 52 | 132 | మెట్ట | పట్టా | 9.38 | బలబోని వెంకటస్వామి యాదవ్ తండ్రి పాపయ్య | | | | | | బోర్ బావులు-2 |
| 53 | 133 | మెట్ట | పట్టా | 0.01 | జంగం రాం లింగం తండ్రి జంగం చిన్న బచ్చయ్య | | | | | | |
| 54 | 134 | మెట్ట | పట్టా | 1.20 | గొల్ల చంద్రయ్య తండ్రి ఆశయ్య | | | | | | |
| 55 | 134 | మెట్ట | పట్టా | 1.20 | గొల్ల చెన్నయ్య తండ్రి గేరయ్య | | | | | | |
| 56 | 134 | మెట్ట | పట్టా | 0.27 | గొల్ల నాగయ్య తండ్రి గేరయ్య | | | | | | |
| 57 | 134 | మెట్ట | పట్టా | 0.27 | గొల్ల నాగయ్య తండ్రి బాలయ్య | | | | | | |
| 58 | 134 | మెట్ట | పట్టా | 0.27 | గొల్ల మల్లయ్య తండ్రి గేరయ్య | | | | | | |
| 59 | 134 | మెట్ట | పట్టా | 0.36 | గొల్ల మల్లయ్య తండ్రి ఆశన్న | | | | | | |
| 60 | 134 | మెట్ట | పట్టా | 0.36 | గొల్ల నర్సింలు తండ్రి ఆశన్న | | | | | | |
| 61 | 134 | మెట్ట | పట్టా | 0.36 | కుసుమాటి పద్మ ప్రియ తండ్రి కె.ఎం. ప్రసాద్ | | | | | | |
| 62 | 134 | మెట్ట | పట్టా | 2.30 | కుసుమాటి పద్మ ప్రియ తండ్రి కె.ఎం. ప్రసాద్ | | | | | | |
| 63 | 134 | మెట్ట | పట్టా | 2.27 | ఖమ్మ మండల ప్రసాద్ తండ్రి ఎం.వి. నర్సయ్య | | | | | | |
| 64 | 135 | మెట్ట | పట్టా | 1.00 | నడపనోమోని వెంకటేష్ తండ్రి నడపనోమోని రాంచంద్రయ్య | | | | | చింత-1 | |
| 65 | 135 | మెట్ట | పట్టా | 1.00 | గంధం పద్మమ్మ భర్త వెంకటయ్య | | | | | వేప-2 | |
| 66 | 135 | మెట్ట | పట్టా | 1.04 | గంధం సత్తయ్య తండ్రి రాం చంద్రయ్య | | | | | | |
| 67 | 135 | మెట్ట | పట్టా | 1.00 | ఎన్. మంగాల భర్త రాం చంద్రయ్య | | | | | | |
| 68 | 135 | మెట్ట | పట్టా | 2.03 | గంధం యాదమ్మ భర్త యాదయ్య | | | | | | |
| 69 | 135 | మెట్ట | పట్టా | 0.14 | రామ్ స్వామి తండ్రి నడపనమోని ఆంజనేయులు | | | | | | |
| 70 | 135 | మెట్ట | పట్టా | 0.13 | లింగం తండ్రి నడపనమోని ఆంజనేయులు | | | | | | |
| 71 | 135 | మెట్ట | పట్టా | 0.27 | పులి శ్రీనివాసులు తండ్రి వెంకటయ్య | | | | | మామిడి-1 | |
| 72 | 135 | మెట్ట | పట్టా | 0.27 | పులి రఘు తండ్రి వెంకటయ్య | | | | | | |
| 75 | 135 | మెట్ట | పట్టా | 2.00 | పులి అనసూయ భర్త వెంకటయ్య | | | | | | |
| 76 | 135 | మెట్ట | ప్రభుత్వ | 3.21 | ప్రభుత్వ భూమి | | | | | | |
| 77 | 143 | మెట్ట | పట్టా | 1.32 | గొల్ల మల్లయ్య తండ్రి గేరయ్య | | | | | మామిడి-46 వేప-15 | బోర్ బావి -1 |
| 78 | 143 | మెట్ట | పట్టా | 0.20 | యాదగిరి తండ్రి మల్లయ్య | | | | | | |
| 79 | 143 | మెట్ట | పట్టా | 1.27 | గొల్ల నాగయ్య తండ్రి బాలయ్య | | | | | | పైప్ లైన్ -1 |
| 80 | 143 | మెట్ట | పట్టా | 1.27 | గొల్ల మల్లయ్య తండ్రి బాలయ్య | | | | | | |
| 81 | 143 | మెట్ట | పట్టా | 1.13 | గొల్ల శ్రీశైలం మల్లయ్య గార్డియన్ తల్లి బాలమ్మ | | | | | | |
| 82 | 143 | మెట్ట | పట్టా | 0.29 | గొల్ల చంద్రయ్య తండ్రి ఆశయ్య | | | | | | పైప్ లైన్ -1 |
| 83 | 143 | మెట్ట | పట్టా | 1.12 | గొల్ల నర్సింలు తండ్రి ఆశయ్య | | | | | | |
| 84 | 144 | మెట్ట | పట్టా | 0.14 | పోమల శ్రీలత తండ్రి పోమల బస్వరాజ్ | | | | | | |
| 85 | 144 | మెట్ట | పట్టా | 0.01 | నడిపెనమోని రమేష్ బాబు తండ్రి వెంకటయ్య | | | | | | |
| 86 | 144 | మెట్ట | పట్టా | 0.15 | నర్సింలు తండ్రి బాలయ్య | | | | | | |
| 87 | 144 | మెట్ట | పట్టా | 0.15 | యాదయ్య తండ్రి హన్మయ్య | | | | | | |
| 88 | 144 | మెట్ట | పట్టా | 0.13 | శ్రీనివాసులు తండ్రి వెంకటయ్య | | | | | | |
| 89 | 145 | మెట్ట | పట్టా | 0.19 | పోమల శ్రీలత తండ్రి పోమల బస్వరాజ్ | | | | | | |
| 90 | 145 | మెట్ట | పట్టా | 0.15 | నర్సింలు తండ్రి బాలయ్య | | | | | | |
| 91 | 145 | మెట్ట | పట్టా | 0.03 | పోమల అంజమ్మ తండ్రి పోమల నర్సింలు | | | | | | పైప్ లైన్ -1 |
| 92 | 145 | మెట్ట | పట్టా | 0.10 | శ్రీనివాసులు తండ్రి వెంకటయ్య | | | | | | |
| 93 | 145 | మెట్ట | పట్టా | 0.18 | యాదయ్య తండ్రి హనుమయ్య | | | | | | |
| 94 | 145 | మెట్ట | పట్టా | 0.04 | నడిపెనమోని రమేష్ బాబు తండ్రి వెంకటయ్య | | | | | | |
| 95 | 146 | మెట్ట | పట్టా | 0.07 | శ్రీకాంత్ తండ్రి బొంత రాములు | | | | | | |
| 96 | 146 | మెట్ట | పట్టా | 0.07 | గొల్ల రాములు తండ్రి శరవయ్య | | | | | | బావి -1 |
| 97 | 147 | మెట్ట | పట్టా | 0.28 | గొల్ల మహేష్ తండ్రి గొల్ల రాములు | | | | | | |
| 98 | 147 | మెట్ట | పట్టా | 0.18 | గొల్ల అంజయ్య తండ్రి గేరయ్య | | | | | | |
| 99 | 147 | మెట్ట | పట్టా | 0.05 | బొంత అంజమ్మ భర్త బొంత అంజయ్య | | | | | | |
| 100 | 147 | మెట్ట | పట్టా | 0.14 | గొల్ల వాగయ్య తండ్రి బాలయ్య | | | | | | |
| 101 | 147 | మెట్ట | పట్టా | 0.10 | గొల్ల మల్లయ్య తండ్రి బాలయ్య | | | | | | |
| 102 | 147 | మెట్ట | పట్టా | [illegible] | గొల్ల మల్లయ్య తండ్రి ఆశయ్య | | | | | | |
| మొత్తం: | | | | 102.08 1/2 | | | | | | | |

సంబంధీకులందరికీ భూసేకరణ, పునరావాసం& రీసెటిల్‌మెంట్ (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం నం.21 ఆఫ్ 2017) లో పారదర్శక పునరావాసం మరియు పారదర్శకత్వం హక్కు ద్వారా సవరించినట్లుగా భూసేకరణ, పునరావాసం& రీసెటిల్‌మెంట్ (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం నం.30 ఆఫ్ 2013) లో పారదర్శక పునరావాసం మరియు పారదర్శకత్వం హక్కు యొక్క సెక్షన్-11 యొక్క నియమాల క్రింద ఈ ప్రకటన ఇవ్వనైనది.

భూమి యొక్క ప్లానును జిల్లా కలెక్టర్ & స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భూ.సే.ఆర్ & ఆర్, యూనిట్-2-ఇరిగేషన్ ప్రాజెక్ట్, మహబూబ్‌నగర్ వారి కార్యాలయంలో ఏదేని పనిదినమున కార్యాలయ పనివేళల్లో పరిశీలించవచ్చును. తెలంగాణ ప్రభుత్వం/ కలెక్టర్-మరియు-తగినట్లు ప్రభుత్వం, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, మహబూబ్‌నగర్ వారిని మరియు వారి సిబ్బందిని భూమిని సర్వేచేయుట, ఏదేని భూమి, డిగ్ లేదా బోర్ ని స్వీకరించుటకు మరియు సబ్-సాయిల్ & అన్ని ఇతర కార్యక్రమాలుచేపట్టుటకు సదరు చట్టం యొక్క సెక్షన్-12 లో సూచించినట్లు మరియు సమకూర్చినట్లు వారి పని యొక్క ప్రతిపాదిత నిర్వహణ కొరకు కావలసిన అధికారాలను కల్పిస్తున్నారు.

చట్టం యొక్క సెక్షన్ 11(4) క్రింద, ఎవరైనా వ్యక్తి భూమిలో ఏవేని లావాదేవీలు లేదా ఏవేని లావాదేవీలకు కారకులు అగుటలో అనగా., అమ్మకం/ కొనుగోలు, మొ॥ లేదా అట్టి భూమిలో ఏవేని రుణభారాలు నెలకొల్పుటలో అట్టి ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి కలెక్టర్ వారి ముందస్తు అనుమతిలేకుంగా చేయరాదు.

ప్రాథమిక ప్రకటన తరువాత పేర్కొన్న పై పేర్కొన్న భూసేకరణ పై ఏవేని అభ్యంతరాలు కలిగియున్న ఎవరైనా సంబంధిత ప్రజలు సెక్షన్ (15) క్రింద, వారు ఈ ప్రకటన జారీచేయబడిన తేదీ నుండి (60) రోజుల్లోగా వ్రాతపూర్వకంగా భూసేకరణ అధికారికి తమతమ అభ్యంతరాలను దాఖలుచేయవచ్చును.

ఒకవేళ నెగోషన్ ద్వారా పరిహారం సెటిల్‌కు ఒకవేల ఆసక్తిగల యజమానులు, ఈ ప్రకటన జారీ తరువాత ఫారం-ఇ-1 పై తమతమ ఆక్షేపణలను దాఖలుచేయవచ్చును.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎల్ఏ ఆర్&ఆర్ యూనిట్-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్, మహబూబ్‌నగర్

సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ), మహబూబ్‌నగర్

సం/- జిల్లా కలెక్టర్, మహబూబ్‌నగర్.

DIPR Ro.No.922/LA/PP/Advt/Pub/2026-27


# ఓటుకు నోటు కేసులో సిఎం రేవంత్‌రెడ్డికి ఊరట

## రూ.50 లక్షల అటాచ్‌మెంట్ ఆర్డర్ రద్దు

**హైదరాబాద్,సెప్టెంబరు28,ప్రభాతవార్త:** సిఎం రేవంత్ రెడ్డిపై ఉన్న 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఇడి) చేసిన రూ.50 లక్షల అటాచ్‌మెంట్‌ను ధ్రువీకరిస్తూ గతంలో ఇచ్చిన ఆదేశాన్ని అప్పిలేట్ ట్రిబ్యునల్ రద్దు చేసింది. ఈ వ్యవహారంలో రేవంత్ రెడ్డి తో పాటు మరో ముగ్గురికి కూడా ట్రిబ్యునల్ నుంచి భారీ ఊరట లభించింది. ఈ మేరకు ఎస్ఏ ఫెమా ఢిల్లీలోని పరిధిలోని అప్పిలేట్ ట్రిబ్యునల్ ఈనెల 14వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ మునీశ్వర్ నాథ్ భండారీ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది. రేవంత్ రెడ్డి, వేమ్ కృష్ణ కీర్తన్, రుద్ర శివకుమార్ ఉదయ్ సింహా, బిషప్ హ్యారీ సెబాస్టియన్‌లు.. 2022 ఫిబ్రవరి 8వ తేదీన అడ్జుడికేటింగ్ అథారిటీ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేశారు. అంతకుముందు 2021 మే 25వ తేదీన ఈడీ రూ.50 లక్షలను ప్రొవిజనల్‌గా అటాచ్ చేసింది. ఈ ఓటుకు నోటు కేసులో అసలు వివాదం రూ.50 లక్షల మొత్తానికి సంబంధించింది

కాగా.. ఈ మొత్తాన్ని లంచంగా ఇవ్వబోయినట్లు ఆరోపణలు ఉన్న నగదుకు సమానమైన మొత్తాన్ని ఈడీ ఇప్పటికే అటాచ్ చేసింది. అయితే అప్పీలుదారుల తరఫున.. అసలు నగదును ఇప్పటికే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) స్వాధీనం చేసుకుని.. ట్రయల్ కోర్టులో డిపాజిట్ చేసిందని వాదించారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ)లోని సెక్షన్ 5(1)()లోని నిబంధనలను ట్రిబ్యునల్ పరిశీలించింది. ఇప్పటికే రూ.50 లక్షలు కోర్టు ఆధీనంలో భద్రంగా ఉన్నప్పుడు.. ఆ మొత్తాన్ని నిందితులు తరలించడం, ఇతర విధంగా వినియోగించే అవకాశం లేదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ పరిస్థితుల్లో అదే మొత్తానికి సమానమైన మరో రూ.50 లక్షలను అటాచ్ చేయాల్సిన పరిస్థితి లేదని ట్రిబ్యునల్ పేర్కొంది. దీంతో రూ.50 లక్షల అటాచ్‌మెంట్‌ను ధ్రువీకరిస్తూ అడ్జుడికేటింగ్ అథారిటీ ఇచ్చిన ఆదేశాన్ని కోర్టు రద్దు చేసింది. 2015లో తెలంగాణలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఈ ఓటుకు నోటు కేసు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. జూన్ 1వ తేదీన జరగాల్సిన ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు ఓటు కోసం రూ.5 కోట్ల లంచం ఆఫర్ చేశారనే ఆరోపణలపై హైదరాబాద్ ఏసీబీ అధికారులు 2015 మే 31వ తేదీన ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ఆ సమయంలో రేవంత్ రెడ్డి టీడీపీ ఎమ్మెల్యేగా ఉండగా.. వేమ్ నరేందర్ రెడ్డి టీడీపీ అభ్యర్థిగా ఉన్నారు. ఎమ్మెల్యే ఎల్విస్ స్టీఫెన్‌సన్‌ను తమ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేయించేందుకు లేదా ఓటింగ్‌కు దూరంగా ఉండేలా చేయడానికి రూ.50 లక్షలను అడ్వాన్స్‌గా ఆఫర్ చేశారని ఏసీబి ప్రధానంగా ఆరోపించింది. సికింద్రాబాద్‌లోని సౌత్ లాలాగూడలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో ఈ వ్యవహారం జరిగిందని ఏసీబీ పేర్కొంది. అక్కడే నిందితులను పట్టుకున్నామని.. రూ.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని ఏసీబీ తెలిపింది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కూడా సేకరించినట్లు దర్యాప్తు సంస్థ పేర్కొంది.

ఏసీబీ కేసు నమోదు చేసిన తర్వాత ఈడీ కూడా ఈ వ్యవహారంపై ఈసీఐఆర్ నమోదు చేసింది. ఆ తర్వాత అసలు స్వాధీనం చేసుకున్న రూ.50 లక్షలకు సమానమైన మొత్తాన్ని ఈడీ ప్రొవిజనల్‌గా అటాచ్ చేసింది. తాజా ట్రిబ్యునల్ ఉత్తర్వులతో ఆ అటాచ్ మెంట్‌ను ధ్రువీకరిస్తూ 2022లో ఇచ్చిన ఆదేశం రద్దు అయింది. అయితే ఇది 2015 ఓటుకు నోటు కేసులోని ఇతర దర్యాప్తు, న్యాయ ప్రక్రియలపై తుది తీర్పుగా భావించాల్సిన అవసరం లేదు. తాజా ఉత్తర్వులు ప్రధానంగా ఈడీ చేసిన రూ.50 లక్షల అటాచ్‌మెంట్‌కు సంబంధించినవి కావడం గమనార్హం.

# ఉత్తర భారతంలో సెప్టెంబరులోనే తగ్గిన ఉష్ణోగ్రతలు

## ముందస్తు శీతాకాలం హెచ్చరికగా అనుమానిస్తున్న వాతావరణ శాఖ అధికారులు

**హైదరాబాద్, సెప్టెంబరు 28: ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీసహా ఉత్తరాదిలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు వారం రోజులుగా అనూహ్యంగా పడిపోవడంపై వాతావరణ శాఖ అధికా రులకు అంతు చిక్కడం లేదు. ఓవైపు ఎల్‌నినో కారణంగా దేశ వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నె లకొనడంతో పాటు ఎండలు దంచికొడుతుండగా ఉత్తర భారతంలో వున్నట్లుండి ఉష్ణోగ్రతలు పడిపోవడం ఇప్పుడు చర్చనీయాం శంగా మారింది. ఇది ముందస్తు శీతాకాలం హెచ్చరికగా అధికారులు అనుమానిస్తున్నారు. కొన్ని రోజులుగా ఉత్తరాదిలో భారీ వర్షాలు, చల్లని గాలుల కారణంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోవడం తో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా తగ్గాయి. ఆదివారం నాడు ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ వాతావరణ కేంద్రంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 21 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. 2001 తర్వాత సెప్టెంబర్ నెలలో నమోదైన రెండో అత్యల్ప ఉష్ణోగ్రత కావడం గమనా ర్హం. సాధారణం కంటే ఇది సుమారు మూడు డిగ్రీలు తక్కువగా అధికారులు చెబుతున్నారు. నగరంలోని రిడ్జ్ ప్రాంతంలో ఏకంగా 16.8 డిగ్రీ లకు పడిపోయి చలి తీవ్రతను పెంచింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలే కాకుండా గరిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే తక్కువగా నమోదవడం గమనార్హం. బంగాళాఖాతంలో ఏర్ప డిన తీవ్ర వాయుగుండం కారణంగా ఉత్తర భారతంలోని అనేకచోట్ల విస్తారంగా వర్షాలు కురిశాయి. ఈ వర్షాల తో పాటు ఈశాన్య దిశ నుంచి వీస్తున్న చల్లని గాలుల కలయికతో రాత్రి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయని వాతా వరణ శాఖ అధికారులు తెలిపారు. మరోవైపు, ఉత్తరాఖండ్‌లోని పర్వత ప్రాంతాల్లోనూ కొన్ని రోజులుగా వర్షాలతో పాటు మంచు కూడా కురుస్తోంది. ఈ పరిణామాల పై వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ డిపి డోభాల్ మాట్లాడుతూ సెప్టెంబర్‌లో మంచు కురవడం అ నేది ఈ ప్రాంత సహజ వాతావరణంలో భాగమేనని ఆయన తెలిపారు. అయితే, వాతావరణ మార్పుల కారణం గా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మంచుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆయన తెలిపారు.

# 'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధం కావాలి

## పార్టీ శ్రేణులకు టిఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత దిశానిర్దేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** రాబోయే స్థానిక సంస్థలు, జిల్లా,మండల పరిషత్ ఎన్నికల్లో సత్తా చాటాలని అందుకు తగిన విధంగా సిద్ధం కావాలని పార్టీ కేడర్ కు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. రానున్న కాలంలో పార్టీ నేతలు, క్యాడర్ నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేస్తున్నారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల నేతలతో సమావేశం అయిన ఆమె సోమవారం ఉమ్మడి మహబూబ్ నగర్, ఉమ్మడి మెదక్ జిల్లాల నేతలతో భేటీ అయ్యారు. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, గ్రేటర్ వరంగల్, ఖమ్మం కార్పొ రేషన్‌లు, సిద్దిపేట సహా ఇతర మున్సిపాలిటీల్లో పోటీ చేసి సత్తా చాటాలని నేతలకు సూచించారు. నిజామాబాద్, కొడంగల్ లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభలకు సంబంధించి ప్రజల నుంచి ఎలాంటి ఫీడ్ బ్యాక్ వచ్చిందో అడిగి తెలుసుకున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా టీఆర్ఎస్ ఎలాంటి పాత్ర పోషించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఇంకా ఎలాంటి కార్యక్ర మాలు ఉంటే బాగుంటుందని భావిస్తున్నారో ఆ దిశలోనే పయనిద్దామని సూచించారు. మన పోరాటాలతోనే ప్రభుత్వంలో కదలి ప్రతిపక్షంగా టీఆర్ఎస్ చేస్తున్న పోరాటాలతోనే ప్రభుత్వం లో కదలిక వస్తుందని కవిత చెప్పారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో అగ్నిప్రమాదం జరిగి ఐదుగురు చిన్నా రులు మృతి చెందిన ఘట నలో తెలం గాణ రక్షణ సేన స్పందిం చిన తీరుతోనే ప్రభుత్వం దిగివచ్చిందని గుర్తు చేశా రు. ఏళ్లకేళ్లుగా రిమ్స్ హాస్పిటల్‌ను పట్టించుకోని ప్రభుత్వం తక్షణ చర్యల కోసం రూ.11 కోట్లు రిలీజ్ చేసిందని చెప్పా రు. రిమ్స్ హాస్పిటల్ సమస్య లపై రివ్యూ చేసి చేపట్టాల్సిన పను లపై కలెక్టర్ ప్రభు త్వానికి నివేదిక ఇచ్చార న్నారు. తాను ఆస్పత్రిని విజిట్ చేసి బాధిత కుటుంబాలను ప రామర్శించి అం డగా నిలిచిన తర్వా తనే ప్రభు త్వం దిగివచ్చి మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటి ంచిందన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ఎక్కడ సమస్య వచ్చినా తెలంగాణ రక్షణ సేన నాయకులు, కార్య కర్తలు తక్షణం స్పందించి వారికి అండగా నిలవా లని కోరారు. కాగా ఉమ్మడి జిల్లాల వారీగా నిర్వహిస్తున్న సమావేశాలు బుధవారం వరకు కొనసాగను న్నాయి. మంగళవారం ఉమ్మడి నిజామాబాద్, నల్గొండ, బుధ వారం ఉమ్మడి వరంగల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల నేతలతో కవిత సమా వేశం కానున్నారు. గ్రేటర్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో త్వర లోనే హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత

# వివేకా హత్య కేసులో కొనసాగుతున్న ఇడి దర్యాప్తు

## ఎ1గా ఉన్న ఎర్ర గంగిరెడ్డిని సుదీర్ఘంగా 9 గంటలపాటు విచారించిన అధికారులు.. నేడు కొనసాగనున్న విచారణ

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:**తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎ1 ఎర్ర గంగిరెడ్డిని కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అధికారులు సోమవారం నాడు సుధీర్ఘంగా తొమ్మిది గంటల పాటు విచారించారు. ఈ కేసులో ఎ2గావున్న సునీల్ యాదవ్‌ను ఈడీ అధికారులు శుక్ర, శనివారాల్లో వరుసగా రెండు రోజుల పాటు విచారించడం తె లిసిందే. అంతకు ముందు ఇదే కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరిని కూడా విచారించడం విదితమే. అయితే సునీల్ యాదవ్ విచారణ ము గిసిన రెండు రోజులకు ఎర్ర గంగిరెడ్డి విచారణ సాగడం గమనార్హం. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో గల ఈడీ కార్యాయంలో ఎర్ర గంగిరెడ్డి ని ఈడీ అధికారులు తొమ్మిది గంటల పాటు అనేక అంశాలపై ప్రశ్నించారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితులు ఎవరు...? హత్య వెనుక గల కారణాలను వెలికి తీసేందుకు సిబిఐ విచారిస్తుండడం తెలిసిందే.

అయితే మనీలాండరింగ్ కోణంలో ఈడీ వేరుగా విచారిస్తుండగా ఇ ందులో భాగంగా ఈ విభాగం అధికారులు ఇప్పటికే పలువురిని విచారించగా తాజాగా మరో ఇద్దరిని ప్రశ్నించింది.. వివేకానంద రెడ్డి హత్య కే సులో నిందితులకు 40 కోట్ల రూపాయలను చెల్లించినట్లు వెలుగులోకి రావడంతో ఈ డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయి...? ఎవరు సమకూరా ్చరు...? ఎందుకు ఇచ్చారు...? అనే కారణాలను వెలికి తీసేందుకు ఈడీ రంగంలో దిగింది. 2019లో జరిగిన వివేకానంద రెడ్డి హత్యకు సం బంధించి 40 కోట్ల రూపాయల ఫండింగ్ వ్యవహారాలు, ఫోన్ కాల్స్, డిజిటల్ ఆధారాలపై దృష్టి సారించిన ఇడి అధికారులు సునీల్ యాదవ్ ను ప్రశ్నించినట్లుగానే ఎర్ర గంగిరెడ్డిని విచారించినట్లు సమాచారం. ఈ విచారణలో సునీల్ యాదవ్ సహా ఎ3 ఉమా శంకర రెడ్డిలతో జరిపిన ఫోన్ సంభాషణలపై ఈడీ అధికారులు ఎక్కువగా ఎర్ర గంగిరెడ్డిని ప్రశ్నించినట్లు తెలిసింది. వీరితో మాట్లాడిన కాల్ డేటా రికార్డును అతని ము ందు వుంచి వివరాలను రాబట్టినట్లు తెలిసింది. సాంకేతిక సాక్ష్యాలుగా వున్న గూగుల్ టెక్ అవుట్‌ను కూడా అతని ముందు ఈడీ అధికారులు వుంచినట్లు తెలిసింది. ఎర్ర గంగిరెడ్డి బ్యాంకు లావాదేవీలను 2019 నుంచి ఈడీ అధికారులు పరిశీలించి అనుమానిత వ్యవహారాలపై అతన్ని ప్రశ్నించినట్లు తెలిసింది. వివేకానంద రెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరికి కోటి రూపాయలు ఇచ్చిన విషయం గురించి ఈడీ అ ధికారులు గంగిరెడ్డిని ప్రశ్నించినట్లు తెలిసింది. ఎర్ర గంగిరెడ్డిని మంగళవారం మరోదఫా విచారణకు రావాలని ఈడీ అధికారులు ఆదేశించారు.

# పోలీసులకు సవాల్‌గా మారుతున్న వరుస కిరాతక హత్యలు

## నిందితులకు శిక్షలు వేయించలేకపోతున్న పోలీసులు

## కఠినచట్టాలు ఉండాలంటున్న నిపుణులు

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వరుస బహిరంగ హత్యలు పోలీసులకు సవాల్‌గా మారుతు న్నాయి. చిన్నపాటి తగాదాలు మొదలుకుని, భూవివా దాలు, కుటుంబసభ్యుల హత్యకు ప్రతీకారంగా జరుగు తున్న దారుణాలు ఆయా ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవిగా ఉన్నాయి, హత్యల తరువాత తాపీగా పోలీసులకు లొంగిపోతున్న నిందితులు ఆ తరు వాత కోర్టుల నుంచి బెయిలు పొందుతూ ఆనక దర్జాగా మళ్లీ నేరప్రవృత్తిలో కొనసాగుతున్నారు. హత్యలతో పాటు హత్యాయత్నం వంటి తీ వ్రమైన కేసుల్లో నిందితులకు సులభంగా బెయిలు లభిస్తుండడం ఒక ఎత్తయితే చాలా కేసుల్లో నిందితులకు కఠినశిక్షలు వేయించడంలో విఫలమవు తుండడం ఈ తరహా నేరాల పెరుగుదలకు కారణమని నిపుణులు అంటున్నారు. రాష్ట్రంలో యేటా 800 వరకు హత్యలు జరుగుతుండగా ఇందులో జంట నగరాలు, శివార్లలో 300 వరకు ఉంటున్నాయి. హత్యా నేరాలకు పాల్పడే వారిని పోలీసులు అరెస్టు చేస్తున్నా నిందితులను కర్ణాటకతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో వున్నట్లుగా కనీసం యేడాది నుంచి యేడాదిన్నరపాటు జైల్లో నిర్భంధించ లేకపోవడం చట్టాల వైఫల్యంగా చెప్పాలి. హత్యల వంటి తీవ్రమైన కేసుల్లో నిందితులపై మోపుతున్న అభియోగాలు కోర్టుల్లో చాలా సందర్భాల లో నిలబడడం లేదు.

ఈ కారణంగా నిందితులు నిర్దోషులుగా విడుదలవు తుండడం పోలీసు శాఖకు పెద్ద వెలితిగా మారింది. హత్య కేసులతోపాటు హత్యకు ప్రయత్నించిన కేసుల్లో నిందితులుగా వున్న వారిపై పోలీసులు వెంటనే రౌడీషీట్ తెరుస్తూ వారంతా కొన్ని రోజులపాటు ప్రతిరోజు, మూడు నెలల తరువాత వారా నికి ఒకసారి, చివరగా ఇంకొంత కాలం తరువాత నెలకోసారి పోలీసు స్టేషన్లకు వచ్చి తమ వివరాలు ఇవ్వాల్సి వుంది. అయితే చాలాచోట్ల ఈ ప్రక్రియ సవ్యంగా అమలవడం లేదనే ఆరోపణలున్నాయి. నిందితుల తరపున కొందరు బడా నేతలు




పోలీసులకు నజరానాలు ఇస్తూ హత్య కేసుల్లో నిందితులు స్టేషన్ల కు రాకుండా చూస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఇలా హత్యలు, హత్యాయత్నం కేసుల్లో నిందితులుగా వున్న వారు బడా నేతలతో కలిసి పోలీ సులకు ఆమ్యామ్యాలు ఇస్తూ దర్జాగా తిరుగుతూ మళ్లీ మళ్లీ నేరాలు చేస్తున్నారనే అభియోగాలు కూడా వున్నాయి. హత్యలు, హత్యాయత్నం కేసుల్లో నిందితులుగా వున్న వారిపై పోలీసులు కోర్టులకు సమర్పించే ఛార్జిషీట్లు చాలా వరకు సరిగ్గా వుండడం వల్ల నిందితులు సులభంగా తప్పించుకుంటున్నారని హైకోర్టు సీనియర్ న్యాయ వాదులు చెబుతున్నారు.

జంట గ్రేటర్ పరిధిలో రెండు నెలల వ్యవ ధిలో నాలుగు హత్యలు బహిరంగంగా జరిగాయి. జగిత్యాలలో యూ ట్యూబర్ వైష్ణవి హత్యకు ప్రతీకారంగా ఆమె సోదరుడు సొంత బావను నడిరోడ్డుపై వేట కొడవలితో నరికి చంపాడు. సూర్యాపేట్‌లో 20 ఏళ్ల క్రితం జరిగిన హత్యలో నిందితుడుగా వున్న వ్యక్తి ఇంతకాలం పరారీలో వుండి తమ బంధువు చనిపోవ డంతో రాగా ప్రత్యర్థులు రోడ్డుపై నరికి చంపారు.

### సాక్షులను రక్షించే ప్రత్యేక వ్యవస్థ లేకపోవడం పెద్ద వెలితి

ఇదిలా ఉండగా హత్యలతోపాటు హత్యాయత్నం వంటి తీవ్రమైన కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడాలంటే సాక్షులు కోర్టులో సాక్ష్యం చెపా ్పల్సి వుంటుంది. అనేక దేశాల్లో సాక్షులను కాపాడుకునే వ్యవస్థ వుంది. ఈ వ్యవస్థను విట్‌నెస్ ప్రొటెక్షన్ సిస్టం అని పిలుస్తుంటారు. ఈ వ్యవస్థ పటిష్టంగా వుండేందుకు ఆయా దేశాల్లో ప్రత్యేకంగా విభాగాలు వున్నాయి. అవసర మైతే సాక్షులకు పోలీసు విభాగాలు తాముండే సురక్షిత ప్రాంతాలలోనే వుండే వీలు కల్పించడంతో పాటు ఇదే ప్రాంతంలో ఉద్యోగాలు కూడా ఇస్తారు. ఇక కోర్టుల్లో వీరి సాక్ష్యాల ఆధారంగా నిందితులకు శిక్షలు పడిన తరువాత సాక్షులుగా వున్న వారిని పోలీసులు మరికొంత కాలం సురక్షితంగా కాపాడుతారు. ఈ తరహా వ్యవస్థను ఇండియాలోనూ ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ దశాబ్దాలుగా అనుకుంటున్నా ఆచరణలో అ మలు కావడం లేదు.

వార్త

మేధ అంటే మీ భావాలను మీరు విశ్వసించడం, మీ అంతరాలలో నిజమని విశ్వసించే దానిని ప్రపంచం మొత్తం చేత యదార్థమని విశ్వసింపచేయడం.

- రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

# మబ్బులు వీడిన 'స్థానికత'

సర్కారు వారి నిర్ణయాలకు సరైన భాష్యం తెలియకుండా జరిపే వ్యవహారాల్లో జనం బాధితులు న్యాయం కోసం కోర్టు గుమ్మాలకెక్కడ అతి సాధార్నణ అయిపోయింది. రాష్ట్రాల పునర్విభజ చట్టంలో స్పష్టంగా ఉన్నా రిజర్వేషన్ రూల్స్ అన్వయింపులో దాదాపు 37 మంది విద్యార్థులు. తమ ఎంబిబిఎస్ సీట్లను కోల్పోయారు. ఇలాంటి సందర్భంలో గతంలో కర్ణాటక, మహారాష్ట్ర విద్యార్థినీ విద్యార్థులు 13మంది కూడా ఇదే నిబంధన కింద ఇంటిదారి పట్టారు. తెలంగాణ ఎంబిబిఎస్ / బిడిఎస్ అడ్మిషన్లలో లోకల్ కోటా వివాదంలో జిల్లా అంకిత ఇతర విద్యార్థులు పిటిషనర్లుగా ఉన్న కేసులో సెప్టెంబర్ 1,2025 న సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్. గవాయి, జస్టిస్ కె. వినోద్ చంద్రన్ ధర్మాసనం తెలంగాణ ప్రభుత్వం 2017 రూల్స్ (2024లో సవరించినవి)ను సుప్రీంకోర్టు సమర్థించింది. ఎంబిబిఎస్ /బిడిఎస్ లో 85 శాతం స్థానిక కోటా పొందాలంటే విద్యార్థి తెలంగాణలో వరుసగా 4 ఏళ్లు (9వ తరగతి నుండి 12వ తరగతి వరకు) చదివి ఉండాలి అనే నిబంధనను సుప్రీంకోర్టు సమర్థించింది. తెలంగాణ హైకోర్టు 'శాశ్వత నివాసి అయితే చాలు, 4 ఏళ్లు చదవకపోయినా లోకల్ కోటా ఇవ్వాలి' అని ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. "నిర్వచనం స్పష్టంగా ఉన్నప్పుడు హైకోర్టు దానిని సడలించాల్సిన అవసరం లేదు' అని పేర్కొంది. రాష్ట్రాలు 15శాతం సీట్లను ఆల్ ఇండియా కోటాకు ఇచ్చాయి కాబట్టి, మిగిలిన 85 శాతం సీట్లను స్థానికులకు రిజర్వ్‌చేయడం రాజ్యాంగబద్ధమే అని కోర్టు చెప్పింది. అసోం రాష్ట్రంలో ఇలాంటి నిబంధననే 2018లోనే సుప్రీంకోర్టు సమర్థించింది. తల్లిదండ్రులు రక్షణ శాఖ, ప్రభుత్వ రంగసంస్థలు, ఆల్ ఇండియా సర్వీసులలో ఉండి బదిలీపై బయటకు వెళ్లిన వారి పిల్లలకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. ప్రైవేట్ ఉద్యోగుల పిల్లలు బయట చదివితే ఈ కోటాకు అర్హులు కారు. సీటు కేటాయించిన తరువాత అర్హత వెతకడం కాదు. సీటు కేటాయించే ముందే అర్హతను ఖచ్చితంగా నిర్ధారించాలి. ఒక విద్యార్థి తప్పుడు పత్రం సమర్పిస్తే చర్య తప్పనిసరి. తప్పు ధ్రువీకరణ పత్రం ఇచ్చింది విద్యార్థినా, లేక సర్టిఫికెట్ జారీ వ్యవస్థలో లోపమా అన్నది వేరు చేయాలి. కానీ ప్రభుత్వమే జారీ చేసిన సర్టిఫికెట్ ఆధారంగా విద్యార్థి కౌన్సెలింగ్‌లో పాల్గొని సీటు పొందిన సందర్భంలో, వెరిఫికేషన్ ప్రక్రియలో వైఫల్యం, ప్రభుత్వ విభాగాల మధ్య డేటాబేస్ అనుసంధానం లేకపోవడం, పాత రికార్డులపై ఆధారపడటం, వాటి భారం మొత్తం విద్యార్థిపై పడకూడదన్నది పరిశీలించాలి. అదే స్థానిక షెడ్యూల్ తెగ కేటగిరి అభ్యర్థికి న్యాయం, అదే రిజర్వేషన్ వ్యవస్థకు విశ్వసనీయత. ఒక కుటుంబ సామాజిక/ గిరిజన గుర్తింపు, మూల నివాస ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లో ఉంటే, ఆ కుటుంబం తరువాత తెలంగాణకు వలస వచ్చినంత మాత్రాన తెలంగాణ షెడ్యూల్ తెగ కేటగిరి రిజర్వేషన్‌ను పొందలేరన్నది అధికారుల ప్రస్తుతవివరణ. తెలంగాణలో 2026-27 ఎంబిబిఎస్ / బిడిఎస్ ప్రవేశాల్లో షెడ్యూల్ తెగ కేటగిరి రిజర్వేషన్ కింద సీట్లు పొందిన 9 మంది విద్యార్థుల అడ్మిషన్లు రద్దు కావడం ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం తాజాగా 37 మంది అభ్యర్థులు తెలంగాణ షెడ్యూల్ తెగ కేటగిరి రిజర్వేషన్‌కు అనర్హులని ప్రకటించింది. వీరిలో ఇప్పటికే ఎంబిబిఎస్ సీట్లు పొందిన తొమ్మిది మంది అడ్మిషన్లు రద్దయ్యాయి. వీరు ఉస్మానియా మెడికల్ కాలేజ్, ఇఎస్ఐసి మెడికల్ కాలేజ్ హైదరాబాద్, ప్రభుత్వ మెడికల్ కాలేజ్ కరీంనగర్ తదితర సంస్థల్లో సీట్లుపొందారు. రద్దైన సీట్లను తదుపరి మాప్‌అప్/మూడో దశ కౌన్సెలింగ్‌లో అర్హులైన షెడ్యూల్ తెగ కేటగిరి అభ్యర్థులకు కేటాయించనున్నారు. అయితే ఈ 37 మంది పూర్తిగా వైద్య ప్రవేశం నుంచి బయటపడినట్లు కాదు. నిబంధనలకు, 'నీట్' మెరిట్‌కు అనుగుణంగా ఓపెన్ కేటగిరి పోటీ చేసే అవకాశం ఉంటుంది. ఒక రాష్ట్రానికి చెందిన షెడ్యూల్ తెగ కేటగిరి రిజర్వేషన్‌ను మరో రాష్ట్రంలో వలస ఆధారంగా ఉపయోగించడం అనుమతిస్తే, ఆ రాష్ట్రంలోని స్థానిక షెడ్యూల్ తెగ కేటగిరి అభ్యర్థుల హక్కులపై ప్రభావంపడే అవకాశం ఉంది. ఈ తొమ్మిది మంది విద్యార్థుల ప్రభుత్వ సర్టిఫికెట్లను నమ్మి, అధికారిక కౌన్సెలింగ్ ప్రక్రియలో సీట్లు పొందినందున, ప్రక్రియలో జరిగిన లోపానికి వారి విద్యా భవిష్యత్తు మొత్తం మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి రాకుండా పరిష్కారం ఉండేటట్లు చూసే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి. తెలంగాణ గిరిజన సంక్షేమశాఖ వివరణ ప్రకారం, ఈ ప్రత్యేక మార్పిడి కాలానికి సంబంధించిన 10సంవత్సరాలవ్యవధి 2024 జూన్ 1తో ముగిసింది. అందువల్ల 2014కు ముందు ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు వచ్చిన కుటుంబాలు కేవలం ఇక్కడకు వలస వచ్చారనే కారణంతో తెలంగాణ షెడ్యూల్ తెగ కేటగిరి రిజర్వేషన్‌పొందలేవన్న వాదనను ప్రభుత్వం ముందుకు తెచ్చింది. దీనిపై సుప్రీంకోర్టు స్పష్టతనిచ్చినందున స్థానికతపై మబ్బులు వీడినట్లే! రిపోర్టుల ప్రకారం, ప్రభావిత అభ్యర్థులలో పలువురికి తెలంగాణలోని తహసీల్దార్లు జారీ చేసిన షెడ్యూల్ తెగ కేటగిరి సర్టిఫికెట్లు ఉన్నాయి. అయినప్పటికీ, తరువాత గిరిజన సంక్షేమ శాఖ వారి మూలనివాస ప్రాంతాలను గుర్తించి నివేదిక ఇవ్వడంతో వారి ప్రవేశాలురద్దయ్యాయి. తెలంగాణ హైకోర్టు గతంలో రాష్ట్ర విభజన తరువాత స్థానికత, రిజర్వేషన్, మూలనివాసం వంటి అంశాలపై పలు కేసులను పరిశీలించిన తర్వాత అత్యున్నత ధర్మాసనం స్పష్టమైన తీర్పునిచ్చింది.



స్పష్టత లేకుండా దారితప్పి మాట్లాడటం కంటే మౌనం పాటించడం ఉత్తమం.

రమణ మహర్షి



ఇద్దరితోగాని, ముగ్గరితో గాని యదార్థాన్ని గురించి ధైర్యంగా చెప్పలేనివారు బానిసల వంటివారు.

లోవెల్

## ప్రజావాక్కు

### సిమెంటు రోడ్ల పక్క మార్జిన్లలో మట్టి నింపాలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రోడ్లనిర్మాణం పెరిగిందిగాని, ఈమధ్య గుంటూరు వంటి నగరాల్లో సిమెంట్ రోడ్లువేసి, ఇరువైపుల మార్జిన్లని మట్టితో పూడ్చలేదు. రోడ్డుకి, మార్జిన్ ఎత్తు తక్కువగా వుండి వాహన ప్రమాదాలు జరిగే ప్రమాదముంది. కనుక మార్జిన్లని మట్టితో నింపి లాన్ వలె పెంచితే వర్షం నీరు పీల్చుకుని ఉష్ణోగ్రత తగ్గుతుంది, ఇళ్ళ యజమానులు కూడా మొక్కలు పెంచుకోవచ్చు. మనది ఉష్ణదేశం. వచ్చే ఒకటి రెండు సంవత్సరాల్లో 50 నుండి 60 సెంటీగ్రేడ్ వరకుఉష్ణోగ్రత పెరగవచ్చని అంతర్జాతీయ సంస్థలు వెల్లడిస్తున్నాయి. సిమెంటు నిర్మాణాలు పెరిగేకొద్దీ భూతాపం పెరుగుతుంది. వ్యక్తిగత నిర్మాణాల్ని ప్రభుత్వం నిరోధించలేదు, కనీసం ప్రభుత్వం రోడ్ల నిర్మాణాల్లోనైనా సిమెంట్ బదులు తారు రోడ్లు వేస్తే ప్రభుత్వాల ఖర్చు తగ్గుతుంది.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### 'సర్' ప్రక్రియలో అవకతవకలు

దేశ ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ పనితీరు సజావుగా లేదని, ఓటర్ల జాబితాలో అనేక వేలమంది ఓట్లు గల్లంతయ్యాయని, 'సర్' ప్రక్రియ అవకతవకగా తయారయిందని, కేంద్ర ప్రభుత్వం చెప్పినట్టు చేయడమే ఆయనకు పరమావధిగా మారిందని, ఏదిప్రశ్నించినా మౌనమే సమాధానంగా ప్రవర్తిస్తున్నారని ఇలా అనేక అభిప్రాయాలు వ్యక్తమోతున్నాయి. కాబట్టి ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్ష నాయకులతో బాటు కేంద్ర విద్యాశాఖామంత్రి చేత రాజీనామా చేయించిన కాక్రోచ్ జనతా పార్టీ కూడా తీవ్రమైన వత్తిడి తెస్తోంది. కేంద్రానికి తలఒగ్గక, రాజ్యాంగానికే ఎక్కువ విలువనిచ్చి మంచి పేరు తెచ్చుకున్న గత కాలపు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ దివంగత శేషన్‌గారి లాంటి మేధో సంపన్నుల బాటతదుపరి సిఐసిలు పాటించక పోవడం విచారకరం.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి,సికింద్రాబాద్

### భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం

భారతదేశ యువ కెరటం, ఉద్యమ వీరుడు స్వాతంత్ర భారతదేశం కొరకు బ్రిటిష్‌పాలకులపై అలుపెరగని పోరాటం చేసిన పోరాట వీరుడు భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉంది. తన ఆశయాలను చరిత్రను భావితరాలకు అర్థవంతంగా తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### విద్య అంటే మార్కులు సాధించడం కాదు..

దేశంలోని భారతీయ సాంకేతిక విద్యాసంస్థలు ప్రతిభకు ప్రతీకలుగా, ప్రపంచస్థాయి విద్యకు కేంద్రాలుగా గుర్తింపు పొందాయి. అయితే ఇటీవల వెలుగుచూస్తున్న విద్యార్థుల ఆత్మహత్యల గణాంకాలు తీవ్రఆందోళన కలిగిస్తున్నాయి. అత్యుత్తమ మేధావులు చేరే ఈ విద్యాసంస్థలు ఇప్పుడు మానసిక ఒత్తిళ్లకు కేంద్రమవుతున్నాయనే వాస్తవాన్ని నిర్లక్ష్యం చేయలేం. ఐఐటీల్లో అమలవుతున్న కఠినమైన అకాడమిక్ విధానాలు,రిలేటివ్ గ్రేడింగ్ వ్యవస్థ,క్యాంపస్ ప్లేస్‌మెంట్లపై భయం, నిరంతర పోటీ వాతావరణం విద్యార్థులపై తీవ్రమైన మానసిక భారం మోపుతున్నాయి. పాఠశాల స్థాయి వరకు అగ్రగామిగా నిలిచిన విద్యార్థులు ఇక్కడ ఒక్కసారిగా తీవ్ర పోటీలోపడటంతో ఆత్మవిశ్వాసం కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గ్రేడ్‌లు,ర్యాంకులు, ఉద్యోగ అవకాశాల చుట్టూ తిరిగే ఈ వ్యవస్థ యువతలో ఆందోళన, నిరాశ, ఒంటరితనాన్ని పెంచుతోంది. విద్యఅంటే కేవలం మార్కులు సాధించడమేకాదు, జీవన నైపుణ్యాలను పెంపొందించడం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలి

రోడ్డు కొరకు రైతులనుండి భూములు తీసుకున్న ప్రభుత్వం నదీ పరీవాహిక సూత్రాలకు విరుద్ధంగా కృష్ణానది కరకట్ట ప్రక్కన ఉన్న ఆశ్రమాన్ని తక్షణమే కూల్చి వెయ్యాలి. అమరావతి దగ్గర కరకట్టను వంద అడుగుల రోడ్డుగా చెయ్యటానికి అడ్డుగా ఉన్న ఆశ్రమాన్ని కూలగొట్టాలి. ఆ ఆశ్రమం అక్రమ నిర్మాణంకూల్చాలి. చట్టంఅందరికి ఒకటే.ఒకరికిఒక న్యాయం, ఇంకొకరికి వేరొక న్యాయం కూడదు. ఆ ఒక్కటే కాదు ప్రక్కనేఉన్న ఇస్కాన్ కేంద్రం,గణపతి సచ్చిదానంద ఆశ్రమం,ఏదో ఒక స్వామి ఆశ్రమం ఇవన్నీ అక్రమ నిర్మాణాలే. ముఖ్యంగా ఆశ్రమం ప్రజలను రకరకాలుగా దోచుకుంటుంది.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### యువతకు ట్రైనింగ్ ఇవ్వాలి

ఐక్యరాజ్య సమితిలో శాశ్వత సభ్యత్వం హోదా తీసివేయాలి అని ఫ్రాన్స్ బ్రిటన్ కోరడం ఒక సంచలనం. అభివృద్ధి చెందుతున్న దేశాలు, మూడో ప్రపంచ దేశాలు ఐక్యరాజ్య సమితిలో ప్రాధాన్యతను కోల్పోతున్నాయి. ఇది ఐక్యరాజ్య సమితి వంటి సంస్థకు శోభను ఇవ్వదు. మొన్న జరిగిన బ్రిక్స్ సదస్సులో భారత్ ఎంత కీర్తిసాధించిందో మనం చూశాం. ఉప్పు నిప్పుల ఉండే ఇరాన్ యూఏఈలను ఒక్కతాటిమీదికి తీసుకొచ్చి వాటి మధ్యచర్చలు జరిగేట్టు చేసిన ఘనత భారత్ ది.

-భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ప్రజాస్వామ్యంలో ప్రభువులు ప్రజలే!

*అన్ని మతాలకు ప్రతినిధిగానే భారత దేశం ఇప్పటికీ కొనియాడబడుతున్నది! నియంతలుగా పాలించటానికి ప్రయత్నించిన నాయకులను ప్రజలు నియంత్రించారు! తప్పు తెలుసుకొన్న సమర్థులైన నాయకులను తిరిగి ఎన్నికల ద్వారా అధికారంలోకి తీసుకొని రావటానికి వెనుకంజ వేయలేదు! ఆ చరిత్రతో అలరారుతూ అన్ని రంగాలలో గణనీయ ప్రగతిని సాధిస్తున్న భారత దేశం తప్పు టడుగులు వేయగూడదు! ఎన్నో సంవత్సరాల అభివృద్ధికి స్పీడ్ బ్రేకర్స్ను మనంతట మనమే కల్పించుకోగూడదు! నిన్నటి పాలకులు ఇవ్వాళ ప్రతిపక్షంగా మారారు! ప్రజాభిమానాన్ని కోల్పోవటం వల్లనే ఆ పరిస్థితి వారికి కలిగింది! అందుకే ఇవ్వాల్టిపాలకులు రేపటి ప్రతిపక్షాలుగా మారకుండా వుండాలంటే ప్రజలందరి అభిమానం కుల, మత, వర్గాలకు అతీతంగా ఉండే పాలనను అందజేస్తేనే సాధ్యపడు తుంది! ప్రజాస్వామ్యం అవలంబించినప్పుడు రాజు ప్రజలే అన్నది మరిచిపోగూడదు! ప్రజా నాయకుడు రాజుగా మారటం ఈ దేశ వ్యవస్థలో సాధ్యపడదేమో!*



రావులపాటి సీతారాంరావు

చిన్నప్పుడు చదువుకొనే దశలో స్కూళ్లలోనూ, కళాశాలల్లో నూ, ఎదుగుతున్నప్పుడు సభలూ, సమావేశాల్లోనూ, వందేమాతరం మొదట్లో జనగణమన తర్వాత జాతీయ గీతాలుగా వినపడ్తూ, మనసులో వున్న దేశ భక్తిని పెల్లుబుకించేది. ఎప్పుడూ ఆ గీతాల్లో ఎన్ని పంక్తులున్నాయని, ఎంత నిడివి వుందనీ ఎవరికీ లెక్కించటానికి అప్పుడుసమయం జ్ఞాపకం రాలేదు. జాతీయ గీతం ఆలపించటానికి సందర్భమే గుర్తు చేస్తుండేది! దేశ భక్తికిజాతీయ గీతం అవసరం! అందులోని భావం మనస్సుల్లోనాటుకున్న తర్వాత సామాన్య మానవుడికి ఇతర విషయాలుపట్టించుకో దగ్గవిగా అనిపించేది కాదు! 'వందేమాతరం' అని వినిపించగానే ఒళ్లు పులకరించేది. 'జనగణమన' వినిపించగానే గుండెల్లో గణగణమని ఘంటలు మ్రోగేవి! మరియిప్పుడుజాతీయ గీతం మీద ఎందు కింత సంఘర్షణతో కూడిన రాద్ధాంతం! 'వందేమాతరం' ఆలపిస్తున్న లతామంగేష్కర్, ఎ.ఆర్. రెహమాన్, గొంతు కలు వాడవాడలా వినపడుతున్నప్పుడు నా దేశం భారత దేశం, నా జాతి లౌకికంగా పరిపూర్ణత సంతరించుకున్న భారత జాతి అని తనువెల్లా తన్మయత్వంతో నిండిపోయేది! జాతీయ గీతాలు గురించి ఆ గీతంలో ఎన్ని పంక్తులు వుండాలన్న విషయంలో ప్రస్తుతం సుప్రీం కోర్టులో లిటిగేషన్ తలెత్తాల్సిన అవసరం వుందా? ఏమో మరి జ్ఞాన సంపద లో వున్న మేధావులూ, దేశాన్ని ఏలుతున్న పాలకులూ ఆలోచించాల్సిన విషయం ఇది! ఇంగితజ్ఞానంతో వున్న సామాన్య మానవుడికి జాతీయ గీతంలో ఎన్ని పంక్తులు వుండాలి అన్నఆలోచన ఎన్నడూ రాలేదు. బంకించంద్ర చటర్జీ కలం నుంచి వెలువడిన 'వందేమాతరం' గుండెలను తడుముతుంటే ఉత్సాహంతో, దేశ భక్తితో సాధారణ వ్యక్తి జీవితాన్ని గడుపుతూ, నా దేశం అభివృద్ధి చెందాలి నా దేశం జెండా ప్రతిచోటా ఎగరాలి నా వందేమాతరం గీతం ప్రతినోటా పలకాలి అన్న అద్భుతమైన ఆలోచనే వుండేది! ఆ గీతాలే స్వతంత్రం సాధించేంత వరకు మనమందరం ఒకటే అన్న భావన కల్పించాయి! మరి యిప్పుడేమయింది? 1937 సం॥లో, కాంగ్రెసు వర్కింగ్ కమిటీ బంకించంద్ర చటర్జీ వ్రాసిన 'వందే మాతరం' గీతం నుంచి మొదటి రెండు స్టాంజాలు జాతీయ సభలలో పాడాలని ప్రతిపాదించింది. ఎప్పుడైతే 'జనగణమన' జాతీయ గీతంగా జనవరి 24, 1950న ఆమోదించబడిందో, మొదటి ప్రసిడెంట్ రాజేంద్ర ప్రసాద్ 'వందేమాతరం'ను 'నేషనల్ సాంగ్'గా రాజ్యాంగంలో అలాంటిది లేకపోయినా, సమంగా గౌరవించాలని అన్నారు. అప్పటి నుంచి ఆ గీతంలోని మొదటి రెండు స్టాంజాలు దేశంలో బహుళ ప్రాచుర్యాన్ని పొందాయి! వందేమాతరం గీతం 150 వ యానివర్శరీ 2025లో జరిగింది. అప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం అన్ని స్టాంజాలు (అంటే ఆరు స్టాంజాలు) పాడాలనే ప్రతిపాదనను ముందుకు తీసుకొని వచ్చింది. 2026 సం॥లో పార్లమెంట్లో ప్రివెంషన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ (ఎమెండ్ మెంట్ యాక్ట్) ఆమోదించబడింది! ఎమ్.హెచ్.ఏ (మినిస్ట్రీ ఆఫ్ హోమ్ ఎఫైర్స్) మార్గదర్శకాలు సర్క్యులర్స్ రూపంలో విడుదల చేసిన తర్వాతనే పార్లమెంట్లో పైన పేర్కొన్న



యాక్ట్‌ను ఆమోదించటం గమనార్హం! ఈ ఎమెండ్మెంట్ సెక్షన్ 3 (1971 యాక్ట్‌లోనిది)కి 'ఎక్స్టెన్షన్'గా చేయటం వల్ల ఎవరైతే జాతీయ గీతాన్ని, (నేషనల్ యాంథం) నేషనల్ సాంగ్లను పాడటానికి అడ్డుపడ్డారో, శిక్షించే వెసులుబాటు కలిగించినట్లయింది. ఈ ఆర్డర్ సుప్రీంకోర్టులో ఛాలెంజి చేయటంతో కోర్టు ఏది 'నేషనల్ సాంగ్'గా ప్రభుత్వం గుర్తిస్తుందో చెప్పాలి కానీ శిక్షించే అధికారం (బిజోయి ఎమాన్యుల్ (1986) సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రభుత్వానికి లేదని చెప్పింది. ఈ తీర్పులో జాతీయ గీతాలాపన పుడు గౌరవ ప్రదంగా నిల్చోవాలి అన్నది అధికారిక ఆదేశాలు చట్టంలో రూపొందించినట్లు వుంటేనే సాధ్యపడుతుందని లేకపోతే, ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినట్లే నని అభిప్రాయపడింది! వందేమాతరం గీతాలాపన ఈ నేపథ్యంలో కొత్త సందేహాలతో పాటు కొత్త సమస్యలకు హేతువయింది! ఈ సున్నిత విషయాలను ప్రభుత్వాలు కానీ, లిటిగెంట్లు కానీ కోర్టులదాకా తీసుకెళ్ళటంతో మనను మనమే అగౌరవ పర్చుకున్నట్లు అవుతుంది. నిజానికి జాతీయ గీతాలాపన, జనగణమన అయినా, వందేమాతరం అయినా జాతిని మేలుకొల్పటంతో పాటు ఉద్వేగాన్ని, దేశ భక్తినీ ప్రభోదించి, ఉత్సాహపరిచేందుకే! ఈ అనవసరపు చర్చలూ, కొత్తగా తెచ్చిన ప్రభుత్వ నిబంధనలు అమలు పర్చాలని ప్రభుత్వాలు పట్టుపట్టడం వల్ల జాతి సమైక్యతా, సామరస్యాల మీద ప్రభావాన్ని చూపిస్తుంది! ప్రతిపక్షాలు కూడా కొన్ని సున్నితమైన, జాతీయ పరమైన విషయాలలో అనవసరపు పట్టు పట్టగూడదు. అవసరమనుకుంటే ఏపార్టీ అయినా 'అహం'ను ప్రక్కన పెట్టి అందరూ కలిసి కూర్చొని, ఇబ్బందులను కనీసం ఇలాంటి విషయాల్లోనైనా పరిష్కరించుకోక తప్పదు! ప్రతి సమస్యకూ అది చిన్నదయినా పెద్దదయినా పరిష్కారం సాధ్యపడుతుంది. మన దేశంలోని పౌరులందరినీ కుల, మత, వర్గవిభేదాలకు అతీతంగా ప్రభుత్వాలూ, ప్రతిపక్షాలూ దగ్గరికి తీసి, ఏకత్వాన్ని ప్రదర్శించినప్పుడే మన దేశ గొప్ప మార్గదర్శక సూత్రం 'ఏకత్వంలో భిన్నత్వం' బలోపేతం కావటమే కాకుండా జాతిసమైక్యతకు అద్దం పడుతుంది! ధర్మాలు ఏవైనా పాటించే మనుషులందరూ భారతీయులే! జాతీయతత్వంతో పాటు మానవతా వాదం అటు పాలకులూ, ప్రతిపక్షాలూ, ప్రజలు ఆదరించినప్పుడే దేశం అభివృద్ధి పథాన నడుస్తుంది! ఆర్థికంగా బలపడుతుంది. ప్రపంచ దేశాల మధ్య తలెత్తుకొని కీలక సమయాలలో ఇతర దేశాలకు గూడా అనుసరణీయ మవుతుంది! మన ఇరుదు పొరుగు దేశాలు శ్రీలంక, పాకిస్థాన్,బంగ్లాదేశ్, ఆఫ్ఘానిస్థాన్లు ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నాయో చూసినప్పుడు, మన దేశ నాయకులు విజ్ఞతా నైపుణ్యాన్ని పరిస్థితులకు ప్రభావాలకు లోనుగాకుండా ప్రదర్శించటం వల్లనే, ఇంతకాలం ప్రజాస్వామ్య పాలనా, మనుగడా సాధ్యపడింది! అన్ని దేశాల మాదిరే యుద్ధాలనూ, ఘర్షణలనూ, ఆర్థిక అసమానతలను ఎదుర్కొన్నా, భారతీయతను ఎల్లప్పుడూ కాపాడే నిజమైన విద్వేషరహిత మత సామరస్యాన్ని కాపాడుకుంటున్నాం! అన్ని మతాలకు ప్రతినిధిగానే భారత దేశం ఇప్పటికీ కొనియాడబడుతున్నది! నియంతలుగా పాలించటానికి ప్రయత్నించిన నాయకులను ప్రజలు నియంత్రించారు! తప్పు తెలుసుకొన్న సమర్థులైన నాయకులను తిరిగి ఎన్నికల ద్వారా అధికారంలోకి తీసుకొని రావటానికి వెనుకంజ వేయలేదు! ఆ చరిత్రతో అలరారుతూ అన్ని రంగాలలో గణనీయ ప్రగతిని సాధిస్తున్న భారత దేశం తప్పు టడుగులు వేయగూడదు! ఎన్నో సంవత్సరాల అభివృద్ధికి స్పీడ్ బ్రేకర్స్ను మనంతట మనమే కల్పించుకోగూడదు! నిన్నటి పాలకులు ఇవ్వాళ ప్రతిపక్షంగా మారారు! ప్రజాభిమానాన్ని కోల్పోవటం వల్లనే ఆ పరిస్థితి వారికి కలిగింది! అందుకే ఇవ్వాల్టిపాలకులు రేపటి ప్రతిపక్షాలుగా మారకుండా వుండాలంటే ప్రజలందరి అభిమానం కుల, మత, వర్గాలకు అతీతంగా ఉండే పాలనను అందజేస్తేనే సాధ్యపడుతుంది! ప్రజాస్వామ్యం అవలంభించినప్పుడు రాజు ప్రజలే అన్నది మరిచిపోగూడదు! ప్రజా నాయకుడు రాజుగా మారటం ఈ దేశ వ్యవస్థలో సాధ్యపడదేమో! ●

# విద్యార్థుల మరణాలకు అసలు కారకులెవరు?


పాపని నాగరాజు

ఒక విద్యార్థి చనిపోయినప్పుడు మొదటి ప్రశ్న అతను ఏ తప్పు చేశాడనే దానిపై ఉండకూడదు. అతను అలాంటి తీవ్ర నిర్ణయం తీసుకునే స్థితికి ఎలా చేరుకున్నాడు? ఆ సమయంలో విద్యాసంస్థ అతని సమస్యను వినే ప్రయత్నం చేసిందా? అవసరమైన సహాయం అందించిందా?అతని ఫిర్యాదులకు పరిష్కారం దొరికేమార్గం ఉందా? ఇవే ముందుగా పరిశీలించాల్సిన ప్రశ్నలు. ముంబైలోని ఐఐటీ విద్యార్థి సహిల్ వాకోడే మరణం తర్వాత వెలుగులోకి వచ్చిన పరిణామాలు ఈ ప్రశ్నలను మరింత ముఖ్యంగా చేశాయి. విద్యార్థి పరీక్ష సమయంలో సెల్‌ఫోన్ ఉపయోగించాడని, ప్రశ్నపత్రాన్ని కృత్రిమ మేధా సాధనానికి పంపాడని ఐఐటీ బొంబాయి తొలుత ప్రకటించింది. అయితే దర్యాప్తు పూర్తికాకముందే మరణించిన విద్యార్థికి సంబంధించిన వివరాలను వెల్లడించడం తగదని తర్వాత సంస్థ క్షమాపణ చెప్పింది. ఈ పరిణామం ఒక ప్రాథమిక సూత్రాన్ని గుర్తుచేస్తుంది. మరణించిన విద్యార్థి ఇక తన తరఫున వివరణ ఇవ్వలేడు. కాబట్టి అతని గురించి తుది అభిప్రాయాన్ని దర్యాప్తుకు ముందే నిర్మించడం న్యాయ సమ్మతం కాదు. ఇదే సందర్భంలో విద్యార్థి కుటుంబం కులవివక్షకు సంబంధించిన ఆరోపణలు చేయడం, వాటిపై పోలీసు కేసు నమోదవడం కూడా సమగ్ర విచారణలో భాగం కావాలి. ఆరోపణలను ముందుగానే నిజమని తేల్చడం ఎంత తప్పో, వాటిని విచారణ లేకుండానే కొట్టిపారేయడం కూడా అంతేతప్పు. విద్యార్థి ఏదైనా తప్పుచేసిఉంటే దానిపై నిబంధనల ప్రకారం విచారణ జరగాలి. కానీ ఆ తప్పు జరిగిన సందర్భాన్ని కూడా పరిశీలించాలి. అతనికి తన వాదన చెప్పే అవకాశం దొరికిందా? సమస్యను పరిష్కరించుకునే అవకాశం కల్పించారా? ఒక విద్యార్థి తీవ్ర నిస్సహాయత, న్యూనతా భావం, మానసిక సంక్షోభం లేదా ఒత్తిడిలోకి వెళ్లినప్పుడు, అతని వ్యక్తిగత పరిస్థితులతోపాటు సంస్థలోని పరిస్థితులు ఏమైనా ప్రభావం చూపించాయా అనే ప్రశ్నను కూడా పరిశీలించాలి. విద్యార్థి ఎందుకు ఆ స్థితికి చేరుకున్నాడో తెలుసుకోవాల్సిన దర్యాప్తును, అతను ఏ తప్పు చేశాడో నిరూపించే ప్రక్రియగా మార్చకూడదు. జాతీయ నేర గణాంకాల ప్రకారం 2004లో 5,610గా ఉన్న విద్యార్థుల ఆత్మహత్యలు 2024 నాటికి 14,488కు పెరిగాయి. ఇదే కాలంలో మొత్తం ఆత్మహత్యల్లో విద్యార్థుల వాటా 4.9 శాతం నుంచి 8.5 శాతానికి పెరిగింది. ఈ గణాంకాలు ప్రతి మరణానికి ఒకే కారణం ఉందని చెప్పవు. అయితే విద్యార్థుల ప్రాణాలను కాపాడేందుకు విద్యాసంస్థల బాధ్యతను మరింత లోతుగా పరిశీలించాల్సిన అవసరాన్ని మాత్రం స్పష్టం చేస్తున్నాయి. సహిల్ వాకోడే మరణంతర్వాత విద్యార్థుల నిరసనలు తీవ్రరూపం దాల్చడంతో ఐఐటీ బొంబాయి డీన్‌ను పరిపాలనా బాధ్యతల నుంచి సస్పెండ్ చేసింది. సంస్థ తన పరీక్షాశిక్షా విధానాన్ని కూడా సమీక్షించేందుకు అంగీకరించింది. విద్యార్థులు గతంలో సమర్పించిన ఫిర్యాదులకు స్పందన లు రాలేదని, తమ ఫిర్యాదుల స్థితి కూడా తెలియలేదని ఈసందర్భంగా తెలిపారు. దీనిపై విద్యార్థులు తమ ఫిర్యాదుల పరిష్కార స్థితిని తెలుసుకునేలా మరింత విద్యార్థి అనుకూల వ్యవస్థను ఏర్పాటు చేస్తామని సంస్థ హామీ ఇచ్చింది. అందుకే విద్యార్థి మరణంపై జరిగేవిచారణ పరిధి కూడావిస్తృతంగా ఉండాలి. విద్యార్థి వ్యక్తిగత పరిస్థితులు,విద్యా ఒత్తిడి, పరిపాలనా వైఖరి, ఫిర్యాదుల పరిష్కారం,వివక్షకు సంబంధించిన ఆరోపణలు, అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థ వంటి అంశాలను అవసరమైన మేరకు పరిశీలించాలి. ఒకే కారణాన్ని ముందుగానే నిర్ణయించుకుని మిగతా ప్రశ్నలను మూసివేయడం నిజమైన దర్యాప్తు కాదు. నిజాలను నిగ్గు తేల్చడంలో వ్యవస్థ విఫలమైతే, ఆ మరణం ఒక మూగ సాక్ష్యంగా మిగిలిపోతుంది. అందుకే విద్యార్థి చనిపోయిన తర్వాత అసలు పరీక్ష అతనిది కాదు, సంస్థదే. ●

# నిత్యావసరంగా మారుతున్న పర్యాటకం

డాక్టర్ రామకృష్ణ బండారు

గత రెండు దశాబ్దాలుగా ప్రపంచ ఆర్థికాభివృద్ధి గణాంకాలను పరిశీలిస్తే ప్రపంచ దేశాల అభివృద్ధికి కేవలం పారిశ్రామిక రంగమే కాకుండా సేవ రంగం కూడా ఎంతగానో దోహదపడుతుంది. అలాంటి సేవ రంగాలలో కీలకమైనది పర్యాటక రంగం. ప్రపంచ ఆర్థికరంగంలో సుమారు 9.8 శాతం వాటా పర్యాటక రంగానిదే. అలాగే, సుమారు 11.6 ట్రిలియన్ యూఎస్ డాలర్ల ఆదాయం పర్యాటక రంగం ద్వారా ప్రతిఏటా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సమకూరుతుంది. అంతేకాదు, ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ 9 ఉద్యోగాలలో ఒక ఉద్యోగం పర్యాటక రంగం సృష్టిస్తుంది.ప్రపంచంలో కొన్ని దేశాల ఆర్థికవ్యవస్థలు పూర్తిగా ఈ రంగం మీదనే ఆధారపడి ఉన్నాయంటే అది అతియోశక్తి కాదు. ఇక మన దేశ ఆర్థికవ్యవస్థలోను పర్యాటక రంగం పాత్ర కీలకమైనది. దేశీయ జీ.డీ.పీ లో పర్యాటక రంగం వాటా 2024 లో సుమారు 5.22 శాతం కాగా 2025 లో సుమారు 6.6 శాతం. 2025 లో భారతదేశ ట్రావెల్ అండ్ టూరిజం రంగం సుమారు 7.3 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది దేశ మొత్తం జీడీపీ వృద్ధి 7.5 శాతానికి దాదాపు సమానంగా దేశ ఆర్థిక వ్యవస్థలో ఈ రంగం వాటా సుమారు 263.6 బిలియన్ డాలర్లకు చేరుకుంది. సుమారు 31.69 బిలియన్ డాలర్ల విలువైన విదేశీ మారకపు ఆదాయం ఈ రంగం నుండే వస్తుంది. దాదాపు 46.2 మిలియన్ల మంది ఈ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. భారతదేశంలోని మొత్తం ఉద్యోగాలలో 10.8 శాతం వాటా ఈ రంగానిదే. సూక్ష్మంగా, ఈ గణాంకాలు చాలు పర్యాటక రంగం మార్కెట్ విలువను గుర్తించడానికి అలాగే, పర్యాటక రంగం నేటి తరానికి ఎంత దగ్గరైనదో అర్థం చేసుకోవడానికి. ఒకప్పుడు పర్యాటకం కేవలం సంపన్నుల కుటుంబాలకు మాత్రమే పరిమితమైన ఒక విలాసవంతమైన సేవ. ప్రస్తుతం ఇది సగటు మధ్యతరగతి కుటుంబాలకు నిత్యావసర సేవగా మారింది. కొన్నేళ్ల కిందట పర్యాటకం అంటే కేవలం వేసవి సెలవుల్లో బంధువులఇళ్లకు వెళ్లడానికో, లేదా వృద్ధాప్యంలో పుణ్యక్షేత్రాలను దర్శించడానికో మాత్రమే పరిమితమై ఉండేది. కానీ గత దశాబ్దకాలంగా పర్యాటక ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. ముఖ్యంగా, నేటి తరానికి, పర్యాటకం అనేది లగ్జరీ కాదు, ఇది ఒక నిత్యావసర సేవగా మారింది. నేటి తరం 'జీవనశైలిలో' భాగంగా వచ్చిన ఉద్యోగ,ఆర్థిక, సామాజిక,సాంకేతికమార్పులు టూరిజాన్ని వారికి మరింత దగ్గరచేసాయి. ముఖ్యంగా ఐటీ, కార్పొరేట్, బ్యాంకింగ్,ఇతర ఆధునిక ఉద్యోగాలలో పనిచేసే వారిపై పని ఒత్తిడి పెరుగుతుంది. ఉద్యోగాలలో టార్గెట్లు, ఎర్రర్స్, బగ్స్, నూతన టెక్నాలజీ అప్డేట్‌ల వంటి అంశాల వలన ఏర్పడే ఒత్తిడికి 'బర్న్ అవుట్' కాకుండా, మానసిక ప్రశాంతత కోసం ప్రజలు టూరిజంను ఒక ఔషధంగా భావిస్తున్నారు. నేటి ప్రజలదైనందిన జీవితంలో 'డిజిటల్ సాంకేతికత' వాడడం ఒక భాగమైనది. స్మార్ట్ఫోన్లు, సోషల్ మీడియా ప్లాట్ఫారమ్లు పర్యాటక రంగాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తున్నాయి. ఇన్స్టాగ్రామ్ రీల్స్,ట్రావెల్ బ్లాగ్ ద్వారా మునుపెన్నడూ చూడని నూతన పర్యాటక



ప్రాంతాలు వెలుగులోకి రావడం, యువత ఆయా ప్రాంతాలను సందర్శించి రీల్స్ చేయడం ద్వారా ఇతరులు ప్రభావితమవుతున్నారు.2005లో మన దేశ పర్యాటక ప్రాంతాలకు వచ్చే విదేశీ పర్యాటకుల సంఖ్య3.92 మిలియన్ మంది కాగా ఇది 2025 నాటికి 9.02మిలియన్‌కు చేరుకుంది. మనదేశం నుండి ఇతర దేశాలకు వెళ్లే పర్యాటకుల సంఖ్య 2005 లో 7.18 మిలియన్ ఉండగా 2025 కు ఆసంఖ్య 32.83 మిలియన్‌కు చేరుకుంది. కోవిడ్ కాలంలో కొంత పర్యాటకం కొంత తగ్గినప్పటికీ ఆ తరువాత తిరిగి పుంజుకుంది. ఈ గణాంకాలు చాలు రోజు రోజుకు పర్యాటకం ప్రజలకు ఎలా దగ్గరవుతుంతో తెలుసుకోవడానికి, మధ్యతరగతి ప్రజల జీవనశైలి మారడం, ఆదాయాలు పెరగడం, విదేశాలకు తక్కువ ధరల్లో విమాన సర్వీసులుకూడా అందుబాటులోకి రావడం, ప్రపంచ దేశాలు టూరిస్ట్ వీసాలు సులభతరం చేయడం వల్ల భారతీయులు ఎక్కువగా విదేశీ పర్యాటకం పై మక్కువ చూపుతున్నారు. భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ అధికారిక వార్షిక నివేది కలను పరిశీలిస్తే 2005లో డొమెస్టిక్ పర్యాటకుల సంఖ్య 392 మిలియన్‌కాగా, 2025నాటికి ఆ సంఖ్య 4,287.10 మిలియన్లకు చేరుకుంది. భారతదేశ పర్యాటకరంగానికి లభిస్తున్న మొత్తం ఆదాయంలో సుమారు 80శాతం కంటే ఎక్కువ వాటా కేవలం డొమెస్టిక్ పర్యాటకుల ద్వారానే లభిస్తోంది. డొమెస్టిక్ టూరిజంలో ఉత్తర ప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు మొదటి రెండు స్థానాల్లో ఉండగా ఆంధ్రప్రదేశ్ 4వ స్థానంలో,తెలంగాణ 13వ స్థానంలో ఉన్నాయి. ఇతర సేవ రంగాలతో పోలిచితే టూరిజం రంగం ప్రత్యేకమైనది. పర్యాటక రంగం లో రవాణా, వసతి, ఆహారం, వినోదం, సంస్కృతి,హస్తకళలు వంటి అనేకరంగాలు అనుసంధానమై ఉంటాయి. పర్యాటకుల అవసరాలను తీర్చే క్రమంలోవివిధ వృత్తులకు, చిన్న వ్యాపారాలకు, స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి.అంతేకాదు, విలువైన విదేశీమారక ద్రవ్యం కూడా లభిస్తుంది. అందుకే కేంద్రప్రభుత్వం దేశీయ పర్యాటక రంగ అభివృద్ధిపై దృష్టిపెట్టింది. అందుకు అనుగుణంగా బడ్జెట్‌లలో ఎక్కువ నిధులను కూడా కేటాయిస్తుంది. 'స్వదేశ్ దర్శన్ 2.0' కింద రూ.2,207 కోట్ల వ్యయంతో 53 థీమ్ ఆధారిత ప్రాజెక్టులను, 'ప్రసాద్' పథకం కింద రూ.1,726 కోట్ల విలువైన 54ఆధ్యాత్మిక క్షేత్రాల ఆధునీకరణ పనులను కేంద్రం చేపట్టింది. కనెక్టివిటీ, రవాణా మొదలగు మౌలిక అంశాల అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తుంది. పర్యాటక ప్రాంతాలను అనుసంధానిస్తూ 517 కొత్త ఎయిర్ రూట్లను, 157 విమానాశ్రయాలను అభివృద్ధి చేసింది పర్యాటక నగరాలను కలుపుతూ ప్రవేశపెట్టిన సెమీహైస్పీడ్ వందే భారత్ రైళ్లు, విస్టాడోమ్ కోచ్లు పర్యాటకులకు ఎంతగానో ఉపయోగపడు తున్నాయి. విదేశీయులు సులభంగా భారత్‌రావడానికి 165కంటే ఎక్కువ దేశాలకు 'ఈవీసా' సౌకర్యాన్ని కేంద్రప్రభుత్వం ప్రవేశపెటింది. హెటళ్లు,రిసార్టులు పర్యాటక మౌలిక సదుపాయాలలో పెట్టుబడులను ఆకర్షించడానికి 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిచ్చింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు స్థానికులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా రెండు తెలుగురాష్ట్రాలు పర్యాటకరంగానికి ప్రాధాన్యతను ఇస్తున్నాయి. పర్యాటకం దేశ ఆర్థికవ్యవస్థకు, యూవత ఉపాధి కల్పనకు ఒక బలమైన ఆయుధంగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ●

# జ్ఞానేశ్‌ను తొలగించేదాకా పోరాటం

## నేటి సిడబ్ల్యుసి సమావేశం అజెండా అదే: మల్లికార్జున ఖర్గే

## రేపటి ఇండియాకూటమి భేటీలో ఉమ్మడి వ్యూహరచన



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** కేంద్ర ఎన్నికల కమిషన్‌లోని ముగ్గురు కమిషనర్ల మధ్య అభిప్రాయ బేధాలున్నట్లు వెలుగులోకి రావడం, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఎన్నికల సంఘంలో మిగిలిన ఇద్దరు సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం లేదంటూ తాజాగా వెలుగులోకి రావడంతో రాజకీయాలలో తీవ్ర చర్చనీయాంశమైంది. కేంద్రంలోని అధికార ఎన్‌డియేకు ప్రధానంగా బిజెపికి అనుకూలంగా సిఇసి జ్ఞానేష్ కుమార్ వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు ఆరోపణలు గుప్పిస్తున్నాయి. సిఇసి జ్ఞానేష్‌పై అభిశంసన పెట్టాలని ఇండియా కూటమి యోచిస్తోంది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) మంగళవారం సమావేశం కానుంది. కేంద్రం తీరును ఎండగట్టడంతోపాటు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్‌పై ఒత్తిడి పెంచేందుకు, అలాగే కుమార్ తొలగింపును కోరుతూ పార్టీ అను సరించాల్సిన తదుపరి కార్యాచరణపై చర్చిం చేందుకు సిడబ్ల్యుసి సమావేశాన్ని ఏర్పాటు చేశామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సోమవారం మీడియా సమావేశంలో వెల్ల డించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు తమ సూచనలు ఇస్తారని, ఈ విషయాన్ని పార్టీ తీవ్రంగా పరిగణించాలను కుంటుందని ఖర్గే తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం 6లో మార్పులు, ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులు, ఓటర్ల జాబితా డేటా బేస్‌పై కేంద్రీకృత నియంత్రణ వంటి అంశాలపై ఎన్నికల కమిషనర్లు ఆందోళనలు వ్యక్తం చేయడం ద్వారా ఎన్నికల సంఘంలోని పనితీరును "బహిర్గతం చేశారని అన్నారు. "ఎన్నికల సం ఘంలో అభిప్రాయ భేదాలతోపాటు, సిఇసి ఒంటెత్తుపోకడలపై తాము తీవ్రంగా పోరాడ బోతున్నాం. ఇది దేశం మొత్తానికి, మన ప్రజాస్వామ్య ఉనికికి, దేశ మనుగడకు సంబంధించిన అంశం. అందుకే తాము ఈ విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నాము" అని ఖర్గే స్పష్టం చేశారు. "ఎన్నికల సంఘంలోని వ్యక్తులే వారి బండారాన్ని బయటపెట్టారు. స్వయంగా సిఇసి తనతో ఎన్నికల్లో పోటీ చేయమని చెప్పారని కేరళ మాజీ ప్రధాన కార్యదర్శి కూడా పేర్కొన్నారు. అంటే ఆయన బిజెపి సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్నారని, బిజెపి కార్యకర్తగా మారిపోయారని అర్థం" అని ఖర్గే అన్నారు. అంతేకాకుండా, జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. "ఆయన రాజీనామా చేసిన తర్వాత కూడా తాము ఆయనపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది" అని ఖర్గే అన్నారు. సిఇసి కుమార్ తొలగింపు డిమాండ్‌పై ఒత్తిడి పెంచడానికి, ఈ విషయంలో ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి పార్టీ అత్యున్నత నిర్ణయాధికార సంస్థ వ్యూహరచన చేస్తుందని వర్గాలు తెలిపాయి. రాబోయే ఎన్నికల సన్నాహాలపై కూడా చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎస్ఐఆర్ ప్రక్రియలో జెన్ జెడ్ తరాన్ని లక్ష్యంగా చేసుకుని మినహాయింపులు ఇస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. కుమార్ తక్షణమే రాజీనామా చేయాలన్న తమ డిమాండ్‌ను గట్టిగా వినిపించింది.

**రేపు ఇండియా కూటమి సమావేశం:**

ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో కేంద్రం, ఎన్నికల సంఘం ప్రతిపక్షాల విమర్శలను ఎదుర్కొంటున్నాయి. ఇదిలా ఉండగా, ప్రతిపక్ష ఇండియా కూటమి కూడా ఈ అంశంపై ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించడానికి బుధవారం సమావేశం కానుంది. సిఇసి జ్ఞానేష్ కుమార్ తొలగింపు కోసం పార్లమెంటులో మరో నోటీసు దాఖలు చేసే అవకాశం ఉంది. ఈ సమావేశంలో ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పట్ల తమ వైఖరిని, విస్తృత సవరణ సమస్యలను చర్చించే అవకాశం ఉంది.



## సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిచ్ రాజీనామా

**బెల్‌గ్రేడ్, సెప్టెంబరు 28:** సెర్బియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిచ్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆయన రెండో అధ్యక్ష పదవీకాలం పూర్తికాకముందే ముగిసింది. అక్టోబర్ 25న జరగనున్న ముందస్తు పార్లమెంటరీ ఎన్నికల్లో తన సెర్బియన్ ప్రోగ్రెసివ్ పార్టీ తరఫున ప్రధానమంత్రి అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆయనకు మార్గం సుగమమైంది. వుసిచ్ తన రాజీనామా లేఖపై సంతకం చేసి, రాజ్యాంగ ప్రక్రియ ప్రకారం అధ్యక్ష బాధ్యతలను పార్లమెంట్ స్పీకర్ అనా బర్నాబిచ్ కు అప్పగించారు. కొత్త అధ్యక్షుడు ఎన్నికయ్యే వరకు ఆమె తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహించనున్నారు. రాజీనామా ప్రకటిస్తూ వుసిచ్ తాను ఇక అధ్యక్షుడిగా కాకుండా సాధారణ పౌరుడిగా రాబోయే పార్లమెంటరీ ఎన్నికల్లో పాల్గొనాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అక్టోబర్ 25న జరగనున్న ఎన్నికల్లో తన పార్టీ తరఫున ప్రధాని పదవికి పోటీ చేసే అవకాశం ఉంది. వుసిచ్ 2017లో తొలిసారి సెర్బియా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2022లో మరోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. రాజ్యాంగ పరిమితుల కారణంగా మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ చేసే అవకాశం లేకపోవడంతో, ఈసారి పార్లమెంటరీ ఎన్నికల ద్వారా రాజకీయంగా కొనసాగేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారు. వుసిచ్ రాజీనామా అనంతరం పార్లమెంట్ స్పీకర్ అనా బర్నాబిచ్ తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సెర్బియా చట్టాల ప్రకారం కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునే వరకు ఈ బాధ్యతలు తాత్కాలికంగా కొనసాగుతాయి.

## యుపిఐ ఎండిఆర్ ఛార్జీలపై సుప్రీం విచారణ

## ఆర్బీఐ, ఎన్‌పిసిఐలకు నోటీసులు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** రూ.2,000 కంటే ఎక్కువ మొత్తంలో జరిగే కొన్ని నిర్దిష్ట యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ ఛార్జీలు విధించడంపై సుప్రీంకోర్టు స్పందించింది. అసలు ఏ చట్టబద్ధమైన ప్రాతిపదికన ఈ ఛార్జీలు విధిస్తున్నారు వీటి ద్వారా ఎవరికి లాభం చేకూరుతుంది ఈ డబ్బులు ఎవరెవరికి ఎలా పంపిణీ అవుతాయి అని ప్రశ్నిస్తూ కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలను వివరణ కోరింది. ఈ నూతన ఫీజు విధానాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ ఛార్జీల అమలుపై వెంటనే స్టే ఇవ్వాలని పిటిషనర్ కోరినప్పటికీ, న్యాయస్థానం దానికి నిరాకరించింది. సంబంధిత సంస్థలన్నీ తమ అఫిడవిట్లను దాఖలు చేసిన తర్వాతే ఈ అంశాన్ని పరిశీలిస్తామని, ప్రస్తుతం ఈ ఛార్జీల చట్టబద్ధతపై ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. దాదాపు ఆరేళ్ల పాటు ఉచితంగా సాగిన యూపీఐ సేవలకు ముగింపు పలుకుతూ,వచ్చేనెల 15 నుంచి రూ. 2,000 పైన ఉండే కొన్ని వ్యాపార లావాదేవీలపై 0.4 శాతం రుసుమును విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే సాధారణ వ్యక్తుల మధ్య జరిగే లావాదేవీలు , అలాగే రూ. 2,000 కంటే తక్కువ మొత్తంలో ఉండే చిన్న చిన్న చెల్లింపులకు ఈ ఛార్జీల నుంచి మినహాయింపు ఉంటుంది. రూ. 75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలకు ఈ ఫీజు గరిష్టంగా రూ. 300 దాటకూడదని పరిమితి విధించారు. అంతేకాకుండా రైల్వేలు, టెలికాం, ఇన్సూరెన్స్, ఇంధనం (పెట్రోల్/డీజిల్), వ్యవసాయ రంగాలు వంటి తక్కువ లాభాలు ఉండే కీలక రంగాల వ్యాపారులకు రూ. 2,000 పైబడిన లావాదేవీలపై ఒక్కో లావాదేవీకి కేవలం రూ. 5 మాత్రమే ఫ్లాట్ ఫీజుగా నిర్ణయించారు. దీంతో న్యాయవాది అంజన్ దత్తా దాఖలు సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన పిటిషన్ దాఖలు చేశారు. కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ 14న ఇచ్చిన నోటిఫికేషన్‌ను, సెప్టెంబర్ 15న ప్రకటించిన ఎండీఆర్ ఫ్రేమ్‌వర్క్‌ను ఈ పిల్ సవాలు చేస్తోంది. తగినంత చట్టబద్ధమైన భద్రతలు, పారదర్శకత లేదా ప్రజా సంప్రదింపులు లేకుండానే ఈ రుసుమును ప్రవేశపెట్టారని పిటిషన్లో ఆరోపించారు.

రూ. 2,000 పైన ఉండే యూపీఐ లావాదేవీల ఫ్రేమ్‌వర్క్‌ను వెంటనే రద్దు చేయాలని లేదా నిలిపివేయాలని కోరారు. ఒకవేళ అది కుదరకపోతే పారదర్శకంగా చర్చలు జరిపి, గణాంకాలు, ప్రభావ అంచనాలను వెల్లడించి, సూ , చిన్న తరహా పరిశ్రమలకు రక్షణ కల్పిస్తూ కొత్తగా సమీక్ష చేపట్టాలని కోరారు.

## మళ్లీ కమ్ముకొస్తున్న యుద్ధమేఘాలు

## ట్రంప్ వార్నింగ్‌పై ఇరాన్ తిరిగి సీరియస్ వార్నింగ్




**టెహ్రాన్,సెప్టెంబరు 28:** హిందూ మహాసముద్రంపై యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. నిన్నమొన్నటి దాకా ఒక ప్రాంతానికే పరిమితమైన ఇరాన్ అమెరికా దాడులు.. ఇప్పుడు సముద్ర జలాలను దాటుతున్నాయి. అమెరికా మళ్లీ దాడులకు దిగితే.. ఈసారి యుద్ధం హిందూ మహాసముద్రం వరకు విస్తరిస్తుందని ఇరాన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. కేవలం మిలిటరీ దాడులే కాదు.. ఆర్థిక ఆంక్షలతో అమెరికా ఉక్కిరిబిక్కిరి చేస్తుండటంతో ఇరాన్ ప్రతీకార చర్యలకు సిద్ధమవుతోంది. ఇరాన్ అన్నంత పని చేస్తే ఆ ప్రభావం భారత్ సహా అనేక దేశాలపై నేరుగా ఉంటుంది. పశ్చిమాసియా యుద్ధం భౌగోళిక సరిహద్దులు దాటుతోంది. ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ సలహాదారు రహీమ్ సఫవీ అమెరికాకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. అమెరికా మళ్లీ దాడులకు పాల్పడితే యుద్ధం హిందూ మహాసముద్రం వరకు చేరుకుంటుందని ఫార్స్ న్యూస్ ఏజెన్సీ విడుదల చేసిన వీడియోలో ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే పెర్షియన్ గల్ఫ్ హోర్ముజ్ జలసంధి నుంచి ఈ వివాదం ఎర్ర సముద్రానికి పాకింది. ఇప్పుడు ఏకంగా హిందూ మహాసముద్రం పేరును ఇరాన్ సలహాదారు బహిరంగంగా ప్రస్తావించడం ఇదే తొలిసారి. ఇరాన్ కు సుమారు 4 వేల కిలోమీటర్ల దూరంలో హిందూ మహాసముద్రంలోని డిగో గార్సియాలో అమెరికా, బ్రిటన్ మిలిటరీ బేస్ ఉంది. తాజా హెచ్చరికలతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. వాణిజ్య మార్గాలపై ఆధిపత్యం ఇప్పుడు ప్రధాన ఆయుధంగా మారింది. సౌదీ మద్దతు ఉన్న ప్రభుత్వ బలగాలతో పోరాడుతున్న యెమెన్ హౌతీలు.. ఎర్ర సముద్ర తీరాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఆసియా, యూరప్ ఖండాలను సూయజ్ కెనాల్ ద్వారా కలిపే అత్యంత కీలకమైన బాబ్ ఎల్‌మండేబ్ జలసంధిపై హౌతీలు తమ పట్టును మరింత బిగించారు. ఫిబ్రవరి చివర్లో జరిగిన అమెరికా ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా ఇరాన్ కూడా హార్ముజ్ జలసంధిని దిగ్బంధించింది. ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాలో కీలకమైన ఈ హార్ముజ్ జలసంధిపై నియంత్రణ కోసం ఇప్పుడు అమెరికా, ఇరాన్ తీవ్రంగా పోటీ పడుతున్నాయి. సరిహద్దుల్లో సైనిక మోహరింపులతో పాటు ఇరాన్ పై ఆర్థిక యుద్ధం కూడా తీవ్రమైంది. ఇరాన్ ఎయిర్‌లైన్స్‌పై అమెరికా ఆంక్షలు విధించింది. ఇరాన్ ఎయిర్‌లైన్స్‌తో ప్రపంచ దేశాల సంస్థలు వ్యాపారం చేయకుండా అడ్డుకునేందుకు యూఎస్ ట్రెజరీ సెప్టెంబర్ 23ని డెడ్‌లైన్‌గా విధించింది. డెడ్ లైన్ ముగియడంతో దుబాయ్ లాంటి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన ఇరాన్ విమాన సర్వీసులు రద్దయ్యాయి. దీనిపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. అమెరికా నిషేధాన్ని పాటించే పొరుగుదేశాలపై ప్రతీకారం తీర్చుకుంటామన్నారు.



## ఢిల్లీ మంత్రి దుడుకువైఖరిపై రాహుల్ సీరియస్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** ఢిల్లీలో మంత్రి పర్వేశ్ వర్మ రోడ్లను తనిఖీ చేస్తుండగా వీడియో తీసిన యువకుడిని అతడు చెంపదెబ్బ కొట్టడం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఈ ఘటనపై తాజాగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పందించారు. మంత్రి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీ నేతలకు ఓటర్లంటే ఏమాత్రం భయం లేదని అన్నారు. తమ పార్టీ అధికారంలో ఉందని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. తమ సమస్య గురించి ప్రశ్నించినందుకు ఓ యువకుడిని చెంపదెబ్బ కొట్టడం సరైన చర్య కాదన్నారు. వీడియోలో ఢిల్లీ ప్రభుత్వానికి చెందిన బీజేపీ మంత్రి ఒక యువకుడిని చెంపదెబ్బ కొట్టడం కనిపిస్తోందని, అతడు చేసిన నేరం ఏమిటి అని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. ప్రజల మధ్యలో ప్రశ్నిస్తే చెంపదెబ్బ పేపర్ లీక్స్ గురించి అడిగితే లాఠీఛార్జి పార్లమెంట్‌లో ప్రశ్నిస్తే మైక్ స్విచ్ఛాఫ్ చేయడం ఇవన్నీ అధికారం ఉందనే అహంకారంతో చేసే చర్యలన్నారు. తప్పుచేస్తే ప్రజలు తమను గద్దె దించుతారనే భయం వారిలో లేదని విమర్శించారు. బీజేపీ నేతలు అధికారంలోకి వచ్చేది ఓటు చోరీతో అని, అందుకే వారికి ప్రజల మద్దతుతో అవసరం ఉండదని రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై మంత్రి పర్వేశ్ వర్మ స్పందిస్తూ ఇలాంటి విషయాలకు ఆయన దూరంగా ఉండాలని సూచించారు.

## నావిక్ పునరుద్ధరణకు ఇస్రో తక్షణ కార్యాచరణ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** భారత్ సొంత నావిగేషన్ వ్యవస్థ నావిక్ స్వతంత్ర పొజిషనింగ్ సేవలను అందించేందుకు అవసరమైన కనీస ఉపగ్రహాల సంఖ్య కంటే దిగువకు చేరింది. దీంతో నావిక్ ఉపగ్రహ సమూహాన్ని పునరుద్ధరించే ప్రక్రియను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ వేగవంతం చేసింది.నావిక్ రెండో తరం ఉపగ్రహాల శ్రేణిలో మూడో ఉపగ్రహమైన ఎన్వీఎస్03ను కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ప్రస్తుతం ఇస్రో ముందున్న తక్షణ లక్ష్యంగా ఉంది. ఇందుకోసం శ్రీహరికోటతో పాటు ఇస్రోకు చెందిన ఇతర కేంద్రాల్లో సన్నాహాలు కొనసాగుతున్నాయి. సీనియర్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, అక్టోబర్ రెండో భాగంలో లేదా నవంబర్‌లో ఎన్వీఎస్03 ప్రయోగం జరిగే అవకాశం ఉంది. ఎన్వీఎస్03ని పిఎస్ఎల్వీకి బదులుగా జిఎస్ఎల్వీ మార్క్2 రాకెట్ ద్వారా ప్రయోగించే అవకాశం ఉంది. వరుసగా రెండు ప్రయోగాల్లో వైఫల్యాలు ఎదురైన నేపథ్యంలో పిఎస్ఎల్వీని ప్రస్తుతం నిలిపివేశారు. వైఫల్యాలపై ఏర్పాటు చేసిన కమిటీ సూచించిన సరిదిద్దే చర్యలు పూర్తయిన తర్వాతే పిఎస్ఎల్వీని తిరిగి ప్రయోగాలకు ఉపయోగించే అవకాశం ఉంది. నావిక్ ప్రాథమిక పొజిషనింగ్ సేవలను అందించాలంటే కనీసం నాలుగు ఉపగ్రహాలు పనిచేస్తూ ఉండాలి. పూర్తి సామర్థ్యంతో నావిక్ వ్యవస్థ పనిచేయాలంటే ఏడు ఉపగ్రహాలు అవ సరం. అయితే గత కొన్నే ళ్లుగా ఉపగ్రహాలు, వాటిలోని అణు గడియారాల్లో తలెత్తిన సమస్యల కారణంగా నావిక్ వ్యవస్థ దెబ్బతింది. తాజాగా ఐఆర్ఎన్ఎస్ఎస్ 1ఎఫ్ ఉపగ్రహం తన సేవా కాలాన్ని పూర్తి చేయడంతో అందుబాటులో ఉన్న ఉపగ్రహాల సంఖ్య మరింత తగ్గింది. దీంతో స్వతంత్ర పొజిషనింగ్ సేవలకు అవసరమైన కనీస స్థాయి కంటే నావిక్ దిగువకు చేరింది.భారత్‌కు కీలకమైన నావిగేషన్ వ్యవస్థ నావిక్‌ను తిరిగి అందుబాటులోకి తీసుకురావడంలో ఎన్వీఎస్03 కీలకం కానుంది.

## స్వయంప్రతిపత్తితో కూడిన రాష్ట్ర హోదాకు అసెంబ్లీ తీర్మానం

### బిజెపి, కాంగ్రెస్, ఎన్సీ సభ్యుల మధ్య వాగ్వాదాలు



**శ్రీనగర్, సెప్టెంబరు 28:** జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తితో కూడిన రాష్ట్ర హోదా కల్పించాలని సీఎం ఒమర్ అబ్దుల్లా డిమాండ్ చేశారు. ఈ మేరకు అసెంబ్లీలో ఒక తీర్మానాన్ని ప్రవేపెట్టారు. బీజేపీ ఎమ్మెల్యేలు దీనిని వ్యతిరేకించారు. సభ మధ్యలోకి దూసుకెళ్లి హంగామా చేశారు. మైక్రోఫోన్లు విసిరేందుకు ప్రయత్నించడంతో సభలో గందరగోళం చెలరేగింది. ఒమర్ అబ్దుల్లా ప్రవేశపెట్టిన రాష్ట్ర హోదా తీర్మానంలో, ఆర్టికల్స్ 370, 35ఏ పునరుద్ధరణను చేర్చాలని కోరుతూ అధికార నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) ఎమ్మెల్యేలతో సహా పలువురు సభ్యులు సోమవారం సవరణ తీర్మానాలను ప్రవేశపెట్టారు. 2000లో ప్రవేశపెట్టిన స్వయంప్రతిపత్తి తీర్మానాన్ని కూడా ఇందులో ప్రస్తావించారు. ఈ తీర్మానాన్ని బీజేపీ ఎమ్మెల్యేలు వ్యతిరేకించారు. దేశ వ్యతిరేక, పాకిస్థానీ ఎజెండా అని ఆరోపించారు. తీర్మానం ప్రతులను చించివేశారు. సీఎం ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని ప్రభుత్వాన్ని గద్దె దించాలని, అసెంబ్లీ స్పీకర్ అబ్దుల్ రహీం రథర్‌ను తొలగించాలని నినాదాలు చేశారు.



# నేపాల్‌లో వరదల బీభత్సం

### భారీ వర్షాలకు మూడు రోజుల్లో 24 మంది మృత్యువాత

## 15 మందికి పైగా గల్లంతు

**ఖాట్మండు, సెప్టెంబరు, 28:** నేపాల్‌ను మళ్లీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో అనేక ప్రాంతాల్లో వరద పోటెత్తింది. భారీ వర్షాల కారణంగా మూడు రోజుల్లో 24 మంది ప్రాణాలు కోల్పోగా.. 15 మందికిపైగా గల్లంతయ్యారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో అటవీ ప్రాంతాలలోని అనేక నివాసాలు నేలమట్టమయ్యాయి. రోడ్లు, వంతెనలు, ఇతర మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక విడియోలో ఇళ్లకు సమీపంలో ఉన్న కొండ చరియలలోని సగభాగం క్షణాల్లో కూలిపోయిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. అనేక గ్రామాలను వరదలు ముంచెత్తుతుండడంతో వందలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

**పొంగి ప్రవహిస్తున్న నదులు..**

వర్షాల వల్ల నేపాల్‌లోని కాలి, గండకి, నారాయణి, టినౌ నదులు పొంగి ప్రవహిస్తున్నట్లు నేపాల్ జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు, నిర్వహణ సంస్థ వెల్లడించింది. సున్‌కోషి, బుధి గండకి, మహాకాళి నదులలో నీటి మట్టాలు హెచ్చరిక స్థాయి దాటి ప్రవహిస్తున్నాయి. దీంతో మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాలలో వందలాది ఇళ్లు దెబ్బతిన్నాయని..

సుమారు 1,500 మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని అధికారులు పేర్కొన్నారు. వంతెనలు కొట్టుకుపోవడంతో పలు ప్రాంతాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కాళీ గండకీ నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండడంతో స్యాంగ్జాలోని బెల్తారీలో ఉన్న 144 మెగావాట్ల జలవిద్యుత్ ప్రాజెక్టుకు చెందిన మీర్మీ డ్యామ్ మూడు గేట్లను పూర్తిగా ఎత్తేశారు. విద్యుత్ ఉత్పత్తిని నిలిపేశారు.

గత నెలలో వచ్చిన ఆకస్మిక వరదలతో ఇప్పటివరకూ దాదాపు 1,453 మంది ప్రాణాలు కోల్పోగా.. 5 వేల మందికిపైగా గల్లంతయ్యారు.

## మూడునెలల్లోగా పార్టీ గుర్తు, పేరు అంశాన్ని తేల్చాలి

## కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు న28:** తృణమూల్ కాంగ్రెస్ పార్టీ లో రెండు వర్గాల మధ్య ఘర్షణాత్మక వాతావరణం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. టీఎంసీ పేరు, ఆ పార్టీ ఎన్నికల గుర్తు అంశంలో ఇవాళ సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. మూడు నెలల్లోగా ఈ అంశాన్ని తేల్చాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనతో కూడిన ధర్మాసనం ఈ కేసులో విచారణ చేపట్టింది. పార్టీ పేరు, గుర్తు అంశంలో బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ సుప్రీంలో పిటీషన్ దాఖలు చేశారు. అయితే టీఎంసీకి చెందిన రెండు వర్గాలు తమ వాదనలను కేంద్ర ఎన్నికల సంఘం ముందు నాలుగు వారాల్లోగా సమర్పించాలని సుప్రీం తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. ఇక ఈ అంశాన్ని మూడు నెలల్లోగా తేల్చాలని కూడా ఎన్నికల సంఘానికి సుప్రీం ధర్మాసనం అల్టిమేటం జారీ చేసింది.

టీఎంసీ పేరు, పార్టీ సింబల్‌ను ఈసీ ఫ్రీజ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ మమతా బెనర్జీ కోర్టును ఆశ్రయించారు. అయితే రెండు వర్గాలకు ఈసీ రెండు రకాల పేర్లు, గుర్తులను ఇటీవల కేటాయించింది. అక్టోబర్ 6న నందిగ్రామ్, రెజినగర్‌లో ఉప ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఇది కీలకాంశంగా మారింది.


# సంక్షిప్త వార్తలు

## ఉజ్జయినిలో షాహీ మసీదు భాగం తొలగింపుపై ఉద్రిక్తత



**ఉజ్జయిని, సెప్టెంబరు 28:** మధ్యప్రదేశ్ ఉజ్జయినిలో షాహీ మసీదులో కొంత భాగాన్ని తొలగించడంపై సోమవారం నిరసనలు చోటుచేసుకున్నాయి. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన మధ్యప్రదేశ్ హైకోర్టు మసీదు భాగం తొలగింపునకు అనుమతించిన గత ఉత్తర్వులకు వ్యతిరేకంగా దాఖలైన అప్పీల్‌ను కొట్టివేసింది. మసీదు నిర్వహణ కమిటీ, మున్సిపల్ కార్పొరేషన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని కూడా హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ ఒప్పందం ప్రకారం మసీదులోని కొంత చిన్న భాగాన్ని మాత్రమే తొలగించాల్సి ఉంటుంది.

## యుఎఇ అధ్యక్షుడితో ఇజ్రాయెల్ ప్రధాని రహస్యభేటీ




అబూదాబి, సెప్టెంబరు 28: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ ఓ ఆసక్తికర వార్త వెలుగులోకి వచ్చింది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ ఆదివారం అబుదాబీలో యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌ను కలిశారు. ఈ విషయాన్ని సీనియర్ ఇజ్రాయెలీ అధికారి ఈ సమాచంర వార్తా సంస్థతో పంచుకున్నారు. ఈ సమావేశం గురించి అటు నెతన్యాహూ కార్యాలయం గానీ ఇటు యూఏఈ విదేశాంగ శాఖ గానీ వెంటనే ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం. 2023 అక్టోబర్ 7న హమాస్ తీవ్రవాద సంస్థ ఇజ్రాయెల్‌పై దాడి చేసింది. ఈ ఘటనకు కొంత కాలం ముందే హమాస్ భారీ ఆపరేషన్‌కు సిద్ధమవుతోందని నెతన్యాహూను యూఏఈ అధినేత హెచ్చరించారనే విషయమై ఇటీవల తీవ్రంగా చర్చ జరుగుతోంది.

## సొంతూళ్లకు బయలుదేరిన లవ్‌లీ వర్సిటీ విద్యార్థులు



**పగ్వారా, సెప్టెంబరు 28:** పంజాబ్‌లోని కపుర్తలా జిల్లాలో ఉన్న లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో భీకర వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. హింసాత్మక ఘటనల తర్వాత సోమవారం ఆ వర్సిటీలో పరిస్థితి శాంతించింది. 10 రోజులు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు స్వంత ఊళ్లకు వెళ్తున్నారు. విధ్వంసానికి పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటామని పంజాబ్ డీజీపీ వార్నింగ్ ఇచ్చారు. జాతీయ రహదారి44పై 15 గంటలుగా స్తంభించిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రస్తుతం యూనివర్సిటీలో భారీ స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ నిధి తివారి ఆత్మహత్య



**భోపాల్, సెప్టెంబరు 28:** సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ నిధి తివారి ఆత్మహత్య చేసుకున్నది. ఆమెకు ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో సుమారు 16 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఆమె వయసు 30 ఏళ్లు. ఎఫ్‌బీలో 9 లక్షలు, ఇన్‌స్టాలో 7 లక్షల మంది ఆమెకు ఫాలోవర్లు ఉన్నారు. వింధ్యా పర్వత ప్రాంతానికి చెందిన ఫేమస్ సోషల్ మీడియా పర్సనాల్టీగా ఆమెకు గుర్తింపు ఉన్నది. సోషల్ మీడియాలో ఆమె చేస్తున్న పోస్టులకు రెగ్యులర్‌గా రియాక్షన్స్ వస్తుంటాయి. ఆమె వీడియోలను కూడా లక్షలాది మంది వీక్షిస్తుంటారు. 2024లో నిధి తివారికి మిస్ ప్రెట్టీ ఇండియా టైటిల్ దక్కింది.

## 'మేనమామ బంగారు ఉంగరం' ప్రారంభించిన సిఎం విజయ్



**మదురై, సెప్టెంబరు 28:** తమిళనాడులో మరో కొత్త స్కీమ్‌కు ముఖ్యమంత్రి విజయ్ శ్రీకారం చుట్టారు. నవజాత శిశువుల కోసం థాయ్ మామన్ తంగా మోతిరం తిట్టం పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించింది. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సోమవారం మదురైలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ పథకాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పుట్టిన అర్హులైన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం అందించడం ఈ పథకం ఉద్దేశం. ఈ పథకం కింద 2026 జూన్ 22 నుంచి ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మించిన అర్హులైన శిశువులను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. తొలి దశలో పంపిణీ కోసం ప్రభుత్వం 1.28 లక్షల బంగారు ఉంగరాలను సిద్ధం చేసింది.

# రూ. 60 కోట్లతో 50 వేల మందికి కాటమయ్య రక్షణ కవచాలు



సోమవారం ప్రజాభవన్‌లో బిసి సంక్షేమ శాఖపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం భట్టి

## రూ.450 కోట్లతో 1.30 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు జమ
## నవంబరు నుంచి రాజీవ్ యువవికాసం ప్రారంభం
## ఓవర్సీస్ స్కాలర్‌షిప్ దరఖాస్తుల గడువు అక్టోబరు 15 వరకు పెంపు
## బిసి సంక్షేమానికి ప్రాధాన్యం: డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

**హైదరాబాద్,సెప్టెంబరు28,ప్రభాతవార్త:** రాష్ట్రంలో బీసీ సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సోమవారం ప్రజాభవన్‌లో బీసీ సంక్షేమ శాఖపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బాలామాయాదేవి, ఎంజేపీ సెక్రటరీ సైదులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, పద్మ, ఇందిరా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం లో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ.. ప్రీ మెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ నిధులను నేరుగా విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లోకే (డిబిటి పద్ధతి ద్వారా) జమ చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఈ నూతన విధానం ద్వారా ఇప్పటివరకు 1,30,000 మంది విద్యార్థులకు ..450 కోట్ల నిధులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. అలాగే హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మోటిక్ ఛార్జీలను సైతం ఏ నెలకు ఆ నెల ఖచ్చితంగా విద్యార్థుల ఖాతాల్లోనే జమ చేయాలని అధికారులను ఆదేశించారు. గీత కార్మికుల సంక్షేమానికి ఉద్దేశించిన ఖికాటమయ్య రక్షణ కవచాలుఖి పథకం కింద ఇప్పటివరకు 50 వేల మందికి కిట్స్ మంజూరు కాగా, ఇప్పటికే 40 వేల కిట్లను అందించినట్లు వివరించారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న మరో 10 వేల మందికి కూడా శిక్షణ పూర్తయ్యాక కాటమయ్య రక్షణ కవచం కిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ పథకం కోసం మొత్తం ..60 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలోని బీసీ నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉన్నతి కల్పించే లక్ష్యంతో రూపొందించిన "రాజీవ్ యువ వికాసం" పథకాన్ని నవంబర్ నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈ పథకానికి సంబంధించి స్వీకరించిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ల సమక్షంలో పారదర్శకంగా పరిశీలించి అర్హులైన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని అధికారులను సూచించారు. ఎంజేపీ (మహాత్మా జ్యోతిబా పూలే) గురుకులాల్లో ఉన్న పెండింగ్ బిల్లులను త్వరలోనే క్లియర్ చేస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. గురుకుల విద్యాలయాలకు స్వంత భవనాలు మంజూరు చేయాలని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేయగా, ఆ అంశాన్ని పరిశీలిస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ఏడాది ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద మొదటి, రెండవ విడతల (ఇన్‌స్టాల్‌మెంట్స్) రూపంలో 180 మంది విద్యార్థులకు ..18 కోట్ల 40 లక్షల నిధులను విడుదల చేశామని చెప్పారు. అర్హులైన విద్యార్థులందరికీ అవకాశం కల్పించేందుకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువును అక్టోబర్ 15 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా, బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి కూడా త్వరలోనే నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

# భారత్ స్టార్ షూటర్ ఈషాసింగ్‌కు సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

**హైదరాబాద్,సెప్టెంబరు28,ప్రభాతవార్త:** జపాన్‌లో జరుగుతున్న 2026 ఆసియా క్రీడల్లో మహిళల 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో భారత స్టార్ షూటర్, తెలంగాణ ముద్దుబిడ్డ హైదరాబాద్ నగరానికి చెందిన ఈషా సింగ్ వెండి పతకం సాధించడం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఐదుసార్లు షూట్‌ఆఫ్స్‌లో ఒత్తిడిని ధైర్యంగా ఎదుర్కొని, స్వల్ప తేడాతో బంగారు పతకాన్ని కోల్పోయినా ఆమె ప్రదర్శన అద్భుతమని ప్రశంసించారు. ఈషా సింగ్ పోరాట స్ఫూర్తి క్రీడాలోకానికి ఆదర్శమని పేర్కొన్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ వేదికలపై మరెన్నో గొప్ప విజయాలు అందుకొని దేశ ప్రతిష్ఠను, తెలంగాణ కీర్తిని చాటాలని ఆకాంక్షి ంచారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి: కెటిఆర్

**హైదరాబాద్,సెప్టెంబరు28,ప్రభాతవార్త:** త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం హైదరాబాద్‌లో తన ఓటును నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ఎన్నికలు జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లోని అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి, నిర్ణీత గడువులోగా ఓటరు నమోదును పూర్తి చేయాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమని పేర్కొన్న కేటీఆర్, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని అన్నారు. అదేవిధంగా, ఎన్నికలు జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల పరిధిలోని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా తమ ఓటు నమోదును వీలైనంత త్వరగా పూర్తి చేసుకోవాలని కేటీఆర్ సూచించారు. పార్టీ శ్రేణులు తమ కుటుంబసభ్యులు, స్నేహితులు మరియు తమ పరిధిలోని అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటరు నమోదుపై అవగాహన కల్పించి, వారు కూడా నిర్ణీత గడువులోగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదు ప్రక్రియను పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని సమన్వయంతో పనిచేయాలని కేటీఆర్ సూచించారు.

# యంగ్ ఇండియా స్కూళ్ల నిర్మాణాలు వేగవంతం

## కచ్చితమైన క్యాలెండర్‌తో పనులు పూర్తి
## డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** ప్రభుత్వం చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అత్యంత ప్రాధాన్యతనిస్తున్న ఈ పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి రాత్రింబవళ్లు శ్రమించి పనుల్లో పురోగతి చూపాలన్నారు. రాష్ట్రంలోని పేద విద్యార్థులకు కులమతాలకు అతీతంగా ఒకే ప్రాంగణంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నాణ్యమైన విద్యను, సకల సౌకర్యాలను అందించడమే ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసి మైనారిటీ వర్గాల పిల్లలందరినీ ఒకే గొడుగు కిందకు చేర్చి సమీకృత పద్ధతిలో అత్యుత్తమ విద్యాబోధన అందించడం ద్వారా విద్యార్థుల్లో సామాజిక సమానత్వం పెంపొందుతుందని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో నిర్మిస్తున్న వీటి భవనాల నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక వర్క్ క్యాలెండర్‌ను రూపొందించాలని సూచించారు. వారానికోసారి జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించి, తనకు క్రమం తప్పకుండా నివేదికలు పంపాలన్నారు. నిర్మాణ పనులను క్షేత్రస్థాయి నుంచి నిరంతరం పర్యవేక్షించేందుకు వీలుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వచ్చే నెల రెండో వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న స్కూళ్లను తనిఖీలు చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఈఎంసీ గణపతిరెడ్డి రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల నిర్మాణ పురోగతి వివరాలనునివేదించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 87 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ పాఠశాలలు మంజూరయ్యాయని, అందులో 70 పాఠశాలల్లో ఇప్పటికే నిర్మాణ పనులు వేగంగా ప్రారంభమయ్యాయని తెలిపారు. మరొక 5 పాఠశాలలకు సంబంధించి డీపీఆర్ తయారు చేస్తున్నామని, 3 పాఠశాలల టెండర్లు ముగింపు దశకు వచ్చాయని, మిగిలిన 4 పాఠశాలలకు సంబంధించి స్థలసమస్యలున్నాయని వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన కాలపరిమితికి అనుగుణంగా పనులన్నీ పూర్తి చేసి, భవనాలను త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఖనిజ శుద్ధి ప్రాజెక్టు

## అంచనా విలువ రూ.5,427 కోట్లు
## కార్యకలాపాలు ప్రారంభించిన ఖనిజాభివృద్ధి సంస్థ

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** ప్రభుత్వ రంగ మైనింగ్ సంస్థ జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎమ్‌డిసి) ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో రూ.5,427 కోట్ల విలువైన సమీకృత ఇనుప ఖనిజ శుద్ధి, స్లర్రీ పైప్‌లైన్, పెల్లెట్ తయారీ ప్రాజెక్టును ప్రారంభించింది. ఈ మేరకు హైదరాబాద్‌లో సోమవారం ఒక ప్రకటనలలో వీటి వివరాలను వెల్లడించింది. ఈ ప్రాజెక్టులో బచేలిలో ఒక కొత్త ఇనుప ఖనిజ శుద్ధి కర్మాగారం, నాగర్నార్‌లో సంవత్సరానికి 15 మిలియన్ టన్నుల స్లర్రీ పైప్‌లైన్, మరో 2 మిలియన్ టన్నుల పెల్లెట్ ప్లాంట్ ఉన్నాయి. బచేలిలో ఇనుప ఖనిజ కార్యకలాపాలను నాగర్నార్‌లోని కంపెనీ ఉక్కు కర్మాగారంతో అనుసంధానించే 135 కిలోమీటర్ల పైప్‌లైన్, బైలాడిలా కార్యకలాపాల నుండి శుద్ధి చేసిన ఇనుప ఖనిజ సాంద్రతను ఎన్‌ఎమ్‌డిసి ఉక్కు కర్మాగారానికి రవాణా చేస్తుంది, ఇది రైలు తరలింపుపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ, రోడ్డు మార్గ రవాణాకు ప్రత్యామ్నాయాన్ని అందిస్తుంది. ఈ సదుపాయాలు బైలాడిలా గనుల నుండి లభించే ఇనుప ఖనిజపు పొడి, బురదను సాంద్రీకరణగా మార్చి, ఉక్కు తయారీ కోసం గుళికలుగా మార్చడానికి ఎన్‌ఎమ్‌డిసికి వీలు కల్పిస్తాయి. ఈ గుళికల కర్మాగారం స్ట్రెయిట్ గ్రేట్ ఇండ్యూరేషన్ సాంకేతికతను ఉపయోగిస్తుంది. ఈ ప్రారంభోత్సవం ఇనుప ఖనిజ విలువ గొలుసు అంతటా ఎన్‌ఎమ్‌డిసి సామర్థ్యాలను బలోపేతం చేస్తుంది. దీని ద్వారా మైనింగ్ మరియు బెనిఫిషియేషన్ నుండి స్లర్రీ రవాణా, పెల్లెట్ ఉత్పత్తి వరకు దాని ఉనికిని విస్తరిస్తుంది. అదే సమయంలో, దాని బైలాడిలా కార్యకలాపాల నుండి ఉత్పత్తి అయ్యే ఇనుప ఖనిజపు ఫైన్‌లు మరియు స్లైమ్‌లను మరింతగా ఉపయోగించుకోవడం ద్వారా, దాని పోర్ట్‌ఫోలియోకు ఒక విలువజోడించిన ఉత్పత్తిని కూడా జోడిస్తుందని ఖనిజాభివృద్ధి సంస్థ వెల్లడించింది.

# పారాక్వాట్ డైక్లోరైడ్ పురుగుమందుపై నిషేధం

## రైతుల భద్రతకు కేంద్రం ప్రాధాన్యత
## రైతు కమిషన్ రాష్ట్ర చైర్మన్ కోదండరెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గెజిట్ ఉత్తర్వుల ప్రకారం పారాక్వాట్ డైక్లోరైడ్ క్రిమిసంహారిక పురుగుల మందుకు కొత్త రిజిస్ట్రేషన్లు ఇవ్వడంపై నిషేధం విధించింది. ఇప్పటికే మంజూరైన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు కూడా రద్దు చేస్తూ వాటిని వెనక్కి తీసుకునేలా రిజిస్ట్రేషన్ కమిటీకి కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సర్టిఫికెట్లను తిరిగి ఇవ్వడంలో ఎవరైనా విఫలమైతే, చట్ట నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. పారాక్వాట్ డైక్లోరైడ్ పై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాన్ని తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి స్వాగతించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో మానవులు, జంతువులకు పారాక్వాట్ డైక్లోరైడ్ వినియోగం ప్రమాదకరమని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రైతుల భద్రత, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చే అంశంగా ఆయన అభివర్ణించారు. రైతుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యత కలిగిందన్నారు. పారాక్వాట్ డైక్లోరైడ్ వంటి ప్రమాదకరమైన కలుపు మందుల విషయంలో రైతులకు అవగాహన కల్పించడం, సురక్షి తమైన ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం అవసరమన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పారాక్వాట్ డైక్లోరైడ్ వినియోగం మానవులు, జంతువులకు ప్రమా దాన్ని కలిగిస్తుందని పేర్కొందని, ఈ నేపథ్యంలో రాష్ట్రాల్లో ఉత ్తర్వుల అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కేంద్రం సూచించిందని తెలిపారు. తెలంగాణ లోనూ కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను సమర్థవంతం గా అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సూచించింది. రాష్ట్రంలో పారాక్వాట్ డైక్లోరైడ్‌కు సంబంధించి ప్రస్తుతం ఉన్న పరిస్థితి, అందుబాటులో ఉన్న నిల్వలు, కేంద్ర ఉత్తర్వుల అమలుకు తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై వ్యవసాయ శాఖ అధికారులు అవసరమైన చర్యలు

# మహిళల సాధికారతే ప్రభుత్వ ధ్యేయం



బాగ్‌లింగంపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం ఎంపి అనిల్‌కుమార్‌యాదవ్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌తో కలిసి ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లతో
## రూ. 5కే నాణ్యమైన భోజనం : మంత్రి పొన్నం

**హైదరాబాద్ (చిక్కడపల్లి), సెప్టెంబరు 28, ప్రభాత వార్త:** సిఎం రేవంత్‌రెడ్డి ఆలోచ నలకు అనుగుణంగా రాష్ట్రంలోని మహిళలను ఆర్థికంగా స్వయంసమృద్ధి సాధించేలా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సోమవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, జిహెచ్ ఎం సి కమీషనర్ ఆర్.వి. కర్ణన్ తో కలిసి ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లను ప్రారంభించారు. అనంతరం స్వయం సహాయక మహిళా సంఘాలకు ఊరటనిస్తూ రూ.1.20 కోట్ల విలువైన సున్నా వడ్డీ రుణాల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత స్కూల్ యూనిఫారాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బాగ్ లింగంపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ నాయక్, జోనల్ కమిషనర్ మంగ తాయారు, డిప్యూటీ కమీషనర్ ప్రవీణ్ రెడ్డి, డీపీవో శ్రీలత, కాంగ్రెస్ నేతలు అంజి యాదవ్, నాగభూ షణం, బబ్లూ, రవి, శ్రీకర్, భూపాల్, బాబా షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ మహిళా సాధికారత, పేదల సంక్షేమానికి సంబం ధించి పలు కీలక విషయాలను వెల్లడించారు. నగరంలో ఉపాధి, ఇతర పనుల నిమిత్తం వచ్చే పేదలు, కార్మికుల ఆకలి తీర్చేందుకు రూ.5 లకే నాణ్యమైన భోజనం అందించేలా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఈ క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక మహిళా సంఘాలకే అప్పగిస్తూ వారికి స్థిరమైన జీవనోపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, గతంలో రూ.5 లక్షలుగా ఉన్న సున్నా వడ్డీ రుణాల పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్లు వెల్లడించారు. అంతేకాకుండా గడచిన మూడేళ్లుగా వీటికి సంబంధించిన వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తోందని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులను కేటాయించి, ఇప్పటివరకు 600 బస్సులకు మహిళలను యజమానులుగా తీర్చిదిద్దామని మంత్రి తెలిపారు. ఇదే విధానాన్ని నగర పరిధిలోనూ విస్తరించేందుకు ఆలోచన చేస్తున్నామని, 100 శాతం రీపేమెంట్ ట్రాక్ రికార్డు ఉన్న అర్హులైన హైదరాబాద్ నగర మహిళా సంఘాల వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బీసీ, మైనారిటీ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అత్యాధునిక సాంకేతికతతో కూడిన కుట్టు మిషన్లను, శిక్షణను అందించనున్నట్లు ప్రకటించారు. అర్హులైన మహిళలు సెప్టెంబరు 30 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# ఎలక్ట్రిక్ మొబిలిటీ ఇండెక్స్‌లో 10వ స్థానంలో తెలంగాణ

## రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహానికి ఆటంకం
## నీతి ఆయోగ్ నివేదికలో వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** ఎలక్ట్రిక్ మొబిలిటీ ఇండెక్స్‌లో తెలంగాణ రెండు ప్లేస్‌లు ఎగబాకి 10వ స్థానానికి చేరుకుంది. 2024లో 46గా ఉన్న రాష్ట్ర స్కోరు 51కి పెరగడంతో, ఇది పెద్ద రాష్ట్రాల విభాగంలో ఫ్రంట్‌రన్నర్ కేటగిరీలో నిలిచింది. అయితే, ఛార్జింగ్ మౌలిక సదుపాయాలలో ఉన్న లోపాలు రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహకానికి ఇప్పటికీ ఆటంకం కలిగిస్తున్నాయని నీతి ఆయోగ్ పేర్కొంది. ఈ మేరకు దీనికి సంబంధించి నీతి ఆయోగ్ సోమవారం విడుదల చేసిన ఇండియా ఎలక్ట్రిక్ మొబిలిటీ ఇండెక్స్ (ఐఇఎమ్ఐ) 2025లో వీటి వివరాలను వెల్లడించింది. ప్రతి లక్ష నమోదిత వాహనాలకు తెలంగాణలో కేవలం 12.6 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ పాయింట్లు మాత్రమే ఉండటంతో, అది రాష్ట్రాలలో 12వ స్థానంలో నిలిచింది. ఈ బలహీనత ఉన్నప్పటికీ, రవాణా విద్యుదీకరణ, ఆవిష్కరణలలో పురోగతిని కనబరుస్తూ, రాష్ట్రం తన మొత్తం ర్యాంకును మెరుగుపరచుకుంది. 17 పెద్ద రాష్ట్రాలలో, తెలంగాణ 50 నుండి 64 మధ్య స్కోరు సాధించి, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, హర్యానా, రాజస్థాన్ మరియు ఉత్తరప్రదేశ్‌లతో పాటు ఏడవ స్థానంలో నిలిచింది. ఢిల్లీ 84 స్కోరుతో అగ్రస్థానంలో నిలవగా, ఆ తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర (78), కర్ణాటక (73) నిలిచాయి. ఈ సూచిక 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను రవాణా విద్యుదీకరణ పురోగతి (50 శాతం వెయిటేజ్), ఛార్జింగ్ మౌలిక సదుపాయాల సంసిద్ధత (30 శాతం), ఈవీ పరిశోధన మరియు ఆవిష్కరణ (20 శాతం) అనే మూడు అంశాల ఆధారంగా అంచనా వేసింది. ఛార్జింగ్ సంసిద్ధతలో కర్ణాటక 97 స్కోరుతో అగ్రస్థానంలో నిలవగా, తెలంగాణలో ఆవిష్కరణల బలం దాని బలహీనమైన ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను సమతుల్యం చేయడానికి సహాయపడింది.

# కొత్త ప్రజాస్వామిక విప్లవ సంస్కృతే ప్రత్యామ్నాయం

## 'ప్రజా కళాజాతర' ముగింపు సభ పిలుపు
## ప్రజా ఉద్యమాలతో ముడిపడిన విమలక్క 50 యేళ్ల సాంస్కృతిక ప్రస్థానం




**హైదరాబాద్ (చిక్కడపల్లి), సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** మనువాద, కార్పొరేట్ దోపిడీలకు వ్యతిరేకంగా, పనిపాటల సాంస్కృతిక ముద్ర కలిగిన నూతన ప్రజాస్వామిక విప్లవ సంస్కృతే సరైన ప్రత్యామ్నాయమని "ప్రజా కళా జాతర" స్పష్టం చేసింది. అరుణోదయ విమలక్క 50 ఏళ్ళ విప్లవ సాంస్కృతికోద్యమ ప్రస్థానం ఆమె ఒక్కరి ప్రయాణం కాదని, విప్లవప్రజాస్వామిక ఉద్యమాలు మరియు అరుణోదయ సమూహాంతో కలిసి సాగిన జంట ప్రయాణమని మూడు రోజుల పాటు సాగిన ప్రజా కళా జాతర వేదిక అభిప్రాయపడింది. సోమవారం బాగ్ లింగంపల్లి ఆర్టీసీ కళాభవన్ లో జరిగిన వేదిక ముగింపు సభ జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. సామ్రాజ్యవాద, కార్పొరేట్ వ్యాపార సంస్కృతిని స్థానిక ప్రజా సంస్కృతులైన పని పాటల ద్వారానే వెనక్కు నెట్టగలమని సభ స్పష్టం చేసింది. మనువాదం భూస్వామ్య దోపిడీకి కవచంగా ఉందంటూ, దేశంలోని పీడిత వర్గాలు, బహుజన సమూహాలు ఏకమై ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాలను చేపట్టాలని పిలుపునిచ్చింది. నూతన తరాన్ని మద్యం, గంజాయి, మూఢనమ్మకాల మత్తు నుండి బయటకు తీసి, శాస్త్రీయ దృక్పథం వైపు మళ్లించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతి నిర్మాణంలో భావసారూప్యత కలిగిన విప్లవప్రజాస్వామిక శక్తులు ఒకతాటిపైకి రావాలని, తెలుగు నేలతో పాటు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ప్రజా కళా జాతరలు విస్తరించాలని వేదిక ఆకాంక్షించింది. ఈ ధిక్కార స్వరాలను ఏకం చేయడంలో అరుణోదయ నాయకత్వ పాత్ర వహించాలని విజ్ఞప్తి చేసింది. దేవుని ముందు సమానత్వం లేని మతాన్ని ప్రశ్నిస్తూ, బహుజన బతుకమ్మను 15 యేళ్లుగా ప్రజాస్వామికలౌకిక పండుగగా మలచడానికి చేస్తున్న కృషిని సభ కొనియాడింది. అంటరానితనం, కుల వివక్ష మరియు బ్రాహ్మణీయ సంస్కృతిని ఎదిరించడానికి కోట్ల గొంతులు పదునెక్కాలని పిలుపునిచ్చింది.

విమలక్కతోపాటు ప్రజా కవులు, కళాకారులు, తెలంగాణ ఉద్యమకారులపై నమోదైన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలి. విప్లవ కవి వరవరరావుపై ఉన్న అన్ని ఆంక్షలు, కేసులను బేషరతుగా తొలగించాలి. రాష్ట్రంలో అంతరించిపోతున్న ప్రజా కళలను, కళాకారులను ఆదుకోవడానికి "జానపద యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి. వృత్తి కళాకారులకు గౌరవ వేతనంతో కూడిన పెన్షన్లు ఇవ్వాలి. సాంస్కృతిక సారథి కళాకారులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పౌరస్వేచ్ఛలు కల్పించాలి. ఆదివాసీ ప్రాంతా ల్లో స్వయం పాలిత రాష్ట్రాలను/ప్రాంతాలను ఏర్పరచాలి. ఉచిత విద్య, వైద్యం, పర్యావరణం, సహజ వ్యవసాయాన్ని రక్షించుకుంటూ రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలి. ఈ జాతర విజయం కోసం కృషి చేసిన వారికి, మూడుపూటలా ఆహారం అందించి ఆదరించిన సోదర, సోదరీ మణులకు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

# ఆయిల్‌ఫెడ్ భూముల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం




ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఆయిల్‌ఫెడ్ భూములను కాపాడాలంటూ రైతులతో కలిసి ప్రజా సంఘాలు, బిఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతున్న దృశ్యం.

## ప్రభుత్వ నిర్ణయం వెంటనే ఉపసంహరించుకోవాలని
## రైతులు, ప్రజా సంఘాల డిమాండ్
## హైదరాబాద్‌లో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని భూమిని
## రైతులతో కలిసి పరిశీలించిన రాజకీయ పార్టీ నేతలు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని విజయ ఆయిల్‌ఫెడ్‌కు చెందిన విలువైన భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిం చేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని ఆయిల్ ఫామ్ రైతులు, ప్రజా సంఘాలు, బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఆయిల్‌ఫెడ్ భూములను రైతులతో కలిసి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ రామకృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాల్సిన ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం సరికాదన్నారు. ఆయిల్‌ఫెడ్‌కు చెందిన విలువైన భూములను ప్రైవేటీకరించేలా జారీ చేసిన జీవోను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయిల్‌ఫెడ్ సంస్థకు చెందిన భూములను తిరిగి సంస్థకే కేటా యించి, ఆస్తులను పరిరక్షి ంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఆయిల్ ఫెడ్ భూములకు ఎంతో విలువ ఉందని, వాటిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం వల్ల ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలు, ప్ర భుత్వ రంగ సంస్థల ఆస్తుల పరి రక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తన నిర్ణయా న్ని పునః పరిశీలిం చాలని కోరారు. ఆయిల్‌ఫెడ్ భూములను ప్రైవేటీకరించే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములను కాపాడుకునేందుకు అవసరమైతే ప్రజలు, రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని తెలిపారు. ప్రైవేటీకరణకు సంబంధించిన జీవోను పూర్తిగా రద్దు చేసి, భూములను ఆయిల్‌ఫెడ్‌కు తిరిగి కేటాయించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆయిల్‌ఫెడ్ ఆస్తుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు పిలుపునిచ్చారు. ఆయిల్ ఫెడ్‌కు చెందిన విలువైన భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సుమారు 16,000 చదరపు గజాల అత్యంత విలువైన స్థలాన్ని కేవలం ..87 కోట్లకే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పగించేందుకు ప్రభుత్వం పూనుకోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 88 వేల మంది రైతులు దాదాపు 3.5 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నారని గుర్తుచేశారు. ప్రజలు, రైతులు చేపట్టిన పోరాటాలకు తలొగ్గి, గతంలో ప్రైవేటు వ్యక్తులకు భూములు కేటాయిస్తూ ఇచ్చిన జీవో ను ప్రభుత్వం తాత్కాలికంగా మాత్రమే నిలిపివేసిందని విమర్శించారు. తాత్కాలికంగా ఆపినప్పటికీ, లోపాయికారీగా ప్రైవేటీకరణ కుట్రలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఆ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే జీవోను పూర్తిగా రద్దు చేసి, ఆ భూమిని అధికారికంగా ఆయిల్ ఫెడ్‌కే కేటాయిస్తూ కొత్త జీవో ఇచ్చేంత వరకు పామాయిల్ రైతులు, ప్రజల భాగస్వామ్యంతో పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. జంగారెడ్డి, కోశాధికారి మూడ్ శోభన్, సహాయ కార్యదర్శి ఉడుత రవీందర్, పామాయిల్ రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరెడ్డి, కార్యదర్శి కొక్కొరపాటి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సౌధలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల మహాధర్నా

## పదోన్నతుల్లో మెరిట్ కమ్ రోస్టర్ విధానానికి డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** పదోన్నతుల్లో జరుగుతున్న అన్యాయాలను అరికట్టాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఖైరతాబాద్ లోని విద్యుత్‌సౌధలో సోమవారం మహా ధర్నాను నిర్వహించారు. రాష్ట్రంలో నలుమూలల నుంచి సుమారు 1000 మంది ఉద్యోగులు నిరసన సభలో పాల్గొని అన్యాయాలను సరిచేయాలని ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘంఅధ్యక్షుడు డి.శ్యామ్ మనోహర్, సెక్రెటరీ జనరల్ రమేష్ మేడి, కార్యనిర్వాహక అధ్యక్షుడు కొమ్ము చంద్రయ్య తదితరులు హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎండీ ప్రభాకర్ రావు తీసుకొచ్చిన జీవోతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ఒక్క ఉద్యోగికి అన్యాయం జరగకుండా పాత విధానాన్నే అమలు చేయాలని ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నామని ఈ సమస్య ను అప్పటి పిసిసి రేవంత్ రెడ్డి, బట్టి విక్రమార్కులకు సైతం విన్నవించినట్లు తెలిపారు. అయితే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో కొచ్చినా తమ సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడం విచారకరమని అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కలు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలను సరి చెయ్యాలని కోరారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి న్యాయబద్ధంగా పదోన్నతులు, అవకాశాలు రావాలన్నదే మా ఆకాంక్ష అని తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే శాంతియుత పద్ధతిలో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఎక్సైజ్ శాఖకు ఆయుధాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు

**హైదరాబాద్,సెప్టెంబరు28,ప్రభాతవార్త:** ఎక్సైజ్ శాఖకు ఆయుధాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. సోమవారం క్యూర్ పరిధిలోని ఎక్సైజ్ అధికారులతో ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ సమీక్షించారు. ఎక్సైజ్ అధికారులకు ఎన్ని ఆయుధాలు ఇవ్వాలనే దానిపై అభిప్రాయాలు సేకరించారు. ప్రభుత్వం అనుమతిస్తే పోలీసుశాఖ సమన్వయంతో వెపన్స్ వినియోగించాలని, ఎన్‌డీపీఎస్ డ్రగ్స్, నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై నిఘా పెంచాలని ఆదేశించారు. డ్రగ్స్, అక్రమ మద్యం నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. బార్లు, మద్యం షాపుల ఎక్సైజ్ రెంటల్ ఫీజ్‌ను త్వరగా వసూలు చేయాలని ఆదేశించారు. కొత్త బార్లకు దరఖాస్తులు చేసేవారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. దరఖాస్తుదారులకు ఎక్సైజ్ అధికారులు తగిన గైడెన్స్ ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు.

## డిప్యూటీ సీఎం భట్టి ఛాంబర్ వద్ద రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్టర్ల ఆందోళన

**హైదరాబాద్,సెప్టెంబరు28,ప్రభాతవార్త:** రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఛాంబర్ వద్ద రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు ఒక్కసారిగా ఆందోళనకు దిగారు. ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన పెండింగ్ బకాయిలు, బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వారు సోమవారం మధ్యాహ్నం నాలుగు గంటల ప్రాంతంలో నిరసన తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లులు విడుదల కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను,ఆర్థిక శాఖ కార్యదర్శిని సందీప్‌కుమార్ సుల్తానియాను కలవడానికి అధికారులు అనుమతించడం లేదని వారు మండిపడ్డారు. వెంటనే డిప్యూటీ సీఎం అపాయింట్‌మెంట్ ఇప్పించాలంటూ భట్టి ఛాంబర్ వైపు వారు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది, పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తీవ్ర నెట్టివేత, వాగ్వాదం చోటుచేసుకుంది. ఏళ్ల తరబడి సర్వీస్ చేసి రిటైర్ అయినప్పటికీ తమకు రావాల్సిన బెనిఫిట్స్, బిల్లులను ప్రభుత్వం చెల్లించకపోవడం దారుణమని రిటైర్డ్ ఉద్యోగులు వాపోయారు. అలాగే పనులు పూర్తి చేసిన తమకు బిల్లులు రాక ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నామని కాంట్రాక్టర్లు సైతం ఆవేదన వ్యక్తం చేశారు. తమ పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అయితే, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు సుమారుగా రూ.7 వేల కోట్ల వరకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని తెలిసింది. ఇక, చిన్న కాంట్రాక్టర్‌లకు మరో రూ. 8వేల కోట్ల పెండింగ్ బకాయిలను చెల్లించాల్సి ఉందని, మొత్తంగా ప్రభుత్వం కాంట్రాక్టర్‌లకు, ఉద్యోగులకు, రిటైర్డ్ ఎంప్లాయిస్‌లకు కలిపి సుమారుగా రూ.45 వేల కోట్ల వరకు పెండింగ్ బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నట్టుగా సమాచారం.

## హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం మనదే

### కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని కాంగ్రెస్‌పై యువతరం రగిలిపోతోంది

### మూడు జిల్లాల నేతలతో తెలంగాణభవన్‌లో కెటిఆర్ కీలక సమావేశం

**హైదరాబాద్,సెప్టెంబరు28,ప్రభాతవార్త:** రాష్ట్రంలో త్వరలో జరగనున్న హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్ నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. త్వరలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సోమవారం హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ నేతలతో కేటీఆర్ తెలంగాణ భవన్‌లో జిల్లాల వారీగా సమావేశమయ్యారు. గతంలో ఈ స్థానం నుంచి పార్టీ తరపున మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమార్తె వాణి దేవిని నిలబెట్టి అపూర్వ విజయాన్ని సొంతం చేసుకున్నామని కేటీఆర్ గుర్తుచేశారు. పార్టీ నేతలంతా ప్రణాళికాబద్ధంగా సమిష్టిగా పనిచేయడం వల్లే ఆరోజు గెలుపు సాధ్యమైందని తెలిపారు. ఈసారి కూడా అదే స్ఫూర్తిని కొనసాగించాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. సిట్టింగ్ స్థానాన్ని గెలుచుకునేందుకు బిఆర్ఎస్ పార్టీకి అన్నిరకాల అనుకూల వాతావరణం ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు. ఓటర్ నమోదు ప్రక్రియ కూడా ప్రారంభమైన నేపథ్యంలో ఇప్పటి నుంచే పార్టీ నేతలంతా ఈ ఆయా జిల్లాల పరిధిలోని గ్రాడ్యుయేట్‌లు తమ ఓట్లను నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటరు నమోదును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పార్టీ నేతలు తమ కుటుంబ సభ్యులతోపాటు అర్హులైన ప్రతి ఒక్క పట్టభద్రుడితో ఓటు నమోదయ్యేలా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. దేశవ్యాప్తంగా బీజేపీ గ్రాఫ్ వేగంగా తగ్గుతోందని, యువత ఆ పార్టీకి దూరమైందనే ఆందోళన బీజేపీ అగ్రనేతలను కూడా వెంటాడుతోందని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పట్ల ప్రజల్లో వ్యతిరేకత తారస్థాయికి చేరిందని తెలిపారు. రెండు ఢిల్లీ పార్టీలపై ప్రజాక్షేత్రంలో యువతరం రగిలిపోతోందని, వారిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్న తరుణంలో బిఆర్ఎస్ పార్టీ రెండుకు రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలు గెలిచే అవకాశం స్పష్టంగా కనిపిస్తోందని వెల్లడించారు. ఓవైపు ప్రభుత్వ ఉద్యోగులు రేవంత్ సర్కారు చేసిన మోసంపై మండిపడుతున్నారని, మరోవైపు నిరుద్యోగులు పీకలదాకా కోపంతో ఉన్నారని కేటీఆర్ అన్నారు. ఇటీవలే వెయ్యి రోజులు పూర్తిచేసుకున్న ఈ దద్దమ్మ ప్రభుత్వంపై విద్యావంతులు దుమ్మెత్తిపోస్తు న్నారని చెప్పారు. రెండు రోజుల క్రితం వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల నేతలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలోనూ అక్కడి ఎమ్మెల్సీ స్థానంలో పార్టీ గెలుపుపై నేతలు ధీమా వ్యక్తంచేశారని కేటీఆర్ వెల్లడించారు. పార్టీ తరఫున ఎవరు పోటీ చేసినా పక్కా ప్రణాళికతో ఓటర్ ఎన్‌రోల్‌మెంట్‌ను సమర్థంగా చేపట్టి పార్టీ గెలుపు కోసం ప్రతిఒక్కరు కలిసికట్టుగా పనిచేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## అక్టోబరు 1న జరగాల్సిన కెఆర్ఎంబి సమావేశం వాయిదా కోరిన ప్రభుత్వం

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** అక్టోబర్ 1న జరగాల్సిన కేఆర్ఎంబీ సమావేశం వాయిదా వేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అక్టోబర్ 1న మంత్రివర్గ సమావేశం ఉన్నందున వాయిదా కోరింది. ఈ మేరకు కేఆర్ఎంబీ ఛైర్మన్‌కు రాష్ట్ర ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్‌బాబు సోమవారం లేఖ రాశారు.

## ఉప్పొంగిన గోదావరి

### నీట మునిగిన పంటలు

### ముంపులో వరి, పత్తి, మిరప చేలు

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** ఎగువ రాష్ట్రాల నుంచి వరద ప్రవాహం ఉధృతంగా ప్రవహించడంతో గోదావరి ఉప్పొంగడంతో దాని పరీవాహక ప్రాంతాల్లో వివిధ పంటలు ముంపునకు గురయ్యాయి. ప్రధానంగా పత్తి, మిరప, వరి తదితర పంటలు నీట మునిగాయి. గోదారి పరీవాహకంలోని ములుగు, మంచిర్యాల, నిజామాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి తదితర జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వరద ప్రవాహం పంటలపై పడింది. ములుగు జిల్లా వాజేడు మండలంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ జిల్లాలో దాదాపు 20 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న మిరప, తదితర తోటలు నీట మునగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఒక్క మిరప పంట సుమారు 1,800 ఎకరాల్లో దెబ్బతిన్నదని రైతులు తెలిపారు. సెప్టెంబర్‌లో ఇంతటి వరదను తాము ఎన్నడూ చూడలేదని స్థానికులు చెప్పారు. పొంగి ప్రవహిస్తున్న గోదావరి కారణంగా జాతీయ రహదారి 163పై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చికుపల్లి వాగు వంతెనకు ఇంకా మరమ్మతులు జరగకపోవడంతో పరిస్థితి మరింత దిగజారింది. గత రెండు రోజులుగా, సమీప గ్రామాల ప్రజలు అత్యవసర ప్రయాణాల కోసం పడవలపై ఆధారపడుతున్నారు.

# కేంద్రం నుండి రూ.లక్ష కోట్ల టార్గెట్

### మరో రూ. లక్ష కోట్ల బడ్జెటేతర రుణాలు

### ఇప్పటికే తీవ్ర ఒత్తిడిలో రాష్ట్ర ఖజానా

### ప్రత్యేక ప్రణాళికను రూపొందించిన సర్కార్

### 2026-27లో నిధులు, రుణాలు, గ్రాంట్లపై దృష్టి

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉండటంతో పాటు, ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వివిధ ప్రాజెక్టులు, పథకాలు, ఇప్పటికే అమలు చేస్తున్న కార్యక్రమాలకు నిధులు తప్పనిసరి కావడంతో వాటి సమీకరణపై రాష్ట్ర సర్కార్ దృష్టి సారించింది. ఇందులో భాగంగా కేంద్రం నుండి భారీగా నిధులు, గ్రాంట్లు, అధిక రుణాలు సేకరించాలనే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందు కెళుతోంది. ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లు, నిధులు, విస్తృత రుణాలపై భారీగా ఆధారపడుతోంది. రాష్ట్రంలో వివిధ అభివృద్ధి పనుల కోసం కేంద్రం నుండి భారీగా రూ.1 లక్షల కోట్లు కోరుతోంది. దీంతో పాటు, బడ్జెటేతర రుణాలతో సహా రూ.1 లక్ష కోట్లకు పైగా సమీకరించేలా ప్రణాళికను రూపొందించింది. ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం నిర్దేశించిన రాష్ట్ర వార్షిక రుణ పరిమితి రూ.58,458.71 కోట్లుగా ఉంది. అయితే ఈ ఆర్థికంలో 6 నెలలు పూర్తి కాకుండానే రూ.46,400 కోట్ల రుణాన్ని సేకరించడంతో మిగిలిన 6 నెలల కాలానికి కేవలం దాదాపు రూ.12 వేల కోట్లు మేర తీసుకునే అవకాశం మాత్రమే ఉంటుందని అధికవర్గాలు వెల్లడిస్తున్నాయి. ఆర్థిక శాఖ అధికారిక వర్గాల సమాచారం ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలల్లో మొత్తం రెవెన్యూ రాబడులను రూ.2,41,263.59 కోట్లుగా అంచనా వేశారు. కానీ ఆగస్టు నాటికి 32.14 శాతం మేర రూ.77,535.89 కోట్లు మాత్రమే సమకూరాయి. రాబడులు రూ. 1,11,840.55 కోట్లు కాగా, వ్యయం రూ.1,04,789.23 కోట్లుగా నమోదైంది. అయితే అసలు ఒత్తిడి రెవెన్యూ ఖాతాలో కనిపిస్తున్నది. అక్కడ ఆదాయం రూ.77,535.89 కోట్లు ఉండగా, ఖర్చు రూ.92,376.70 కోట్లకు చేరింది. ఈ పరిస్థితుల్లో నిధులను అధిగమించేందుకు కేంద్రంపైనే ఆశలు పెట్టుకుంది. ఆర్థిక లోటును పూడ్చుడానికి, ఖర్చులను కొనసాగించడానికి భారీగా గ్రాంట్లు, మౌలిక సదుపాయాల కేటాయింపులు, వడ్డీ లేని రుణాలు, ప్రాజెక్టుల ఆమోదం కోసం కోరుతోంది. ప్రధాన డిమాండ్లలో 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలను గ్రాంట్లుగా మార్చడం, కేంద్ర సహాయాన్ని రెట్టింపు చేయడం, విద్య, ఆరోగ్య రంగాల ఖర్చులను ఎఫ్ఆర్‌బిఎం పరిమితుల నుండి మినహాయించడం, రాష్ట్రాల కోసం ఆర్థిక లోటు పరిమితిని 4 శాతానికి పెంచడం వంటివి ఉన్నాయి. అలాగే హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2, రీజినల్ రింగ్ రోడ్, నాలుగు జిల్లాల్లో కొత్త విమానాశ్రయాలు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా, మూసీ నది అభివృద్ధి, రేడియల్ రోడ్లు,నగర మురుగునీటి వ్యవస్థ విస్తరణ కోసం భారీ ప్రాజెక్టుల మంజూరుకు కూడా ప్రభుత్వం ఒత్తిడి చేస్తోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా, వీటన్నింటికీ కేంద్రం నుండి గణనీయమైన భాగస్వామ్యం అవసరమని భావిస్తున్న ప్రభుత్వం వివిధ ప్రాజెక్టుల కోసం దాదాపు రూ.లక్ష కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రతిపాదించింది. దీనితో పాటు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, ఇతర ఆరోగ్య మౌలిక సదుపాయాల కోసం సుమారు రూ.33 వేల కోట్ల రుణం తీసుకోవడానికి ఆమోదం కోరింది. ఈ రుణాలను సుమారు రూ.70 వేల కోట్ల మార్కెట్ రుణాలకు అదనంగా, ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ పరిమితికి వెలుపల కోరినట్లు ఆర్థిక శాఖలోని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. అంతేకాకుండా అదనంగా, కేంద్ర పన్నులలో వాటా పెంచేలా వత్తిడి తెస్తోంది. ఆర్థిక సంఘం 41 శాతం పన్నుల పంపిణీని సిఫార్సు చేసినప్పటికీ, సెస్సులు, సర్‌ఛార్జీల కారణంగా వాస్తవ రాబడి సుమారు 30 శాతానికి తగ్గిపోయింది.

## రేపు సిరిసిల్లకు తొలిసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### రూ.345.78 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

### నేతన్నలు, మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి

### భారీ బహిరంగసభలో ప్రసంగించనున్న సిఎం



**హైదరాబాద్,సెప్టెంబరు28,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి హోదాలో ఎ. రేవంత్ రెడ్డి తొలిసారిగా ఈ నెల 30న సిరిసిల్ల పట్టణంలో పర్యటించనున్నారు. ప్రతిపక్ష నేతగా మూడుసార్లు సిరిసిల్ల గడ్డపై అడుగుపెట్టిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ నెల 30న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి రానున్న ముఖ్యమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. సిరిసిల్ల రగుడు బైపాస్ సమీపంలో బహిరంగ సభ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ పర్యటనలో రూ.345.78 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం చేయనున్నారు. వస్త్ర ఉత్పత్తి నిలయంగా పేరొందిన సిరిసిల్లలో నేతన్నల సంక్షేమం, అభివృద్ధి, మహిళల సాధికారతతో పాటు విద్య, మౌలిక వసతుల అభివృద్ధి పనులకు సీఎం ఈ సందర్భంగా శ్రీకారం చుట్టనున్నారు. చేనేత, పవర్‌లూమ్ వస్త్ర ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు ఈ నేతన్న బజార్ ఉపయోగపడనుంది. ప్రధానంగా సిరిసిల్లలో సాంచాలపై ఉత్పత్తి చేసే పెట్టికోట్, పాలియెస్టర్ వస్త్రాల మార్కెటింగ్‌కు వీలుగా ఈ నేతన్న బజార్‌ను ఏర్పాటు చేయాలని సిఎం ఇప్పటికే అధికారులను ఆదేశించారు. సిరిసిల్లతో పాటు వేములవాడలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. పెద్దూరులో 18 ఎకరాల్లో ప్రతిపాదించిన ఈ విద్యా సముదాయంలో 5వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సుమారు 2,600 మంది విద్యార్థులకు వసతి కల్పించేలా 64 తరగతి గదులు, డార్మిటరీలు, డైనింగ్ బ్లాక్, క్రీడా మైదానాలు తదితర సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. సిరిసిల్ల, కోనరావుపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తారు. ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు తరగతి గదులు, ల్యాబ్‌లు, డైనింగ్ హాళ్లు, క్రీడా సదుపాయాలు, ఐటీ మౌలిక వసతులతో వీటిని అభివృద్ధి చేయనున్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా రూ.99.40 కోట్ల పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మండపాలు, గోపురాలు, ప్రాకారాలు, సైట్ డెవలప్‌మెంట్, నీటి సరఫరా–మురుగునీటి వ్యవస్థ, విద్యుత్ పనులు, షాపింగ్ కాంప్లెక్సులు, ఉత్తర వైపు సీసీ రోడ్డు సహా 26 పనులు ఇందులో ఉన్నాయి. జిల్లాలో పరిపాలనా మౌలిక వసతుల విస్తరణలో భాగంగా ఏడు కొత్త ప్రభుత్వ కార్యాలయ భవనాలు నిర్మించనున్నారు. సిరిసిల్ల, వేములవాడలో రెండు ఆర్డీవో కార్యాలయాలు, తంగళ్లపల్లి, వీర్నపల్లి, వేములవాడ రూరల్, రుద్రంగిలో నాలుగు తహసీల్దార్ కార్యాలయాలు, వేములవాడలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.రుద్రంగిలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థంతో గోదాములు, అనుబంధ యూనిట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు ఈ గోదాములు ఉపయోగపడనున్నాయి. సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దూరులో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సమావేశాలు, శిక్షణ, జీవనోపాధి కార్యక్రమాలతో పాటు మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయానికి ఈ భవనం వేదిక కానుంది.

సిరిసిల్లలో కొత్త నేతన్న బజార్ ఏర్పాటు కూడా పర్యటనలో కీలక అంశంగా ఉండనుంది. చేనేత, పవర్‌లూమ్ వస్త్ర ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు దీన్ని ప్రతిపాదించారు. దీనికి అవసరమైన మౌలిక వసతులు, ఆర్థిక సహాయం కోసం చేనేత–జౌళి శాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపారు. ఈ పనికి ఇంకా తుది మంజూరు, వ్యయం ఖరారు కాలేదు. వేములవాడలో మహిళా పోలీస్ స్టేషన్, వేములవాడ–సిరిసిల్లలో రెండు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు.

## 2 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్

### గెలల సేకరణలో తప్పు చేస్తే చర్యలు

### ఉద్యాన శాఖలో ఖాళీల భర్తీ

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిర్ధారించిన 2 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు విస్తరణను మరింత వేగవంతం చేయాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లో సోమవారం ఆయిల్ ఫెడ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం అందించడంతో పాటు, ఆయిల్‌పామ్ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రైతుకు ఆయిల్‌పామ్ మొక్క అందించడం మొదలుకొని, పంట చేతికి వచ్చే వరకు, గెలల సేకరణ వరకు రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటికే 17.50 లక్షల ఆయిల్ పామ్ మొక్కలు పంపిణీ చేసినట్టు వివరించారు. అదేవిధంగా రాష్ట్రంలోని ప్రాసెసింగ్ మిల్లులు పూర్తిస్థాయి సామార్థంతో నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

నిర్మాణంలో ఉన్న 6 ఆయిల్ పామ్ మిల్లుల పనులు పూర్తిచేసి, వచ్చే ఏడాది అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న డ్రిప్ దరఖాస్తులన్నింటినీ వెంటనే పరిష్కరించి, అర్హత కలిగిన రైతులకు త్వరితగతిన అందించాలని చెప్పారు. పనితీరు బాగాలేని ఆయిల్‌పామ్ కంపెనీలకు కేటాయించిన జిల్లాలను రద్దు చేసి, ఇతర వాటికి కేటాయించాలన్నారు. రైతుల నుంచి గెలల సేకరణలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకున్నా వాటిని తీవ్రంగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. వీటి అవకతవకలపై ప్రతి సేకరణ కేంద్రాల్లో సమగ్ర ఆడిట్ నిర్వహించాలని పేర్కొన్నారు. ఉద్యానశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను కూడా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

## ఎల్‌నినో నేపథ్యంలో పొదుపుగా ప్రతి యూనిట్ విద్యుత్

### సమర్థ వినియోగంపై దృష్టి.. పూర్తిస్థాయిలో ఉత్పత్తి యూనిట్లు

### ఉత్పత్తి, వినియోగం, అమ్మకం వివరాలపై వారంలో నివేదిక

### కరెంటు వాడకంపై రాష్ట్రాలకు కేంద్రం కీలక ఆదేశాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** ఎల్‌నినో నేపథ్యంలో విద్యుత్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రతీ యూనిట్‌ను పొదుపుగా వినియోగించాలని కేంద్రం స్పష్టం చేసింది. బొగ్గు కొరత, జల విద్యుత్‌కు నీటి సమస్య వంటి కారణాలతో ఒక్క యూనిట్ విద్యుత్‌ను కూడా సమర్థవంతంగా ఉపయోగించాలని స్పష్టం చేసింది. ఈ కీలక నిబంధనలు అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు అమల్లో ఉంటాయని తెలిపింది. దేశంలో విద్యు రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ సోమవారం రాష్ట్రాలకు ఒక ముఖ్యమైన ఆదేశాలు జారీ చేసింది. రాబోయే రోజుల్లో కరెంట్ కొరత వంటి సమస్యలు తలెత్తకుండా ఉండటానికి, దేశంలో అందుబాటులో ఉన్న ప్రతీ విద్యుత్ యూనిట్‌ను వీలైనంత సమర్థవంతంగా వాడుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ఈ నూతన ఆదేశాల ప్రకారం 50 మెగావాట్లు అంతకంటే ఎక్కువ ఉత్పత్తి సామర్థ్యం ఉన్న బొగ్గు ఆధారిత క్యాప్టివ్ పవర్ ప్లాంట్లు తమ పూర్తి సామర్థ్యం మేరకు విద్యుత్‌ను ఉత్పత్తి చేయాల్సి ఉంటుందని తెలిపింది. ప్లాంట్లు తమ సొంత పరిశ్రమల వినియోగానికి పోను మిగిలిన అదనపు విద్యుత్‌ను పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా బహిరంగ మార్కెట్లో విక్రయించాలని స్పష్టం చేసింది. అలాగే విద్యుత్ ఉత్పత్తికి ఎక్కడా ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు ప్రతీ ప్లాంట్ తమ వద్ద తగినంత బొగ్గు నిల్వలను ముందే సిద్ధం చేసుకోవాలని సూచించింది. వీటితో పాటు, తమ ప్లాంట్లలో జరుగుతున్న ఉత్పత్తి, సొంత వాడకం, మార్కెట్లో అమ్మకాలు, మిగిలి ఉన్న సామర్థ్యం, బొగ్గు నిల్వల వివరాలను ప్రతి వారం కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థకి నివేదిక రూపంలో సమర్పించాల్సి ఉంటుంది. గ్రిడ్‌లో ఎప్పుడూ తగినంత విద్యుత్ లభ్యత ఉండేలా చూసి, సాధారణ వినియోగదారులకు, పరిశ్రమలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడడమే ఈ నిర్ణయాల ముఖ్య ఉద్దేశమని రాష్ట్రాలకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ తెలిపింది.

## ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ‘ఫోరం ఫర్ కాన్‌స్టిట్యూషనల్ డెమొక్రసి’

### ఒకే వేదికపైకి వచ్చిన వివిధ రంగాల ప్రముఖులు

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 28, ప్రభాతవార్త:** దేశంలో రాజకీయ విలువలు, ప్రజాస్వామ్య వ్యవస్థలు, రాజకీయ విలువలే పరిరక్షణే ధ్యేయంగా ప్రముఖ విద్యావేత్తలు, విశ్రాంత అధికారులు, న్యాయకోవిధులతో కూడిన ‘ఫోరం ఫర్ కాని స్టిట్యూషనల్ డెమోక్రసీ’ అనే వేదిక సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అధికారికంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత వహించగా ప్రముఖ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తిని ఫోరం కన్వీనర్‌గా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ విభిన్న రంగాలకు చెందిన ప్రముఖులు, నిపుణులు, మేధావులు, విశ్రాంత న్యాయమూర్తులు, ఐఎఎస్ అధికారులు, డాక్టర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఒకే వేదిక పైకి రావడం దేశంలో తొలిసారిగా హైదరాబాద్ మహానగరంలో సాధ్యమైందన్నారు. దేశంలో రాజ్యాంగ సంస్థల అస్తిత్వం, ప్రశ్నార్థకంగా మారుతున్న ఈ తరుణంలో రాజ్యాంగబద్ద పాలన కోసం పౌరసమాజం గొంతు విప్పాల్సిన అవసరం వచ్చిందన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం విశ్వవిద్యాలయాల స్వేచ్ఛ, ఎన్నికల సంఘం, న్యాయ వ్యవస్థ వంటి రాజ్యాంగబద్దమైన స్వతంత్ర సంస్థలు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో పౌర సమాజం మౌనంగా ఉంటే రాబోయే తరాలకు తీరని అన్యాయాలు చేసినట్లవుతుందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి పౌరులంతా గొంతు విప్పాల్సిన అవసరం ఉందని ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ జి.హరగోపాల్ చెప్పారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, విశ్రాంత ఐఎఎస్ అధికారి ఎంవి రెడ్డి, సీనియర్ న్యాయవాది జ్యోతికిరణ్, సామాజివేత్త గోపాల్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ విరాహత్ అలీ, బత్తిని దీప్తి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర సచివాలయం నిరసనల అడ్డాగా మారడం సిగ్గుచేటు: మాజీ మంత్రి హరీశ్‌రావు


**హైదరాబాద్,సెప్టెంబరు28,ప్రభాతవార్త:** పరిపాలనకు కేంద్రంగా ఉండాల్సిన రాష్ట్ర సచివాలయం.. కాంగ్రెస్ పాలనలో నిరసనల అడ్డాగా మారడం సిగ్గుచేటు అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు సచివాలయం వేదికగా ఆందోళనకు దిగాల్సిన దుస్థితి రావడం సిఎం రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తలదించుకోవాల్సిన విషయం అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏళ్ల తరబడి బిల్లులు పెండింగ్‌లో పెట్టి.. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోకుండా.. ఇంకెంత కాలం తప్పించుకు తిరుగుతారు..? అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ.. చిన్న కాంట్రాక్టర్లు, రిటైర్డ్ ఉద్యోగుల బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడం దారుణం అని మండిపడ్డారు. పెండింగ్ బిల్లుల మంజూరు కోసం 20 నుంచి 30 శాతం కమిషన్ డిమాండ్ చేస్తున్నారంటూ గతంలో సచివాలయంలో ఆర్థిక మంత్రి చాంబర్ ముందు ఆందోళనకు దిగారని గుర్తు చేశారు. కమీషన్లు ఇవ్వలేదనే కారణంతోనే వారి బిల్లులు ఆపుతున్నారా..? అని నిలదీశారు. రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు విడుదల చేస్తామని మే నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ నీటి మూటలేనా..? అని ప్రశ్నించారు. మాటలు కోటలు, దాటితే చేతలు గడప దాటవు అనడానికి ఇంతకంటే నిదర్శనమేం కావాలని విమర్శించారు.


### అలిపిరి వద్ద రూ.500 కోట్లతో

# భారీ టౌన్‌షిప్!

- శ్రీవారి భక్తులకు అక్కడ నుండే సకల సేవలు
- పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ లక్ష్యం
- ఎలక్ట్రిక్ వాహనాలకే ఇక నుంచి కొండపైకి అనుమతి
- తిరుమల విజన్ 2047 అమలులో భాగంగానే నిర్ణయం
- టిటిడికి ప్రభుత్వం అనుమతి.. త్వరలో పనులకు శ్రీకారం

**తిరుమల, సెప్టెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల విజన్ 2047 అమలులో భాగంగా తిరుమల క్షేత్రాన్ని పర్యావరణం పరిరక్షణతోబాటు కాలుష్య నియంత్రణలో భాగంగా పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాలకు బ్రేకప్ ఇవ్వాలనే ఆలోచనతో టిటిడి అడుగులేస్తోంది. ఇందుకు రవాణాశాఖ, పోలీస్‌శాఖ సహకారం తీసుకుని పూర్తిగా విద్యుత్‌తో నడిచే వాహనాలను తిరుమలకు అనుమతించాలనే చర్చ మొదలైంది. దీనివల్ల తిరుమల ఘాట్‌రోడ్లపై కాలుష్య శాతాన్ని భారీగా తగ్గించవచ్చనేది ఆలోచన. ఇందుకు అలిపిరి వద్ద సుమారు రూ.500 కోట్ల వ్యయంతో అన్ని సౌకర్యాలతో భారీ టౌన్‌షిప్ నిర్మాణంచేసే దిశగా రూపొందించిన ప్రణాళికలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనుమతినిచ్చిన విషయం విదితమే. తిరుమలను నో హారన్ జోన్‌గా తీర్చిదిద్దడంతోబాటు శబ్ద కాలుష్యాన్ని 80 శాతం తగ్గించేందుకు ప్రణాళికలు రూపొందించారు. సుమారు 150 ఎకరాల్లో నిర్మించే ఈ టౌన్‌షిప్‌లో అలిపిరి వద్దే వసతి, పార్కింగ్, భోజన సౌకర్యాలు, పూజా సామగ్రి వంటి అన్ని సదుపాయాలు కల్పిం చనున్నారు. భక్తులకు దర్శనాలను మరింత ప్రశాంతంగా, ఆధ్యాత్మికంగా మార్చేందుకు చూస్తున్నారు. అలిపిరి వద్ద టౌన్‌షిప్ ఏర్పాటైతే అక్కడే భక్తులకు వసతి సౌకర్యంతో బాటు దర్శన టిక్కెట్లు, టోకెన్లు జారీచేసే కౌంటర్ల ఏర్పాటుకు నిర్ణయించారు. తిరుపతి అలిపిరిలో బేస్‌క్యాంపు ఏర్పాటు చేయడం వల్ల వసతి, దర్శన కౌంటర్లు అందుబాటులోకి తీసుకువస్తే సుమారు 30వేలమంది వరకు భక్తులు ఈ క్యాంప్‌లోనే ఉండేందుకు వీలుంటుంది. అలిపిరి పాత చెక్‌పోస్టు ప్రాంతంలో సమీప స్థలాలను కలుపుకుని శిల్పకళాశాల ప్రాంతంలో ఈ బేస్‌క్యాంపు ఏర్పాటుకు స్థలాల పరిశీలన జరిగింది. భక్తులకు సంతోషకరమైన దర్శనం తోబాటు సంతృప్తికర వసతి కల్పించేందుకు బేస్‌క్యాంపు ప్రధానంగా నిలవనుంది. దేశంలోని పలుప్రాంతాల నుండి తిరుపతికి చేరుకునే ప్రైవేటు వాహనాలు, యాత్రికుల వాహనాలను అలిపిరి బేస్‌క్యాంపుకు అనుసంధానం చేసి, ఇక్కడ వసతి కల్పించడం వల్ల శేషాచలం అడవిలో కొలువైన తిరుమలకు వాహనాలు కాలుష్యం, పర్యావరణ పరిరక్షణకు మార్గం సులభమవుతుందని భావిస్తున్నారు. అలిపిరి నుండి భక్తులను ఆర్టీసి విద్యుత్ బస్సుల ద్వారా తిరుమలకు చేరవేయనున్నారు.





# భక్తి వైభవం వెల్లివిరిసిన భద్రాద్రి రామయ్య హుండీ

**భద్రాచలం, సెప్టెంబరు 28(ప్రభాతవార్త):** భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామివారి సన్నిధిలో భక్తి వైభవం వెల్లివిరిసింది. రామయ్య దర్శనానికి దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు సమర్పించిన కానుకలతో హుండీ నిండిపోయింది. 98 రోజుల కాలానికి సంబంధించిన హుండీని లెక్కించగా రూ.2,12,40,214 నగదు ఆదాయం సమకూరింది. భక్తులు శ్రీరాముడిపై ఉంచిన అపారమైన విశ్వాసానికి ఈ ఆదాయం ప్రతిబింబంగా నిలిచింది. హుండీ లెక్కింపులో 0.170 గ్రాముల మిశ్రమ బంగారం, 1 కిలో 400 గ్రాముల మిశ్రమ వెండి లభించింది. దేశీయ కరెన్సీతో పాటు పలు దేశాలకు చెందిన విదేశీ కరెన్సీ కూడా హుండీలో దర్శనమిచ్చింది. అమెరికా డాలర్లు 545, ఇంగ్లాండ్ పౌండ్లు 110, కెనడా డాలర్లు 50, ఆస్ట్రేలియా డాలర్లు 60, యూరోలు 30 లభించాయి. యూఏఈ దిర్హామ్‌లు 135, ఖతార్ రియాళ్లు 11, కువైట్ దినార్లు 6, నేపాల్ రూపీలు 140, సింగపూర్ డాలర్లు 60 కూడా లభించాయి. ఒమన్ రియాల్, మలేషియా రింగిట్, భూటాన్ న్గుల్ట్రం, బహ్రెయిన్ దినార్ వంటి ఇతర దేశాల కరెన్సీలు సైతం హుండీలో కనిపించాయి. రామయ్యను దర్శించుకుంటే చాలు.. మనసుకు ప్రశాంతత.. మొక్కు చెల్లిస్తే స్వామి కరుణ"అన్న భక్తుల విశ్వాసం హుండీ కానుకల్లో స్పష్టంగా కనిపించింది. విదేశాల్లో నివసిస్తున్న భక్తులు సైతం భద్రాద్రి రామయ్యపై ఉన్న భక్తితో కానుకలు సమర్పించడం విశేషం. దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం క్షేత్రానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాశస్త్యానికి ఈ విదేశీ కరెన్సీ మరో నిదర్శనంగా నిలిచింది.

సీతారాముల సన్నిధిలో సమర్పించిన ప్రతి కానుక వెనుక ఓ భక్తుడి విశ్వాసం, ఓ కుటుంబం మొక్కు దాగి ఉంది. 98 రోజుల హుండీ లెక్కింపులో రూ.2.12 కోట్లకు పైగా ఆదాయం రావడంతో భద్రాద్రి దేవస్థాన హుండీ ఆదాయంలో ఇది ప్రత్యేకంగా నిలిచింది. జై శ్రీరామ్ నామస్మరణల మధ్య భక్తుల కానుకలతో భద్రాద్రి రామయ్య హుండీ భక్తి వైభవాన్ని చాటింది.

## భర్తను గొడ్డలితో నరికి హత్య చేసిన భార్య

**అల్వాల్, సెప్టెంబరు 28 ప్రభాతవార్త:** కుటుంబ కలహాలు నేపథ్యంలో భర్తను కుమారుడితో కలిసి భార్య హత్య చేసిన సంఘటన అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. హత్యకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మచ్చబొల్లారంలో హయత్‌నగర్ తారామతిపేటకు చెందిన శ్రీనివాస్ భార్య రమాదేవి(47) కుమారుడు నిఖిల్(24) కూతురు నిఖితతో నివాసం ఉంటున్నారు. శ్రీనివాస్ కొడుకుతో కలిసి బాలానగర్‌లో నట్స్ మరియు బోల్ట్స్ కంపెనీ నిర్వహిస్తున్నారు. గత కొంత కాలంగా భార్య భర్తలు మధ్య గొడవలు జరుగుతున్నాయి. వ్యాపారంలో నష్టాలకు తోడు షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు కలిసి రాలేదు. డబ్బు కోసం ఆస్తులను సైతం అమ్ముకోవడం జరిగింది. ఈ నేపథ్యంలో కుటుంబంలో తీవ్రమైన కలహాలు ప్రారంభం అయ్యాయి. భర్తపై రమాదేవి గతంలో వేదిస్తున్నాడంటూ పోలీసులకు ఫిర్యాదు కూడా చేసింది. ఆదివారం రాత్రి ఇంట్లో మరోసారి తీవ్ర స్థాయిలో గొడవ జరిగింది. కోపానికి గురైన రమాదేవి, కొడుకు నిఖిల్‌తో కలిసి గొడ్డలితో శ్రీనివాస్‌ను హత్య చేశారు. హత్య అనంతరం ఇరువురు పోలీసు స్టేషన్‌కు వెళ్ళి లొంగి పోయారు. హత్య విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించడం జరిగింది. హతుడు శ్రీనివాస్ తండ్రి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. హత్యకు కుటుంబ కలహాలే కారణమా లేక ఇతర అంశాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హత్య స్థానికంగా చర్చాంశనీయంగా మారింది.

## ఎంఐఎం నూతన ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ అబ్దుల్ హుస్సేన్ అన్వర్



**చార్మినార్,సెప్టెంబరు 28 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాత బస్తీ నూర్‌ఖాన్ బజార్ ప్రాంతానికి చెందిన ఎఐ ఎంఐఎం సీనియర్ నాయకులు సయ్యద్ అబ్దుల్ హుస్సేన్ అన్వర్ ఎఐ ఎంఐఎం పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.ఎఐఎంఐఎం పార్టీ అధ్యక్షులు,హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ దారుసలాంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమ వారం ఎంఐఎం పార్టీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.ఇంత వరకు పార్టీ జాయింట్ సెక్రటరీగా కొనసాగుతున్న పాతబస్తీకి నూర్‌ఖాన్ బజార్ ప్రాంతానికి చెందిన సయ్యద్ అబ్దుల్ హుస్సేన్ అన్వర్‌ను ప్రధాన కార్యదర్శిగా,సయ్యద్ ముస్తాక్ అహ్మద్‌ను జాయింట్ సెక్రటరీగా,మలక్‌పేట్ నియోజకవర్గం శాసన సభ్యులు అహ్మద్ బలాల సోదరుడు,ఫత్తర్‌గట్టి డివిజన్ మాజీ కార్పొరేటర్ మోసిన్ బలాలను కోశాధికారిగా,పార్టీ సహాయ ఆర్గనేజేషన్ ఇంఛార్జీలుగా అబు తుల్హా అంజాద్,సమద్ బిన్ అహ్మద్‌లను అసదుద్దీన్ ఓవైసీ నియమిం చారు.ఎన్నో సంవత్సరాలు పాటు ఎంఐఎం పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన,మాజీ ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషాఖాద్రి మృతి చెందటంతో ప్రధాన కార్యదర్శి పదవి ఖాళీగా ఉంది.కాగా పాషా ఖాద్రి స్థానంలో సయ్యద్ అబ్దుల్ హుస్సేన్ అన్వర్ ఎఐఎంఐఎం పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సయ్యద్ అబ్దుల్ హుస్సేన్ అన్వర్ గత యాభై సంవత్సరాలు నుంచి ఎంఐ ఎం పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు.

## ఉక్రెయిన్‌కు తలనొప్పిగా రష్యా సరికొత్త గెరాన్-5 డ్రోన్లు

**కీవ్, సెప్టెంబరు 28:** రష్యా సరికొత్తగా ప్రయోగిస్తోన్న జెట్ ఇంజిన్ డ్రోన్లు.. ఉక్రెయిన్ రక్షణ వ్యవస్థకు సవాల్‌గా మారాయి. గెరాన్-5 పేరుతో ఉన్న ఈ డ్రోన్లను ఆగస్టు నుంచి రష్యా యుద్ధంలో ఉపయోగిస్తోంది. వీటిలో 60 శాతం మాత్రమే తమ వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చగలుగుతున్నాయని ఉక్రెయిన్ ఎయిర్ ఫోర్స్ అధికార ప్రతినిధి ఇటీవల తెలిపారు. ఇతర డ్రోన్లను 95 శాతం వరకు అడ్డుకుంటున్నట్లు పేర్కొన్నారు. గెరాన్-5 గంటకు 600 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుంది. 1000 కి.మీ. దూరంలోని లక్ష్యాలనూ చేరుకోగలదు. 6,000 మీటర్ల ఎత్తు వరకు ఎగరగలదు. దీంతో భూతల రక్షణ వ్యవస్థలకు వీటిని కూల్చడం కష్టంగా మారింది. యుద్ధ విమానాలను రంగంలోకి దించి డ్రోన్లను కూల్చాల్సి వస్తోందని ఉక్రెయిన్ చెబుతోంది. 2022లో యుద్ధం ప్రారంభమైనప్పుడు ఇరుపక్షాలు ప్రధానంగా యుద్ధ విమానాలనే ఉపయోగించాయి. ఆ తర్వాత వాయురక్షణ వ్యవస్థల కారణంగా సుదూర దాడులకు ప్రాధాన్యం పెరిగింది.

## హెచ్1బి వీసా కఠిన కార్యాచరణను సమర్థించిన జెడివాన్స్



**వాషింగ్టన్, సెప్టెంబరు 28:** హెచ్1బీ వీసా వ్యవస్థపై అమెరికా ప్రభుత్వం తన కఠిన వైఖరిని కొనసాగిస్తోంది. కొన్ని హెచ్1బీ వీసా దరఖాస్తులపై లక్షడాలర్లు అంటే సుమారు రూ.95లక్షలు భారీ ఫీజు విధించాలన్న తమ యంత్రాంగం నిర్ణయాన్ని యూఎస్ వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ గట్టిగా సమర్థించుకున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా మేలు చేసే అత్యంత నైపుణ్యం కలిగిన నిపుణులను ఆకర్షించేందుకే హెచ్1బీ వీసా ప్రోగ్రామ్ ఉండాలని, అంతేగానీ అమెరికన్ ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో తక్కువ జీతాలకు విదేశీయులను నియమించుకోవడానికి కాదని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ఆల్‌ఇన్ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన జేడీ వాన్స్ హెచ్1బీ వీసాల వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని వివరించారు. తక్కువ జీతాలకు పనిచేసే విదేశీయులతో అమెరికన్లను భర్తీ చేయడానికి హెచ్1బీ వీసా విధానం లేదు. అమెరికా ఆర్థిక వ్యవస్థను సుసంపన్నం చేయడానికి మాత్రమే ఇది ఉపయోగపడాలని ఆయన అన్నారు. టెక్నాలజీ రంగంలో లేదా ఇతర కీలక రంగాలలో గణనీయమైన మార్పు తీసుకురాగల నిపుణులను కంపెనీలు ఆహ్వానించాలని ఆయన సూచించారు. ఈ విషయాన్ని ఆయన ఒక ఉదాహరణతో మరింత స్పష్టంగా వివరించారు. ఉదాహరణకు, ఒక అమెరికన్ అకౌంటెంట్ ఏడాదికి 60,000 డాలర్ల జీతం తీసుకుంటుంటే, ఆ వ్యక్తిని తొలగించి అదే స్థానంలో ఒక విదేశీ ఉద్యోగిని 45,000 డాలర్లకే నియమించుకోవడం హెచ్1బీ వీసా అసలు లక్ష్యం కాదని వాన్స్ తెలిపారు. ఇలాంటి పద్ధతులను అరికట్టడానికే కఠిన నిబంధనలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. హెచ్1బీ వీసా వ్యవస్థలో విస్తృతమైన చట్టపరమైన మార్పులు తీసుకురావడానికి అమెరికా కాంగ్రెస్‌లో రాజకీయ సంకల్పం తక్కువగా ఉందని, అందుకే తమ ప్రభుత్వం ఫీజుల పెంపు వంటి పరిపాలనాపరమైన చర్యలపై దృష్టి సారించిందని జేడీ వాన్స్ అంగీకరించారు. అంతేగాక పెద్ద ఎత్తున అమెరికన్ ఉద్యోగులను తొలగించిన కంపెనీలు, కార్మికుల కొరత ఉందని చెబుతూ మళ్లీ హెచ్1బీ వీసాల కోసం దరఖాస్తు చేయకుండా నిరోధించే మార్గాలను కూడా తమ యంత్రాంగం పరిశీలిస్తోందని ఆయన వెల్లడించారు. హెచ్1బీ వీసా వ్యవస్థను కఠినతరం చేసేందుకు జరుగుతున్న సంస్కరణల చర్చల నేపథ్యంలో వాన్స్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## ఆర్మీ వాహనాలకు ఇక బుల్లెట్‌ప్రూఫ్ కవచం!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** ఆర్మీలో రక్షణ వ్యవస్థను మరింత పటిష్టపర్చేదిశగా ఓ కీలక ముందడుగు పడింది. దీనికోసం రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ ఓ జాయింట్ వెంచర్ గా ఆవిర్భవించింది. కోల్‌కతా ప్రధాన కేంద్రంగా పనిచేస్తోన్న సీఎస్ఐఆర్‌సెంట్రల్ గ్లాస్ అండ్ సెరామిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ తో చేతులు కలిపింది. సైనిక దళాల సాయుధ వాహనాలకు అవసరమైన అత్యంత తేలిక, అత్యాధునిక స్వదేశీ బుల్లెట్‌ప్రూఫ్ గ్లాస్ అభివృద్ధి చేయబోతోంది. దీనికోసం రూ. 50 కోట్ల విలువ చేసే ప్రాజెక్టును ఈ రెండు సంస్థలు సంయుక్తంగా చేపట్టాయి. ఆర్మీ వాహనాల భద్రతలో బుల్లెట్‌ప్రూఫ్ అద్దాలు అత్యంత కీలక. ప్రస్తుతం సైన్యం ఇలాంటి వ్యవస్థల కోసం విదేశీ దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. దేశీయంగా ఈ నూతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. దిగుమతి చేసుకుంటోన్న వాటితో పోలిస్తే నూతనంగా అభివృద్ధి చేయబోయే బుల్లెట్‌ప్రూఫ్ గ్లాస్ బరువు, దాని మందం 30 నుంచి 50 శాతం వరకు తక్కువగా ఉంటుందని డీఆర్డీఓ వెల్లడించింది. ఈ బుల్లెట్‌ప్రూఫ్ మెటీరియల్ తయారీలో స్పెషల్ గ్లాస్ సెరామిక్స్ టెక్నాలజీని ఉపయోగిస్తారు. ఇందులో అమర్చిన నానోమీటర్ పరిమాణంలోని అత్యంత సూక్ష్మ స్ఫటికాలు గ్లాస్కు బలమైన రక్షణను ఇవ్వడమే కాకుండా పారదర్శకతను ఏమాత్రం దెబ్బతీయవు. ఈ అద్దం నేరుగా ఏకే47 రైఫిల్ నుంచి వచ్చే బుల్లెట్ల దాడిని కూడా తట్టుకోగలదు. కనీసం 100 మీటర్ల దూరం నుంచి నిర్దేశిత వేగంతో దూసుకొచ్చే బుల్లెట్లను సులువుగా నియంత్రించేలా బీఐఎస్ వీ, వీఐ స్టాండర్డ్స్ కు అనుగుణంగా దీనిని అభివృద్ధి చేస్తారు. చండీగఢ్కు చెందిన టెర్మినల్ బాలిస్టిక్స్ రీసెర్చ్ లాబొరేటరీ, మహారాష్ట్రలోని నావల్ మెటీరియల్స్ రీసెర్చ్ లాబొరేటరీ వంటి డీఆర్డీవో ల్యాబ్లు కలిసి పనిచేయనున్నాయి. బాలిస్టిక్ టెస్ట్ లల్లో ఈ ప్రత్యేక గ్లాస్ ఇప్పటికే అద్భుతమైన ఫలితాలను కనబరిచిందని ప్రాజెక్ట్ లీడర్, సీనియర్ సైంటిస్ట్ అతియార్ రహ్మాన్ ముల్లా వెల్లడించారు. ట్రిచీ అసాల్ట్ రైఫిల్ ద్వారా 10 మీటర్ల దూరం నుంచి ప్రయోగించిన బుల్లెట్లను కూడా ఈ గ్లాస్ విజయవంతంగా అడ్డుకుందని చెప్పారు.

## పార్కులు, మెట్రోస్టేషన్లను ప్రమాదజోన్లుగా ప్రకటించలేం!

### అత్యాచార ఘటనలపై సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** దేశ రాజధాని ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో ఇటీవల చోటుచేసుకున్న సామూహిక అత్యాచార ఘటనలపై సోమవారం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఈ ఘటనలను సర్వోన్నత న్యాయస్థానం సుమోటోగా విచారణకు తీసుకుని కీలక వ్యాఖ్యలు చేసింది. ఆస్తాకుంజ్ పార్కులో, స్వరూప్ నగర్‌లో, గ్రేటర్ నోయిడా నుంచి ఢిల్లీకి వెళ్తున్న బస్సులో గ్యాంగ్‌రేప్ ఘటనలు వెలుగు చూశాయి. ఈ వరుస ఘటనలతో దేశ రాజధాని ఉలిక్కిపడింది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు సుమోటోగా విచారణను ప్రారంభించింది. 2012 నాటి నిర్భయ కేసుతో పోలిక తీసుకురాకుండా ఉండలేకపోతున్నామని వ్యాఖ్యానించింది. ఆ కేసు నుంచి ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నదని పేర్కొన్నది. ప్రజాభద్రతకు హామీ ఉన్నప్పటికీ, గౌరవంగా జీవించే హక్కును రాజ్యాంగం ప్రసాదించినప్పటికీ, ఈ లైంగికదాడులు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేసింది. పెట్రోలింగ్, నిఘా సరిగాలేదని చెప్పి రోడ్లు, బస్సులు, మెట్రో స్టేషన్లు, సబ్‌వేలు, పార్కుల వంటివాటిని అధిక ప్రమాద జోన్లుగా ప్రకటించలేమని సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆస్తాకుంజ్ ఘటనలో లైంగిక వేధింపులపై విద్యార్థినుల నుంచి ఫిర్యాదులు వచ్చినప్పటికీ పట్టించుకోలేదంటూ వచ్చిన వార్తా కథనాన్ని ఈ సందర్భంగా కోర్టు ప్రస్తావించింది. భద్రతా లోపాలను సరిదిద్దడంలో పోలీసులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తంచేసింది. శాంతి భద్రతలను కాపాడంలో, ప్రజా భద్రతకు హామీ ఇవ్వడంలో వ్యవస్థాగత వైఫల్యాలు ఈ ఘటనలతో తేటతెల్లం అవుతున్నాయని కోర్టు మండిపడింది. బాధ్యాయుత స్థానాల్లో ఉన్నవారిని జవాబుదారీ చేయడం అవసరమని స్పష్టంచేసింది.

## ఇరాన్‌తో అణు ఒప్పందానికి ట్రంప్ కీలక ప్రతిపాదన

### ఆంక్షల సడలింపు.. నిలిచిపోయిన నిధుల విడుదలకు సిద్ధం

**వాషింగ్టన్, సెప్టెంబరు 28:** అణు ఒప్పందం దిశగా ఇరాన్ నుంచి స్పష్టమైన పురోగతి కనిపిస్తే ఆ దేశంపై విధించిన ఆంక్షలను సడలించడంతో పాటు, ప్రస్తుతం నిలిపివేసిన నిధులను విడుదల చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిద్ధంగా ఉన్నట్లు నివేదికలు వెల్లడించాయి. ఇరాన్‌పై యుద్ధం కారణంగా ఆ దేశంపై ఆర్థిక ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో అమెరికాఇరాన్‌లను తిరిగి చర్చల బాట పట్టించేందుకు మధ్యవర్తులు ప్రయత్నిస్తున్న సమయంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. మధ్యవర్తుల ద్వారా అమెరికా, ఇరాన్ మధ్య సానుకూల, నిర్మాణాత్మక చర్చలు జరుగుతున్నాయని ఓ అమెరికా అధికారి అమెరికా టివికి తెలిపారు. అయితే అణు అంశాలపై స్పష్టమైన పురోగతి లేకుండా ఎలాంటి ఒప్పందం కుదరదని ఆయన స్పష్టం చేశారు. హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవాలంటూ ఇరాన్ చేసిన తాజా ప్రతిపాదనను ట్రంప్ తిరస్కరించారు. ఆ ప్రతిపాదన ఆమోదయోగ్యం కాదని ఆయన పేర్కొన్నారు. ఇరాన్‌తో మరిన్ని చర్చలు ఈ వారంలో జరిగే అవకాశం ఉందని ఆదివారంఆక్సియోస్‌కు తెలిపారు.అమెరికా తరఫున ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో చర్చల్లో పాల్గొంటున్నట్లు అమెరికా అధికారి తెలిపారు.వారు ఒప్పందం చేసుకోవాలని కోరుకుంటున్నారు. కానీ వారు కోరుకుంటున్నది నేను చేసుకోవాలనుకునే ఒప్పందం కాదు. ఏడాది క్రితం బహుశా మేము అంగీకరించి ఉండే ఒప్పందం అది. వారు తమ అవకాశాలను అతిగా వినియోగించుకున్నారని ట్రంప్ వ్యాఖ్యానించారు.అణు అంశాలపై సౌలభ్యంగా వ్యవహరించేందుకు ఇరాన్ సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు ఇచ్చిందని అమెరికా అధికారి తెలిపారు. ఇరాన్ చేయాల్సిన కట్టుబాట్లు ఎప్పుడు అమలు చేయాలన్న అంశంపై ఇరు దేశాల మధ్య ఇంకా ఏకాభిప్రాయం కుదరలేదన్నారు.



## సిబిఎస్ఇలో థర్డ్ లాంగ్వేజ్ విద్యార్థులకు సుప్రీం ఊరట

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** సీబీఎస్ఈ పాఠశాలల్లో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థులకు దేశ అత్యున్నత న్యాయస్థానం భారీ ఉపశమనం కలిగించింది. నూతన విద్యా విధానంలో భాగంగా ప్రవేశపెట్టిన థర్డ్ లాంగ్వేజ్ పై కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఏడో తరగతి, ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అమలులో ఉన్న బోర్డు పరీక్ష మినహాయింపులను ఇప్పుడు ఆరో తరగతికి కూడా పూర్తిస్థాయిలో వర్తింపజేయాలని సీబీఎస్ఈ బోర్డును ఆదేశించింది. ఈ తాజా నిర్ణయం ప్రకారం ప్రస్తుతం ఆరో తరగతి చదువుతున్న విద్యార్థులు విద్యా ప్రణాళికలో భాగంగా మూడో భాషను పాఠ్యాంశంగా ఖచ్చితంగా అభ్యసించాల్సి ఉంటుంది గానీ వారు భవిష్యత్తులో పదో తరగతి బోర్డు పరీక్షలు రాసేటప్పుడు ఈ నిర్దుష్ట థర్డ్ లాంగ్వేజ్ పరీక్ష రాయాల్సిన అవసరం ఉండదు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ పరీక్ష రాయడం నుంచి వారికి బోర్డు పూర్తి మినహాయింపు ఇస్తుంది. ఇప్పటికే ఉన్నత తరగతుల విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఈ సదుపాయాన్ని కోర్టు ఇప్పుడు ఆరో తరగతి విద్యార్థులకు కూడా విస్తరింపజేసింది. సుప్రీంకోర్టు ఆరో తరగతి విద్యార్థులకు మరో కీలక సడలింపును కూడా ఇచ్చింది. ప్రస్తుతం రెండు స్థానికేతర భాషలను అభ్యసిస్తున్న విద్యార్థులు, తమ ప్రస్తుత సబ్జెక్టులను మార్చుకోవాల్సిన అవసరం ఉండదు. పాత సబ్జెక్టులను అలాగే కొనసాగిస్తూ థర్డ్ లాంగ్వేజ్ కింద ఏదైనా ఒక భారతీయ భాషను ఎంచుకునే అవకాశాన్ని సుప్రీంకోర్టు కల్పించింది. దీనివల్ల విద్యార్థులు తమకు ఇష్టమైన సబ్జెక్టులను వదులుకోవాల్సిన పని లేదు. నూతన విద్యా విధానాన్ని అమలు చేస్తోన్న తరుణంలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడనుంది. సీబీఎస్ఈ త్రిభాషా విధానంలో వచ్చిన ఈ తాజా మార్పులతో దేశవ్యాప్తంగా వేలాది పాఠశాలలకు, విద్యార్థులకు విద్యా ప్రణాళికలు రూపొందించుకోవడంలో ఎదురవుతున్న ఇబ్బందులు తొలగిపోయినట్టవుతుంది.

థర్డ్ లాంగ్వేజ్ ఎంపిక, పరీక్షల విషయంలో మరింత స్పష్టత లభించినట్టయింది.దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది సీబీఎస్ఈ విద్యార్థులకు ఈ మార్గదర్శకాలు ఎంతో ప్రయోజనం చేకూర్చనున్నాయి. నూతన విద్యా సంస్కరణలు దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులపై పడే ఒత్తిడిని నివారించడానికి సుప్రీంకోర్టు ఈ కీలక సడలింపులు ఇచ్చింది. ఈ తాజా ఆదేశాలకు అనుగుణంగా తగిన అధికారిక నిబంధనలు, నూతన మార్గదర్శకాలను సీబీఎస్ఈ త్వరలోనే విడుదల చేసే అవకాశం ఉంది.

## క్యాబ్‌లో ప్రయాణికురాలిపై అఘాయిత్యానికి యత్నం

### - రూటు మార్చి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లిన డ్రైవర్ - కేకలు వేయడంతో పరార్ - రూ.60 వేల నగదు అపహరణ ఆరోపణ

**రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 28, ప్రభాతవార్త :** నగర శివారులో మహిళా ప్రయాణికురాలిపై క్యాబ్ డ్రైవర్ లైంగిక దాడికి యత్నించిన ఘటన కలకలం రేపింది. జడ్చర్ల నుంచి హైదరాబాద్‌కు క్యాబ్‌లో వస్తున్న మహిళను తొండుపల్లి టోల్‌ప్లాజా దాటిన తర్వాత డ్రైవర్ రూటు మార్చి కొత్వాల్‌గూడ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్కడ ఆమెపై లైంగిక దాడికి ప్రయత్నించగా బాధితురాలు అప్రమత్తమై కేకలు వేయడంతో డ్రైవర్ అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఇదే సమయంలో ఆమె బ్యాగులో ఉన్న రూ.60 వేల నగదును డ్రైవర్ తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొంది.నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన మహిళ సెప్టెంబరు 26న సాయంత్రం జడ్చర్ల నుంచి హైదరాబాద్‌కు క్యాబ్‌లో బయలుదేరింది. శంషాబాద్ చేరుకున్న తర్వాత గచ్చిబౌలి వెళ్లేందుకు డ్రైవర్ అదనంగా రూ.50 చెల్లించాలని కోరగా ఆమె అంగీకరించినట్లు సమాచారం. అయితే తొండుపల్లి టోల్‌ప్లాజా దాటిన అనంతరం డ్రైవర్ వాహనాన్ని సాధారణ మార్గంలో కాకుండా సర్వీస్ రోడ్డువైపు మళ్లించినట్లు బాధితురాలు పోలీసులకు తెలిపింది.కొంతదూరం వెళ్లిన తర్వాత కొత్వాల్‌గూడ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో వాహనాన్ని నిలిపి తనపై లైంగిక దాడికి ప్రయత్నించినట్లు ఆమె ఆరోపించింది. దీంతో అప్రమత్తమైన మహిళ డ్రైవర్‌ను ప్రతిఘటించి కారు నుంచి బయటకు వచ్చి గట్టిగా కేకలు వేసింది. దీంతో స్థానికులు వస్తారన్న భయంతో డ్రైవర్ అక్కడి నుంచి పరారైనట్లు తెలిసింది. అయితే అప్పటికే బాధితురాలి బ్యాగులో ఉన్న రూ.60 వేల నగదును తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొంది.ఘటన అనంతరం స్థానికుల సహాయంతో బాధితురాలు ఆర్‌జీఐఏ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తొండుపల్లి టోల్‌ప్లాజా, సర్వీస్ రోడ్డు, కొత్వాల్‌గూడ పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ నిందితుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. క్యాబ్ ప్రయాణానికి సంబంధించిన వివరాలతో పాటు వాహనం కదలికలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది.నిందితుడిని గుర్తించి పట్టుకునేందుకు పోలీసులు సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నట్లు సమాచారం. ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో లైంగిక దాడికి యత్నించినట్లు వచ్చిన ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

## సొహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసుపై సుప్రీం విచారణషురూ!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** గ్యాంగ్‌స్టర్ సొహ్రాబుద్దీన్ షేక్, ఆయన భార్య కౌసర్ బీ, అనుచరుడు తులసీరామ్ ప్రజాపతి హత్యలపై దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు సోమవారం అంగీకరించింది. ఈ కేసులో 21 మంది పోలీసు అధికారులు సహా మొత్తం 22 మంది నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఈ పిటిషన్ దాఖలైంది. సొహ్రాబుద్దీన్ షేక్ సోదరుడు నయాబుద్దీన్ షేక్ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. మే 7న బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును ఈ పిటిషన్‌లో సవాలు చేశారు.కేసులో కీలకమైన కొన్ని సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించనున్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. కేసు మొత్తం రికార్డులను తెప్పించబోమని, అయితే నిర్దోషిత్వ తీర్పును పరిశీలించేందుకు అత్యంత కీలకమైన మూడు లేదా నాలుగు సాక్షుల వాంగ్మూలాలను సమర్పించాలని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు.

## ఆస్తి కోసం తమ్ముడిని హత్య చేయించిన అన్న

### గొడ్డలితో నరికి.. పెట్రోల్ పోసి కాల్చివేత

## మిస్సింగ్ కేసును ఛేదించి ముగ్గురు నిందితుల అరెస్ట్

**చెన్నూరు, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త:** ఆస్తి కోసం తోడబుట్టిన తమ్ముడినే కడతేర్చేందుకు అన్న కిరాయి హంతకులకు సుపారీ ఇచ్చిన ఘటన చెన్నూరు నియోజకవర్గంలో కలకలం రేపింది. గుప్తనిధుల పేరుతో మాయమాటలు చెప్పి తమ్ముడిని అడవిలోకి తీసుకెళ్లి గొడ్డలితో నరికి హత్య చేసి, ఆనవాళ్లు లేకుండా చేసేందుకు మృతదేహంపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనను పోలీసులు ఛేదించారు. ఈ కేసులో హత్యకు ప్రధాన సూత్రధారిగా ఉన్న అన్నతో పాటు ఇద్దరు కిరాయి హంతకులను అరెస్టు చేశారు.

**ఏడేళ్లుగా ఆస్తి వివాదం**

జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. నీల్వాయి గ్రామానికి చెందిన కుడుకుల రాజేష్, అతని తమ్ముడు శ్రీనివాస్ మధ్య గత ఏడేళ్లుగా వ్యవసాయ భూమి, ఇంటి స్థలాల విషయంలో వివాదం కొనసాగుతోంది. తాను చేపట్టే ప్రతి పనికి తమ్ముడు అడ్డుపడుతున్నాడనే కక్షతో రాజేష్ శ్రీనివాస్‌ను హత్య చేయాలని పథకం పన్నాడు. ఈ క్రమంలో తనకు వరుసకు బావమరిది అయిన దాకపల్లికి చెందిన గోదారి సమ్మయ్యను సంప్రదించాడు. హత్య పథకాన్ని అమలు చేసేందుకు సమ్మయ్య తన గ్రామానికే చెందిన బల్లా కిష్టస్వామిని ఒప్పించి వెంట తీసుకున్నాడు. హత్యకు ముందుగానే రాజేష్ పలుదఫాలుగా సమ్మయ్యకు రూ.95 వేల నగదును అడ్వాన్స్‌గా ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

**గుప్తనిధుల పేరుతో ఎర**

శ్రీనివాస్‌కు గుప్తనిధులు ఉన్నాయని నమ్మబలికి తమ పథకానికి అనుకూలంగా మార్చుకున్నారు. ఈ నెల 20న సాయంత్రం శ్రీనివాస్ చెన్నూరుకు వస్తున్న విషయం తెలుసుకున్న రాజేష్ వెంటనే సమ్మయ్యకు సమాచారం ఇచ్చాడు. సమ్మయ్య చెన్నూరు బస్టాండ్ వద్ద శ్రీనివాస్‌ను కలిసి అతనితో మద్యం సేవించాడు. అనంతరం ఒడ్డు సోమనపల్లి అటవీ ప్రాంతంలో గుప్తనిధులు ఉన్నాయని, అక్కడికి వెళ్లి తవ్వితే దొరుకుతాయని నమ్మించి అతడిని తన వెంట తీసుకెళ్లాడు.

**ముందే పక్కా పథకం**

పథకం ప్రకారం బల్లా కిష్టస్వామి పల్సర్ బైక్‌పై ఆస్నాద్ చౌరస్తా వద్ద సిద్ధంగా ఉన్నాడు. మరోవైపు సమ్మయ్య పెట్రోల్ బంకులో ఓ బాటిల్‌లో పెట్రోల్ కొనుగోలు చేశాడు. అనంతరం ముగ్గురూ కలిసి మండలంలోని ఒడ్డు సోమనపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలోకి వెళ్లారు. అడవిలో నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో వెనుక నుంచి సమ్మయ్య వెంట తెచ్చుకున్న గొడ్డలితో శ్రీనివాస్‌పై దాడి చేశాడు. తప్పించుకునేందుకు ప్రయత్నించిన శ్రీనివాస్‌ను కిష్టస్వామి పట్టుకోగా, సమ్మయ్య గొడ్డలితో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆనవాళ్లు లేకుండా చేసేందుకు మృతదేహంపై పెట్రోల్ పోసి నిప్పంటించి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ నెల 21న చెన్నూరులో రాజేష్‌ను కలిసిన నిందితులు హత్య పూర్తయినట్లు సమాచారం ఇచ్చారు. ఒప్పందం ప్రకారం రాజేష్ వారికి మరో రూ.లక్ష నగదు చెల్లించినట్లు పోలీసులు తెలిపారు.

**మిస్సింగ్ కేసుతో వెలుగులోకి..**

ఈ నెల 21న శ్రీనివాస్ కనిపించడం లేదని కుటుంబ సభ్యులు నీల్వాయి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో గోదారి సమ్మయ్యను విచారించగా ఒడ్డు సోమనపల్లి అటవీ ప్రాంతంలో శ్రీనివాస్ కాలిపోయిన మృతదేహం ఉన్న ప్రదేశాన్ని పోలీసులకు చూపించాడు. కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో మొదట చెన్నూరు బస్టాండ్ వద్ద గోదారి సమ్మయ్యను అదుపులోకి తీసుకున్నారు. అతడు ఇచ్చిన సమాచారంతో పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న ప్రధాన సూత్రధారి కుడుకుల రాజేష్, సహ నిందితుడు బల్లా కిష్టస్వామిని ఆస్నాద్ చౌరస్తా వద్ద అరెస్టు చేశారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.60 వేల నగదు, హత్యకు ఉపయోగించిన గొడ్డలి, నిందితులు ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్, రక్తపు మరకలున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

**పోలీసు అధికారులకు ఏసీపీ అభినందనలు**

కేసు నమోదు అయిన కొద్దిరోజుల్లోనే మిస్సింగ్ కేసు మిస్టరీని ఛేదించి నిందితులను అరెస్టు చేసిన పోలీసు అధికారులను జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అభినందించారు. దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన చెన్నూర్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్. కృష్ణ, నీల్వాయి ఎస్సై నాగరాజు, కోటపల్లి ఎస్సై రాజశేఖర్, భీమారం ఎస్సై రాజేందర్, హెడ్ కానిస్టేబుళ్లు శంకర్, బుజ్జిబాబు, కానిస్టేబుళ్లు రవి, భరత్, సంపత్, వెంకన్న, రాజేందర్‌లను ఏసీపీ అభినందించారు.

## తెలంగాణలోనూ ఎపి తరహా బిసి రక్షణ చట్టం తేవాలి

### ముఖ్యమంత్రికి ఎంపి ఆర్. కృష్ణయ్య వినతి

**హైదరాబాద్ సెప్టెంబర్ 28 ( ప్రభాతవార్త ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాదిరిగానే తెలంగాణలోనూ బీసీల రక్షణ కోసం ప్రత్యేకంగా బీసీ రక్షణ చట్టం తీసుకురావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రికి ఒక వినతిపత్రం పంపారు. బీసీ రక్షణ చట్టం ఏర్పాటుపై తక్షణమే ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి, మార్గదర్శకాలు రూపొందించాలని అందులో కోరారు. ఇటీవల ఏపీ ప్రభుత్వం బీసీ రక్షణ చట్టాన్ని ఆమోదించిందని, ఇది బీసీల చిరకాల ఆకాంక్ష అని కృష్ణయ్య గుర్తుచేశారు. బీసీ కులాల్లో అత్యంత వెనుకబడిన తరగతులు, సంచార జాతులు, భిక్షాటన చేసే కులాలు ఎన్నో ఉన్నాయని, వీరు సమాజంలో కులపరంగా తీవ్ర వివక్షను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ద్వారా ఆయా వర్గాలకు రక్షణ దొరికినట్లే, బీసీలకు కూడా ప్రత్యేక చట్టం తెస్తే వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. బీసీ రక్షణ చట్టం వస్తే బీసీలపై జరిగే దాడులు, దౌర్జన్యాలతో పాటు వారిపై బనాయించే దొంగ కేసులు కూడా తగ్గుతాయని ఆర్. కృష్ణయ్య అభిప్రాయపడ్డారు. గత 30 ఏళ్లుగా దొరలు, భూస్వాముల దౌర్జన్యాలతో పాటు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ తప్పుడు కేసుల వల్ల వేలాది మంది బీసీలు జైళ్ల పాలై అష్టకష్టాలు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. వడ్డెర, వంశీరాజ్, పిచ్చుకుంట్ల, చాకలి, మంగలి, పూసల, బుడబుక్కల, దొమ్మర, బోయ తదితర సంచార జాతులు ఎస్సీ, ఎస్టీల కంటే ఎక్కువ వెనుకబడి ఉన్నారని, వారిపై దాడులు జరుగుతున్నా రక్షణ కరవైందని విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 56 శాతానికి పైగా ఉన్నప్పటికీ అడుగడుగునా అన్యాయాలకు గురవుతున్నారని కృష్ణయ్య పేర్కొన్నారు. ఇటీవల జరిగిన కులగణన సర్వేతో పాటు, బీసీ కమిషన్ నిర్వహించిన పబ్లిక్ హియరింగ్ (ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్)లలోనూ రక్షణ చట్టం డిమాండ్ బలంగా వినిపించిందని తెలిపారు. నాగర్‌కర్నూల్, నల్గొండ, కరీంనగర్, నిజామాబాద్ తదితర జిల్లాల్లో బీసీలపై దాడులు, కుల బహిష్కరణ, గ్రామ బహిష్కరణ సంఘటనలు వెలుగుచూశాయని, బయటకు రానివి వేల సంఖ్యలో ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో కుల వివక్షను రూపుమాపి, బీసీలకు సామాజిక భద్రత కల్పించేందుకు తక్షణమే రక్షణ చట్టాన్ని తీసుకురావాలని ఆయన ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.



# మేకప్‌కూ రూల్సుంటాయి!

ఆఫీసు లేదా ఫంక్షన్‌కి వెళ్లడానికి రెడీ అవుతామా! క్రీం దొరికితే లిప్స్టిక్ దొరకదు... ఈ రెండు దొరికితే ఐలైనర్ కనిపించదు. దానితో డ్రెస్సింగ్ టేబుల్ సొరుగు మొత్తం వెతికేస్తాం. కావాల్సిన వస్తువులు ఒకటికి రెండున్నా సమయానికి చేతికి దొరకకపోతే. ఆ టైంలో చిరాకు రాకమానదు. ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే మేకప్ డ్రాయర్ రూల్ పాటించి చూడండి. ఈ పద్ధతిలో సౌందర్య వస్తువుని సర్దుకుంటే వస్తువులు త్వరగా దొరకడంతోపాటు ముస్తాబయ్యే సమయం కూడా ఆదా. దీని కోసం ఏంచేయాలంటే సన్స్క్రీన్, కాజల్, లిప్స్టిక్... రోజూ వాడేవే కాబట్టి వీటిని ముందు భాగంలో పెట్టుకోవాలి. అప్పుడప్పుడు వాడే ఐషాడో ప్యాలెట్లు, బ్రైట్ షేడ్స్ వెనక భాగంలో సర్దుకుంటే పని సులువవుతుంది. కొన్ని మేకప్ వస్తువులకు గడువు తేదీ ఏడాది ఉంటే... మూడు నాలుగు నెలల్లోనే ఎక్స్‌పైర్ ఉంటాయి. గడువు ముగిసినా వాటిని బయటపడేయకుండా కొత్తగా తెచ్చుకున్నవి వాటితో కలిపేస్తాం. అలా చేస్తే చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే గడువు చెల్లిన వాటిని తొలగించాకే కొత్తవాటిని సర్దుకోవాలి. ఒక్కోసారి హడావుడిలోపడి మేకప్ పూర్తయ్యాక వాటి మూతలు పెట్టకుండా ర్యాక్ పడేస్తాం. దీనివల్ల అవి ఇతర సామగ్రికి అంటుకొని సొరుగు మొత్తం చిందరవందరగా కనిపిస్తుంది. అంతేకాదు, వాటిల్లోకి తేమ చేరి పెరిగే అవకాశం ఎక్కువ. అందుకే మేకప్ పూర్తికాగానే మూత పెట్టడం తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలి. మేకప్ అంటే స్కిన్ కేర్ ఒక్కటేనా..హెయిర్ కేర్ కూడా ఉంటుంది కదా. ఈ రెండు రకాల ఉత్పత్తులను కలపొద్దు. □

# ఉత్తమ మార్గం !

ఈ రోజుల్లో చాలా మంది ఎవరికి వారే ఉత్తములు అని బిరుదులు ఇచ్చుకుంటున్నారు. ఇది చాలా హాస్యాస్పదం. మేము గుడిలో దానాలు, దీపాలకు నూనె ఇస్తు న్నాం, పేదలకు దానం చేస్తున్నాం అనే భరోసా వాళ్ళకు ఉంది. కానీ ఆచరణలో వాళ్ళ ప్రవర్తన వేరే. ఒక ప్రక్కదైవ ధర్మ గ్రంధాలు చదువుతూ,ఆమె ఇట్లా, ఈమె అట్లా అని సంభాషిస్తూ మళ్ళీ గ్రంధాలలో నిమగ్న మై పోతారు. ఏదో చదివాము అనే మూస ధోరణి వాళ్ళకు ఉంటుంది. ఇవేమి ఫలితం ఇవ్వవు. దైవ గ్రంధాలు ప్రశాంతంగా వీలు ఉన్నప్పుడు చదువు కోవాలి. ఇతరుల మాటలు పట్టించు కోరాదు. ఓ ముదు సలి ఉదయమే కృష్ణా, రామ, సాయిరాం అనుకుంటూ లేచి పలువురిని ఇబ్బంది పెడుతుంది. నడవడానికి చేత కానప్పుడు నిదానంగా, ప్రశాంతంగా, ఎవరితో మాట్లాడక వారి పనులు వారే చేసుకోవాలి,ఆలస్యం అయినా పర్వాలేదు. అసలు వృద్ధులు మనసులో ఆ భగవంతుణ్ణి తలచుకుంటే చాలు అదే పది వేలు. అటువంటి వారే ఉత్తములు. అంతే కాని నేను రోజూ ఆ దైవాన్ని తలుస్తున్నా నేనే ఉత్తమురాలు, ఉత్తముడు అనుకుంటే ఆది వ్యంగ్యం ఉంటుంది. మన గురించి ఇతరులు గొప్పగా చెప్పుకుంటే అంత కన్నా ఫలితం ఉండదు. ఉత్తమం అంటే ఏ వ్యాపకాలు లేకుండా, శక్తికి మించి దానాలు చేయకుండా, ముందు నీ ఇంటిలోని వారిని బాగా చూసుకుంటే ఆదే ఉత్త మోత్తమం. చేత కానప్పుడు అన్నీ వదిలేసి మదిలో దైవాన్ని తల్చుకుంటే చాలు.చేత కాకున్నా ఉదయమే దైవాన్ని కొలవడం, అందరికి అడ్డం రావడం శ్రేయస్కరం కాదు. అవసాన దశలోసంతానం లో ఎవరూ సేవలు అందిస్తారో వారికే ఫలం ఇవ్వాలి. అంతే కాని అందరికి సగం సగం అనే భ్రాంతి పోవాలి. కొడుకులు అయినా, కోడళ్ళు అయినా, బిడ్డలు అయినా సేవలు అందించే వారికే ప్రతి ఫలం ఉంటుంది. ఇది సత్యం. సేవలు చేయని వారికి ఇస్తే నీకే పాపం వస్తుంది. అప్పుడు ఏ దేవుడు నీ మొర ఆలకించడు. నీ ఆస్తి నీ ఇష్టం. నీ బంగారు నీ ఇష్టం. ఎవరికైనా అంటే నీ సేవలు చేసే వారికే ఇవ్వాలి. ఈ వయసులో నీకు సుద్దులు ఉండరాదు. ఆధ్యాత్మిక్నగానే ఇతరులతో మాట్లాడాలి. ఎవరి గురించి అనవసరంగా చర్చ చేయరాదు. ఈ వయసులో నిబ్బరం ఉండాలి. పౌరుషానికి పోరాదు. ఆచి, తూచి మాట్లాడాలి. ఏ సమస్యలు లేక మోనంగా ఉండాలి. సమయానికి తిండి ఉంటే చాలు. ఏ కోరికలు ఉండరాదు. చేత కాకున్నా పోవాలంటే ఓ కారు లో వెళ్ళు, అంతే కాని బస్సులలో వెళ్లడం మంచిది కాదు. నువ్వు ఏ కోవెలకు వెళ్లినా, ఇంటి పట్టున వున్నా మోనంగా ఉండు అదే ఉత్తమం. □

# పాలతో ఇద్దాం !



కొంతమంది పిల్లలు పాలు తాగడానికి ఇష్టపడరు. అవి వారికి రుచించక పోవడమే ఇందుకు కారణం. దీనితో వారి శరీర ఎదుగుదలకు కావాల్సిన పోషకాలు అందకుండా పోతాయి. అలా జరగకుండా ఉండాలంటే నేరుగా కాకుండా.. వాటిలో కొన్ని పాల పదార్థాలు కలపడం వల్ల రుచికరంగా పిల్లలకు అందించవచ్చు.

పిల్లలు ఇష్టంగా పాలు తాగాలంటే.. రకరకాల పండ్ల ముక్కలు వేసి స్మూతీలుగా, మిల్క్ షేక్స్‌గా తయారు చేసి ఇవ్వచ్చు. అయితే వీటి తయారీలో పండ్ల పరిమాణం కాస్త తక్కువగా, పాల పరిమాణం ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఎక్కువ మొత్తంలో పాలు వారికి ఇవ్వచ్చు. అలాగే చక్కెర మరీ ఎక్కువగా వేయకూడదు. పోషకాహార నిపుణుల సలహా తీసుకొని రుచి కోసం కలిపే కొన్ని పౌడర్లు, పదార్థాలను ఎంచుకోవచ్చు. ఫలితంగా పిల్లలకు పాలు రుచిగా మారడంతో పాటు క్యాల్షియం వంటి పోషకాలు పిల్లలకు సమృద్ధిగా అందుతాయి. కార్న్ ఫ్లేక్స్, చాకోస్.. పాలలో కలిపి ఇవ్వడం వల్ల పాలు మరింత రుచిగా ఉంటాయి. ఫలితంగా వారు ఆ పదార్థాలను తిని పాలు తాగుతారు. ఈ చక్కెర మోతాదు తక్కువ " ఉన్న వాటిని మర్చిపోవద్దు. అలాగే ఓట్మీల్, పాస్తా.. వంటి పదార్థాల్లో నీళ్లకు బదులుగా పాలను ఉపయోగించడం మంచిది. □

# బడాయికి పోతే బంగారం మాయం !



ఏమిటీఆడంబరమోనమ్మా! మొన్న పక్కింటి మీనాక్షి వాళ్లాయన 'రవ్వల హారం' కొన్నారని తెగ మురిసిపోయింది. నిన్న కామాక్షి కాసులపేరుతో ఊరంతా కలియ తిరిగి గుమ్మం గుమ్మానికీ వెళ్లి పొద్దుటే బడాయి పోయింది. నాకూ ఉన్నాయలేమ్మా! ఏడువారాల నగలు నేనెలా మురిసిపోవాలి. నాకూ ఉన్నాయి చూడంటూ బీరువాలో ఉన్న నగలన్నీ తెచ్చి అమ్మలక్కల ముందు పోసింది. ఎవరికి వారు వాటిని తమకైతే ఎలా ఉంటాయో అని వంటికి తగిలించు కొంటారు. ఇలాంటి 'గొప్ప'లకు పోయి తమ నగలన్నీ ఇతరులకు చూపెట్టడం వారు అంతో ఇంతో పొగిడేసి వెళ్లిపోవడం తెలుగునాట ఎన్నో చోట్ల కంటుంటాము. వింటుంటాము. అంతేకాదు. ఆ యిల్లు ఈ ఇల్లు తిరుగుతూ గొప్పవారి గోతాల్లో నగల గురించి ఆ నోటా ఈ నోటా జనాల్లోకి వెళ్లిపోవడం కద్దు. అంతే కాదు ఓ యూట్యూబర్ అయితే తనకున్న నగలన్నింటినీ తన కొచ్చిన విద్యతో యూట్యూబ్‌లో ప్రదర్శనకు పెట్టేసింది. బాగా వైరల్ అయిపోయింది. దీన్ని తిలకించిన చోర శాఖామణులు అలా చూస్తూ ఊరుకుంటారా తమ హస్తలాఘవాన్ని చూపించరూ! అదే జరిగింది. ఇది యధార్థ సంఘటన. తమిళనాడులోని నాగర్ కోయిల్‌లో మధుమిత అనే ఓ అమ్మడు బేషజం కోసమో! మరేమనుకుందో యూట్యూబ్, ఇన్‌స్టాలో డబ్బు, బంగారం చూపిస్తూ వీడియోలు పెట్టేసింది. అలా చూసే వారికి ఎవరికి మాత్రం 'ఆశ' పుట్టదు అయినా ఆమె ఊర్లో ఉండనన్న సమాచారమూ అంతే గొప్పగా అదే యూట్యూబ్‌లో పెట్టేసింది. చేతిలో పనికదా! 'వ్యూయర్స్' కోసం అయి ఉంటుంది. సోషల్ మిడియాలో సంపదను ప్రదర్శించడం ఎంత తప్పో, మహిళలు తెలుసుకోవాలి. కన్యాకుమారి జిల్లా నాగర్ కోయల్ సమీపంలోని తమ్మత్తు కోణం విఐపిగా లైన్‌లో ఆమె నివాసం. ఆమె యూట్యూబ్ ఛానల్‌కు 42 వేల మంది వ్యూయర్‌లు ,ఫాలోవర్‌లున్నారు. బీరువాలోని బంగారు నగలు, వజ్రా భరణాలు, నగదును రీల్స్‌లో ఘనంగా చూపింది. రూ.500 నోట్లను తన పిల్లాడిపై సంబర పడిపోయింది. ఇలా మన విషయాలు, సంపదను ఇతరులకు తెలిసేలా ప్రదర్శిస్తే అదెలా వికటిస్తుందో ఇదే ఉదాహరణ. 'లైక్'ల కోసం జీవితాన్ని పణంగా పెట్టడం అంటే అది ఎంత వెట్టితనమో తెలిసి వచ్చినట్లే కదా! బోగిపండ్లు పోసినంత ఉత్సాహంగా పోసి మరెంతగానో అలా 'వ్యూ' చూసిన వారు అలా ఊరుకుంటారా! గ'మ్మత్తు'గా ఆ యింటికి కన్నం వేసి ఊడ్చుకుపోయారు. ఇంకేముంది ఆ 'యూట్యూబర్' లబోదిబో! నగల పట్ల ఎంత జాగ్రత్తగా ఉండాలో హెచ్చరికగా ఉంటుందనే ఈ కథనం ఇలా! అతివలూ తస్మాత్ జాగ్రత్త.

# ధ్యానంతో సరి !



ఒక్కోసారి ఎంత వద్దనుకున్నా.. ప్రతికూల ఆలోచనలు మనసుని వేధిస్తుంటాయి. అనారోగ్యం.. ఇంట్లోనో ఉద్యోగంలోనో సమస్యలు.. కారణాలు.. ఎక్కువ రోజులు ఇవే ఆలోచనలతో గడపడం మంచిది కాదు.. అందుకే మనసు బాలేనప్పుడు కాస్త

పాజిటివ్ మూడ్‌లోకి రావాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి. నెగెటివ్ థింకింగ్ బాగా ఎక్కువగా ఉన్నప్పుడు మీకు నచ్చిన పాట వినడమో, పాడడమో చేయండి. మనసుకు కాస్త ప్రశాంతత లభిస్తుంది. ఫలితంగా ఆలోచన ధోరణిలో మార్పు వచ్చే అవకాశాలుంటాయి. మీరు ఉన్న ప్రదేశం నుంచి బయటకు వచ్చి కాసేపు అటూఇటూ నడవండి. ఈ సమయంలో మీకు బాగా నచ్చిన అంశాల గురించి ఆలోచించడానికి ప్రాధాన్యత ఇవ్వండి. మీకు బాగా ఇష్టమైన అభిరుచి పైన దృష్టి పెట్టి చూడండి. అసలు ప్రతికూలంగా ఆలోచించే సమయం కూడా ఉండదంటే అతిశయోక్తి కాదేమో! ప్రతి విషయంలోనూ సానుకూలంగా ఆలోచించండి. ఎంత నియంత్రించుకుందామని ప్రయత్నించినా నెగెటివ్ ఆలోచనలు అస్సలు ఆగట్లేదా? అయితే ముందుగా మీ మెదడుకు విశ్రాంతిని ఇవ్వడం చాలా అవసరం.

కాబట్టి కొద్ది నిమిషాల పాటు ధ్యానం లేదా శ్వాస మీద ధ్యాస పెట్టడం ఏర్పాటు చేయండి. ఆ తర్వాత పాజిటివిటీని పెంచే కొటేషన్స్ చదవండి. ప్రసంగాలు వినండి. తప్పకుండా ఫలితం కనిపిస్తుంది. .. వేదించే ఆలోచనల నుంచి బయటకు రావాలంటే మనసు దృష్టిని మళ్లించే మరో పని ఏదో ఒకటి చేయాలి. ఈ ప్రయోజనాలే ఇతరులకు సహాయం చేయడం, సమాజ సేవలో పాల్గొనడం వంటివి చేసి చూడాలి. □

# ఉల్లి రింగులతో..



గుడ్లు: రెండు, ఉల్లిగడ్డ: ఒకటి (పెద్దది), పచ్చిమిర్చి: రెండు, టమాట: ఒకటి (చిన్నది), కారం: అర టీస్పూన్, పసుపు: పావు టీస్పూన్, కొత్తిమీర తురుము: కొద్దిగా, శనగపిండి: ఒక టీస్పూన్, మిరియాల పొడి: పావు టీస్పూన్, ఉప్పు: తగినంత, నూనె: కొద్దిగా

**తయారీ విధానం:** ఉల్లిగడ్డను అడ్డంగా కోసి గుండ్రని రింగులను పక్కన పెట్టి మిగతా ముక్కలను సన్నగా తరగాలి. ఒక గిన్నెలో గుడ్లలోని సొన వేసి, అందులో ఉల్లి తరుగు, సన్నగా తరిగిన పచ్చిమిర్చి, టమాట ముక్కలు, కొత్తిమీర తురుము, శనగపిండి, కారం, మిరియాలపొడి, ఉప్పు, పసుపు వేసి బాగా కలుపుకోవాలి. స్టవ్‌మీద పాన్‌పెట్టి ఒక టేబుల్ స్పూన్ నూనెవేసి వేడయ్యాక ఉల్లి రింగులను ఉంచి వాటి మధ్యలో ఇందాక కలుపుకొన్న గుడ్ల మిశ్రమాన్ని వేయాలి. సన్నని మంటపై రెండువైపులా కాల్చుకుంటే నోరూరించే ఆనియన్ ఎగ్ రింగ్స్ సిద్ధం. □

# తెర

## 'తత్వం'లో నటించడం లక్కీ: దక్షిక



**మీ నేపథ్యం?**
నా పేరు దక్షిక.కె .నా స్వస్థలం వైజాగ్. ఇది నా తొలిసినిమా.. సినిమా హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వాలనే ప్రయత్నంలో ఉన్న టైమ్‌లో ఈ సినిమా అవకావం వచ్చింది. తత్వం.. అడిషన్స చేసి సెలక్ట్ చేశారు. గతంలో నేను హీరో విజయ్ దేవరకొండతో కలిసి ఓ వాణిజ్య ప్రకటనలో నటించాను.

**తత్వంతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వడం ఎలా అనిపిస్తుంది?**
ఫస్ట్ ప్రాజెక్ట్‌లోనే ఓ హీరోయిన్‌కు నటనకు స్కోప్ ఉన్న పాత్ర దొరకడం లక్కీగా ఫీలవుతున్నాను.

**ట్రైలర్ చూస్తే మీ పాత్రలో నెగెటివ్ షేడ్స్ కనిపిస్తున్నాయి?**
నా పాత్రలో గ్రే షేడ్స్ ఉంటుంది. బట్ అందరికి నచ్చే పాత్ర అది. ఇంతకు మించి ఇప్పుడు రివీల్ చేయకూడదు.

**తత్వం చిత్రంలో మీ పాత్ర ఎలా ఉంటుంది?**
సాఫ్ట్ కైండ్ ఆఫ్ గర్ల్.. హీరోకు సపోర్ట్‌కు ఉండే పాత్ర. కిల్లర్‌ను అన్వేషణలో హీరోకు సపోర్ట్ చేస్తూ ఉంటే టపాజిటివ్‌గా ఉండే పాత్ర నాది.

**తత్వం సినిమా ఎలా ఉండబోతుంది.**
జనరల్‌గా మలయాలంలో ఇలాంటి స్టోరీలు వస్తుంటాయి. తెలుగులో కూడా ఇలాంటి కథతో సినిమా రావడం ఆనందంగా అనిపించింది.

**హీరోయిన్ అవ్వాలని ఎందుకు అనుకున్నారు.**
చిన్నప్పటి నుంచి నాకు యాక్టింగ్ ఇష్టం. మూడో తరగతిలోనే నేను నటిని అవుతానని మా టీచర్‌కు చెప్పాను. సినిమా, మోడలింగ్ అంటే ఇష్టం. అమ్మ నాన్న కోరిక మేరకు స్టడీస్ కంప్లీట్ అయిన తరువాత సినిమాలోకి అడుగుపెట్టాను.

**సినిమాల్లోకి వచ్చే ముందు సినిమా ఇండస్ట్రీ గురించి చెప్పిన మాటలు విని భయపడ్డారా?**
వచ్చే ముందు భయపడ్డాను. టెన్షన్ పెడ్డాను. అయితే ఏదైనా మనం మేనేజ్ చేస్తూ ఏ ఫీల్డ్‌లోనైనా ఎదగాలి అని అర్థమయింది..

**హీరో దినేష్ తేజ్ గురించి?**
దినేష్ వెరీ సపోర్టింగ్. యాక్షన్ సీక్వెన్సీలో నాకు బాగా సపోర్ట్ చేశారు. ఆయన పాత్ర ఈ సినిమాలో బాగుంటుంది.

**దర్శకుడు అర్జున్ కోలా గురించి?**
దర్శకుడు అర్జున్ కోలా చాలా సైలెంట్.. ఓ సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తున్నాడు. మూడు నెలలు లీవ్ తీసుకుని ఈ సినిమా చేశాడని తెలిసి ఆశ్చర్యపోయాను.

**ఈ సినిమాలో ఇంకా హైలైట్‌గా ఏమిటి?**
కథ, కథనాలతో పాటు చేతన భరద్వాజ్ సంగీతం ఆర్ఆర్ హైలైట్‌గా ఉంటుంది.

## 'ఆదర్శ కుటుంబం' 'నారాయణమ్మ' పాట విడుదల



నారాయణమ్మ గీతావిష్కరణ దస్పల్లా హోటల్ లో ఘనంగా జరిగింది. చిత్ర బృంద మంతా ఈ వేడుకలో సందడి చేసి, ప్రచార కార్యక్రమా లను ఘనంగా ప్రారంభించింది.ఈ సంద ర్భంగా విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ.. నారాయణ మ్మ సాంగ్ లాంచ్‌కి విచ్చేసిన అభిమానులకు, మీడియా మిత్రులకు ధన్యవాదాలు. దాదాపు 20 ఏళ్ళ తర్వాత త్రివిక్రమ్‌తో కలిసి పని చేయడం సంతోషంగా ఉంది. నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి సినిమాలు క్లాసిక్ లవ్ స్టోరీలు. అలాంటి సినిమాల తర్వాత ఇప్పుడు త్రివిక్రమ్ మరో అద్భుతమైన కథను తీసుకొచ్చారు. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. "ఈరోజు హీరోలు తమన్, రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ వెంకటేష్ ఎ, హీరోయిన్లు. నేను ముందుగా థాంక్స్ చెప్పాల్సింది డింపుల్ గారికి. సాంగ్ షూట్ చేసే సమయానికి ఆమెకి ఒంట్లో బాలేక పోయినా.. ఇష్టపడి, కష్టపడి చేశారు. మీ అందరి లాగే నా ఫేవరెట్ హీరో వెంకటేష్ . నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తల్లో, నేను మొట్ట మొదటిగా పెన్ను పెట్టి రాసిన డైలాగ్ ఆయన సినిమాకే. పవిత్ర బంధం. నా జర్నీ ఆయనతోనే స్టార్ట్ అయింది. సంగీత దర్శకుడు తమన్ ఎస్ మాట్లాడుతూ.. "వెంకటేష్‌తో సినిమా చేయడం అనేది డ్రీమ్ లాంటిది. వెంకటేష్ గారు, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో సినిమా కోసం నేను ఎంతగానో ఎదురు చూశాను. ఇప్పుడు వారి కాంబినేషన్ లో ఆదర్శ కుటుంబం వస్తుండటం, అందులో నేను భాగం కావడం సంతోషంగా ఉంది. నటి శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ.. "చినబాబు, నాగవంశీ గారు నాకు ఈ సినిమాలో నటించే గొప్ప అవకాశాన్ని ఇచ్చారు. నాకు త్రివిక్రమ్ గారి సినిమాలంటే చాలా ఇష్టం. నటి డింపుల్ హయాతి మాట్లాడుతూ.. చాలా కాలం తర్వాత నేను ప్రత్యేక గీతం చేశాను. నా మొదటి పాటకు వెంకటేష్ అతిథిగా విచ్చేశారు.

## 'రిచ్' పూజా కార్యక్రమాలతో ప్రారంభం



బేబీ ఆరాధ్య ఆదర్శ్ సమర్పణలో ఎంజి ఆర్ట్స్, ఐఎఫ్ఎక్స్ స్టూడియోస్ ప్రై.లి బ్యానర్లపై పద్మనాభ రెడ్డి, మార్గం గోపి, మహేంద్ర ఎస్ గైక్వాడ్ కో ప్రొడ్యూసర్‌గా సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం "రిచ్. ఏ బస్తీ బాయ్ లవ్ స్టోరీ అనేది ఉపశీర్షిక. మోహిత్ పెడాడ, శ్రీజిత ఘోష్ జంటగా నటిస్తున్న ఈ మూవీని రాజా నరేంద్ర తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా పూజా కార్యక్రమాన్ని ..నిర్మాత పద్మనాభ రెడ్డి మాట్లాడుతూ.. .. రాజా నరేంద్ర రిచ్ కథను చాలా రిచ్‌గా చెప్పారు. ఆ తర్వాత ఈ కథలోకి గోపీ వచ్చారు. సాయి కార్తీక్ ఆ తర్వాత జాయిన్ అయ్యారు. మోహిత్, శ్రీజిత ఘోష్ యాడ్ చేశారు. వచ్చే నెలలో ఈ మూవీ షూటింగ్ ప్రారంభం కానుంది. వీలైనంత త్వరగానే ఈ చిత్రాన్ని ఆడియెన్స్ ముందుకు తీసుకు వచ్చేందుకు ప్రయత్నం చేస్తామ్మని అన్నారు...హీరో మోహిత్ పెడాడా మాట్లాడుతూ.. .. మా రిచ్ లాంటి మంచి కథకు మంచి నిర్మాతలు దొరికారు. రాజా గారు అద్భుతంగా కథను రాసుకున్నారు. ఇంటర్వెల్ నెక్స్ట్ లెవెల్లో ఉంటుంది. క్లైమాక్స్‌కి గూస్ బంప్స్ వస్తుంది. యాక్టింగ్ చేస్తూ రాజా గారు కథను అద్భుతంగా నెరేట్ చేశారు...నిర్మాత మార్గం గోపి మాట్లాడుతూ.. మా 'రిచ్' సినిమాని ఈ రోజు ప్రారంభించాం. పద్మనాభ రెడ్డితో కలిసి ఈ మూవీని నిర్మిస్తున్నాం. దర్శకుడు రాజా నరేంద్ర మాట్లాడుతూ.. .. మా రిచ్ ప్రారంభోత్సవానికి వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. సహ నిర్మాత మహేంద్ర గైక్వాడ్ మాట్లాడుతూ.. .నాకు తెలుగు అంతగా రాదు. రిచ్ మూవీని హిందీలోనూ రిలీజ్ చేస్తాం.నటి పూజా కేంద్రే మాట్లాడుతూ.. .. రిచ్ చిత్రంలో నాకు మంచి రోల్ ఇచ్చారు. ఆద్యంత నవ్విస్తూనే ఉంటాను.

## 'ఓ అందాల రాక్షసీ' హీరో షిరాజ్ మెహదీ



తెలుగు చిత్ర పరిశ్రమలో చిన్న సినిమాల పట్ల వివక్ష తీవ్రస్థాయికి చేరిందని, కష్టపడి నిర్మించిన చిత్రాలకు థియేటర్లు ఇవ్వకుండా ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లను నాశనం చేస్తున్నారని ఓ అందాల రాక్షసీ మూవీ మేకర్, హీరో షిరాజ్ మెహదీ తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'క్యూబ్, యుఎఫ్ ఒలు దోపిడీ చేస్తున్నాయి".. సెన్సార్ నిబంధనలు, ఏడీసీసీ ప్రాసెస్ పేరుతో చిన్న నిర్మాతల నుండి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారని షిరాజ్ ఆరోపించారు. క్యూబ్, యుఎఫ్ఒ డిజిటల్ ప్రొవైడర్లు వారానికి రూ. 2,000లో చేసే పనికి ప్రతి థియేటర్ నుండి రూ. 10 వేల నుండి ..12 వేల వరకు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడు తున్నారని మండిపడ్డారు. ఫిల్మ్ ఛాంబర్ తీరుపై మండిపాటు.. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ చిన్న ప్రొడ్యూసర్లకు, డైరెక్టర్లకు అండగా నిలవకపోగా, నల్లుల లాగా నలిపే స్తోందని ధ్వజమెత్తారు. ఐనాక్స్, పివిఆర్, ఏషియన్ ఫిల్మ్స్ వంటి ప్రముఖ మల్టీప్లెక్స్ కాంప్లెక్స్‌లు మొదట థియేటర్లు ఇస్తామని చెప్పి, చివర్లో హ్యాండ్ ఇచ్చారని, దీనిపై చట్టపరంగా నోటీసులు ఇచ్చామని, హైకోర్టు నుండి సమన్లు కూడా వెళ్లాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి.. సినిమా పరిశ్రమలో సాగుతున్న ఈ మాఫియా పోకడలపై తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించాలని, చిన్న సినిమాలకు తగిన రక్షణ కల్పించాలని వేడుకున్నారు.

## నవంబరు 21న '3.0' సంగీత కచేరీ..




హైదరాబాద్, సెప్టెంబర్ 28, 2026:.. ప్రముఖ గాయని ..కేఎస్ చిత్ర.. మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఆమె ప్రతిష్మాత్మక ..సంగీత కచేరీ"చిత్రామృతం 3.0 నవంబర్ 21న.. హైదరాబాద్‌లోని ..నెక్సస్ మాల్ సమీపంలోని నెక్సస్ మాల్ గ్రౌండ్స్‌లో.. జరగనుంది.జోరా మరియు ఎన్ చాట్ మీడియా ఆధ్వర్యంలో ఈ కచేరీ నిర్వహించను న్నారు. హైదరాబాద్‌లో కేఎస్ చిత్ర గారు నిర్వహిస్తున్న ..అతిపెద్ద కచేరీ అని నిర్వాహకులు తెలిపారు. సుమారు 10,000 మంది ప్రేక్షకులు.. ఈ కార్యక్రమానికి హాజరవుతారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ..కేఎస్ చిత్ర .. పాల్గొని, తన సంగీత ప్రయాణం, హైదరాబాద్‌తో తనకున్న అనుబంధం, రాబోయే కచేరీ విశేషాలను మీడియాతో పంచుకున్నారు

## 'అనకాపల్లి' పెద్ద హిట్ అవ్వాలి: వి. వి. వినాయక్



వి.వి. మాట్లాడుతూ లగడపాటి శ్రీధర్‌కి మా అందరికంటే సినిమా పిచ్చి ఎక్కువగా ఉంటుంది. ఆయనకి సినిమా పట్ల ఉన్న ప్యాషన్ గురించి నాకు తెలుసు. విక్రమ్ పెద్ద హీరో అయి శ్రీధర్ కోరికని నెరవేర్చుతాడు. మైత్రి రవి మాట్లాడుతూ.. లగడపాటి శ్రీధర్ మాకు మంచి మిత్రులు. విక్రమ్ పెద్ద హీరో అవ్వాలని కోరుకుంటు న్నాను. తారక్ తన పర్ఫామెన్స్‌తో అందరినీ భయపెడుతున్నాడు. ఈ చిత్రంలో పని చేసిన ప్రతీ ఒక్కరికీ ఆల్ ది బెస్ట్. శ్రీధర్ అన్న ఇంత త్వరగా హీరోని చేస్తాడని అనుకోలేదు. శివ నిర్వాణ మాట్లాడుతూ.. అనకాపల్లితో నాకు మంచి ఎమోషన్ ఉంది. నేను అక్కడే డిగ్రీ చదివాను. నేను కూడా అనకాపల్లి ఎమోషన్ మీద కథ రాయాలని అనుకున్నా. కానీ త్రినాథ్ గారు నాకు ఆ అవకాశం ఇవ్వలేదు."అనకాపల్లి చిత్రంతో త్రినాథ్ రావు గారు ప్రయోగం చేశారు. ఇకపై నటుడిగానూ త్రినాథ్ బిజీగా అవుతారని ఆశిస్తున్నాను. సాయి రాజేష్ మాట్లాడుతూ.. .. త్రినాథరావు నిర్మాత, నటిస్తున్నాడు అని తెలియడంతో ఆశ్చర్యపోయాను. ట్రైలర్‌లో ఆయన అద్భుతంగా కనిపించారు. నాయుడు గారు ఇంకా ఇలానే మంచి సినిమాల్ని చేయాలని కోరుకుంటున్నాను. నాకు శ్రీధర్ అంటే చాలా ఇష్టం. ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ.. త్రినాథరావు ఆలోచనకు రూపమే"అనకాపల్లి. ఈ మూవీని ఆల్రెడీ నేను చూశాను. విక్రమ్ సహిదేవ్ మాట్లాడుతూ.. అనకాపల్లి ఈవెంట్‌కి వచ్చిన మా అతిథులు వినాయక్ గారు, శివ నిర్వాణ , మైత్రి రవి, సాయి రాజేష్ , ఆర్పీ పట్నాయక్ ఇలా అందరికీ థాంక్స్.

## 'స్లమ్ డాగ్' జరీనా వహాబ్ టచ్చింగ్ గ్లింప్స్ రిలీజ్




డైనమిక్ ఫిల్మ్‌మేకర్ పూరి జగన్నాథ్, వెర్సటైల్ హీరో విజయ్ సేతుపతి పాన్ ఇండియా యాక్షన్ డ్రామా 'స్లమ్ డాగ్: 33 టెంపుల్ రోడ్'. ఈ చిత్రం ప్రమోషనల్ మెటీరియల్ ఇప్పటికే సంచలనం సృష్టించింది. పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ తమ పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై జేబీ నారాయణరావు కొండ్రోల్లా జేబీ మోషన్ పిక్చర్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని గ్రాండ్ రూపొందిస్తున్నారు. ఇందులో టబు పవర్ ఫుల్ పోలీస్ అధికారిణి పాత్రను పోషిస్తున్నారు. తాజాగా చిత్ర బృందం హార్ట్ టచింగ్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఇందులో విజయ్ సేతుపతి అమ్మ జుబైదాగా జరీనా వహాబ్ పాత్రను పరిచయం చేశారు. తన జీవితంలో ఎదురైన అత్యంత బాధాకరమైన సంఘటనను జుబైదా గుర్తుచేసుకునే ఎమోష నల్ ఎపిసోడ్‌ను ఈ గ్లింప్స్‌లో చూపించారు. ఒక బిచ్చగాడి జీవితం లో ఎదురయ్యే కఠినమైన, బయట ప్రపంచానికి పెద్దగా తెలియని వాస్తవాలను ఈ సన్నివేశం ఆవిష్కరిస్తుంది. అదే సమయంలో సినిమా కథలోని ప్రధాన భావోద్వేగాన్ని కూడా పరిచయం చేస్తుంది

# ఆసియా క్రీడలు..

## పరుగులో పరుల్‌కు కాంస్యం

### హార్డిల్స్‌లో విద్యకు కాంస్యం

**నగోయా:** ఆసియా క్రీడల మహిళల పరుగు, హార్డిల్స్‌లో వ్యక్తిగత విభాగాల్లో భారత క్రీడాకారిణిలు పరుల్ చౌదరి, విద్యా రామరాజ్‌కు కాంస్య పతకాలు దక్కాయి. సోమవారం జరిగిన మహిళల 5000 మీటర్ల ఫైనల్‌లో పరుల్ 15:14.61 సమయంతో మూడో స్థానంలో నిలిచి, ఆసియా క్రీడల్లో తన రెండో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది.







హోరాహోరీ పోరులో పరుల్ తన రేసును సరైన సమయంలో పూర్తిచేసి, చివరి దశలలో వేగంగా దూసుకెళ్లి కజకిస్తాన్‌కు చెందిన నోరా తనుయిని అధిగమించి మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది. అలాగే భారత హార్డిల్స్ క్రీడాకారిణి విద్యా రామ్‌రాజ్ సోమవారం మహిళల 400 మీటర్ల హార్డిల్స్‌లో కాంస్యం గెలుచుకుంది. ఫైనల్‌లో విద్యా 54.75 సెకన్ల వ్యక్తిగత అత్యుత్తమ సమయాన్ని నమోదు చేసి మూడవ స్థానంలో నిలిచింది. ఈ కాంస్య పతకంతో రామ్‌రాజ్ ఈ ఈవెంట్‌లో వరుసగా రెండవ ఆసియా క్రీడల పతకాన్ని సాధించింది. ఆమె తన మునుపటి వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన అయిన 55.42 సెకన్ల కంటే తన ప్రదర్శనను గణనీయంగా మెరుగుపరుచుకుంది.

## గుల్వీర్‌కు రజతం




**నాగోయా:** భారత క్రీడాకారుడు గుల్వీర్ సింగ్, 10,000 మీటర్ల ఈవెంట్‌లో రన్నరప్‌గా నిలిచిన తర్వాత, సోమవారం జరిగిన పురుషుల 1500 మీటర్ల ఫైనల్‌లో రెండవ స్థానంలో నిలిచి, ఆసియా గేమ్స్ 2026లో తన పతకాల ఖాతాలో మరో రజత పతకాన్ని చేర్చుకున్నాడు. మరోవైపు, పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో అవినాష్ సేబుల్ నాలుగవ స్థానంలో నిలిచి, పతకాన్ని తృటిలో కోల్పోయాడు. 1500 మీటర్ల ఫైనల్‌లో గుల్వీర్ 3:36.72 సెకన్ల వ్యక్తిగత అత్యుత్తమ సమయాన్ని నమోదు చేసి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అతను జపాన్‌కు చెందిన కజుటో ఇజావా, నగియా మోరీల మధ్య స్థానంలో నిలిచాడు. ఇజావా 3:36.35 సెకన్ల ఆసియా క్రీడల రికార్డు సమయంలో స్వర్ణం సాధించగా, భారత క్రీడాకారుడి కంటే కేవలం 0.37 సెకన్లు ముందున్నాడు. కాగా, మోరీ 3:37.92 సెకన్లతో కాంస్యం గెలుచుకున్నాడు.

పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్ ఫైనల్‌లో, సేబుల్ ఈ సీజన్‌లో తన అత్యుత్తమ సమయం 8:21.67 సెకన్లను నమోదు చేసినప్పటికీ, 4.31 సెకన్ల తేడాతో పతకాన్ని కోల్పోయి నాలుగో స్థానంలో నిలిచాడు.







## అఫ్ఘాన్, హాంకాంగ్‌లతో

# మ్యాచ్‌లు రద్దు

### ర్యాంకింగ్స్‌తో సెమీస్‌కు టీమిండియా, పాక్

**నిషిన్:** జపాన్‌లోని ఐచినగోయా వేదికగా జరుగుతున్న 2026 ఆసియా క్రీడల్లో భాగంగా జరగాల్సిన మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. దీంతో ఐసీసీ ర్యాంకింగ్స్ ఆధారంగా టీమిండియా, పాకిస్తాన్ జట్లు నేరుగా సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి. జపాన్‌లోని నిషిన్ నగరంలో సోమవారం భారత్–అఫ్ఘనిస్తాన్ పాకిస్తాన్–హాంగ్‌కాంగ్ జట్ల మధ్య తొలి క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ జరగాల్సి ఉంది.

అయితే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా కనీసం టాస్ కూడా పడకుండానే ఈ రెండు మ్యాచ్‌లూ పూర్తిగా రద్దయ్యాయి. సోమవారం నాటి మ్యాచ్‌లలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం, తడిసిన ఔట్ ఫీల్డ్ కారణంగా కనీసం టాస్ వేసేందుకు కూడా పరిస్థితులు అనుకూలించలేదు. అధికారులు పలు దఫాలు పరిస్థితిని పరిశీలించినా, ఆట మొదలయ్యే అవకాశం కనిపించలేదు. చివరకు టాస్ లేకుండానే మ్యాచ్‌లకు ముగింపు పలికారు. కాగా గత ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియా, ఈ సారి కూడా పసిడి పతకమే లక్ష్యంగా బరిలోకి దిగింది. అయితే స్టేడియంలో ఒక్క బంతి పడకుండానే మ్యాచ్ రద్దయినా నిబంధనల ప్రకారం భారత్, పాకిస్తాన్‌లు టోర్నీలో ముందడుగు వేశాయి.

ఆసియా క్రీడల నిబంధనల ప్రకారం వర్షం వల్ల మ్యాచ్ రద్దయితే రిజర్వ్ డే లేకపోవడంతో ఉన్నత ర్యాంకింగ్ ఉన్న జట్టుకే విజయం దక్కుతుంది. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ లో భారత జట్టు 17480 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, పాకిస్తాన్ 13679 పాయింట్లతో 6వ స్థానంలోను, అఫ్ఘనిస్తాన్ 8925 పాయింట్లతో 10వ స్థానంలో, హాంకాంగ్ 6634 పాయింట్లతో 24వ స్థానంలో ఉన్నాయి.

కాగా భారత్, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్స్ ఆడే అవకాశం పొందాయి. దీంతో సెమీఫైనల్లో భారత్ ఎవరితో తలపడనుందనేది ఆసక్తికరంగా మారింది. అక్టోబర్ 1న జరగనున్న రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో శ్రీలంక, నేపాల్ మధ్య జరిగే మూడో క్వార్టర్ ఫైనల్ విజేతతో భారత్ తలపడనుంది. మరోవైపు హాంగ్‌కాంగ్‌తో మ్యాచ్ వర్షంతో రద్దవ్వడంతో ఇప్పటికే సెమీస్ చేరిన పాకిస్తాన్, అక్టోబర్ 1న బంగ్లాదేశ్ లేదా మలేషియాతో మొదటి సెమీఫైనల్లో పోరాడనుంది.

## కుస్తీలో పింకీకి కాంస్యం

**నగోయా:** సెమీఫైనల్‌లో దక్షిణ కొరియాకు చెందిన మో సుమిన్ చేతిలో ఓటమి పాలైన పింకీ ఆసియా క్రీడల్లో బల్హారా కురాష్ (కుస్తీ) విభాగంలో కాంస్యం గెలుచుకుంది. సోమవారం జరిగిన మహిళల 78 కేజీల కురాష్ ఈవెంట్‌లో పింకీ సెమీఫైనల్‌లో ఈ పతకాన్ని దక్కించుకుంది. 2018 ఆసియా క్రీడల రజత పతక విజేత సుమిన్ చేతిలో 0-5 తేడాతో ఓడిపోయింది. అంతకు



ముందు క్వార్టర్ ఫైనల్‌లో దక్షిణ కొరియాకు చెందిన లిమ్ గరమ్‌ను 3-0 తేడాతో ఓడించిని పింకీ భారత్‌కు పతకాన్ని ఖాయం చేసింది. సెమీఫైనల్ సమయంలో బల్హారాకు ఒక దక్కీ (అంటే రెండు హెచ్చరికలు) అందాయి. ఆ తర్వాత సుమిన్ స్కోర్ చేసి, ఆపై ఒక యోన్ బోష్ (అంటే పూర్తి పాయింట్)ను జోడించి, 5-0 విజయాన్ని పూర్తి చేసింది. క్వార్టర్ ఫైనల్‌లో, బల్హారా లిమ్‌పై చాలా స్కోర్ చేయగా, కొరియా క్రీడాకారిణి టాన్‌బెక్ హెచ్చరికను అందుకుంది. కురాష్‌లో భారత్‌కు తొలిరోజు కష్టంగా గడిచింది. పురుషుల +90 కేజీల క్వార్టర్ ఫైనల్‌లో విశాల్, థాయ్‌లాండ్‌కు చెందిన కునతిప్ యేఆన్ చేతిలో 0-5 తేడాతో ఓడిపోయాడు. అలాగే, మహిళల 57 కేజీల రౌండ్ ఆఫ్ 32 బౌట్‌లో సంగీతా బల్హారా, ఫిలిప్పీన్స్‌కు చెందిన చార్మియా క్వెలినో చేతిలో 0-10 తేడాతో ఓటమి పాలైంది. మరోవైపు, రౌండ్ ఆఫ్ 16లో భారతి, ఇరాన్‌కు చెందిన తహెరే అజర్‌పెయివాండ్ చేతిలో పరాజయం పాలైంది. పురుషుల +90 కేజీల రౌండ్ ఆఫ్ 16 బౌట్‌లో యశ్ కుమార్ చౌహాన్, తజికిస్తాన్‌కు చెందిన షకర్మద్ మిర్మామదోవ్ చేతిలో 0-10 తేడాతో ఓడిపోయాడు.



### బాక్సింగ్‌లో అద్భుత విజయంతో

## లవ్లీనాకు పతకం ఖాయం

**నిషియో:** నిషియో జిమ్నాసియంలో సోమవారం జరిగిన మహిళల 75 కేజీల క్వార్టర్ ఫైనల్‌లో దక్షిణ కొరియాకు చెందిన సియోంగ్ సుయోన్‌ను 5-0 తేడాతో ఓడించిన భారత క్రీడాకారిణి లవ్లీనా బోర్గోహైన్, వరుసగా రెండో ఆసియా క్రీడల బాక్సింగ్ పతకాన్ని ఖాయం చేసుకుంది. 2023 హాంగ్‌జౌ గేమ్స్ రజత పతక విజేత సమర్థవంతంగా ఎదురుదాడులతో మొదటి రౌండ్ నుంచే పోటీని తన నియంత్రణలోకి తీసుకుంది.

ఆమె మొదటి రౌండ్‌ను ఏకగ్రీవంగా గెలుచుకుని, రెండవ రౌండ్‌లో కూడా ఆటను తన అదుపులోనే ఉంచుకుంది. ఫైనల్ రౌండ్‌లో బోర్గోహైన్ ఒత్తిడిని కొనసాగించి కొరియా క్రీడాకారిణిపై శక్తివంతమైన కాంబినేషన్‌లను ప్రయోగించింది. ఐదుగురు న్యాయనిర్ణేతలు ఈ బౌట్‌లో లౌవ్లీనాకు అనుకూలంగా 3027 స్కోరు ఇచ్చారు. దీంతో ఆమె సెమీఫైనల్స్‌లో స్థానం ఖరారై, కనీసం కాంస్య పతకం ఖాయమైంది. అలాగే పురుషుల 80 కేజీల విభాగంలో తజికిస్థాన్‌కు చెందిన నెక్రూజ్ సాలిమోవ్‌పై 5-0తో ఏకగ్రీవ నిర్ణయంతో అంకుష్ పంఘల్ భారత్‌కు పతకాన్ని ఖాయం చేశాడు. మహిళల 65 కేజీల విభాగంలో, పర్వీన్ హూడా ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నవబఖోర్ ఖమిడోవాను 5-0 తేడాతో ఓడించి సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది.

## షూటింగ్‌లో ఈషాకు రజతం

**టయోటా:** ఆసియా గేమ్స్ 2026 మహిళల 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత ఈవెంట్‌లో రజత పతకం గెలిచి ఈషా సింగ్ భారత్‌కు పతకాన్ని అందించింది. సోమవారం జరిగిన ఈవెంట్ క్వాలిఫికేషన్‌లో 580 పాయింట్లు, 22 బుల్‌సైలతో ఎనిమిదో స్థానంలో నిలిచిన ఈషా, 580 పాయింట్లు సాధించి 20న చేసిన చైనీస్ తైపీకి చెందిన యెన్‌చింగ్ చెంగ్‌ను అధిగమించి వ్యక్తిగత ఫైనల్‌లోకి ప్రవేశించింది. ఫైనల్‌లో, ఈషా పలు షూట్‌ఆఫ్‌ల ద్వారా పోరాడి, చివరకు 38 హిట్‌లతో చైనాకు చెందిన జియావో



జియారుయి జువాన్‌తో సమంగా నిలిచింది. నిర్ణయాత్మక షూట్ ఆఫ్‌లో జియావో గెలుపొందడంతో, ఈషా రజత పతకంతో సరిపెట్టుకోవలసి వచ్చింది. కాగా ఈషా, డబుల్ ఒలింపిక్ పతక విజేత మను భాకర్, ఆసియా క్రీడల రజత పతక విజేత రాహి సర్నోబత్‌లతో కూడిన భారత జట్టు 1727-56న సంయుక్త స్కోరుతో ముగించింది. ప్రెసిషన్ దశ తర్వాత, చైనా కంటే కేవలం ఒక పాయింట్ వెనుకబడి ఉన్నప్పుడు, టీమ్ ఈవెంట్ ప్రారంభంలో భారత్‌కు ఆశాజనకంగా కనిపించింది. అయితే, ప్రారంభ ర్యాపిడ్ సిరీస్‌లో రాహి తడబడగా, ఈషా, మను బలమైన స్కోర్లు సాధించారు.

ఆ తర్వాత జరిగిన సిరీస్‌లలో మెరుగ్గా ఆడి రాహి కోలుకున్నప్పటికీ, ఆరంభంలో ఎదురైన ఎదురుదెబ్బ భారీ మూల్యం చెల్లించేలా చేసింది. దీంతో టీమ్ ఈవెంట్‌లో పతకం లేకుండానే ముగిశాయి.

# ఇన్వెస్టర్ల సంపద రూ.8లక్షల కోట్లు ఆవిరి

## భారీ నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి,సెప్టెంబరు 28:** ఇరాన్–అమెరికా మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరగడం, సరఫరా అంతరాయాలు సుదీర్ఘమయ్యే అవకాశాలపై ఆందోళనలు దేశీయ స్టాక్ మార్కెట్లను తీవ్రంగా దెబ్బతీశాయి. దీనికి తోడు అమెరికా ట్రెజరీ రిటర్నులు పెరగడం, రూపాయి బలహీనపడటం, విదేశీ పెట్టుబడిదారులు వరుసగా పెట్టుబడులు ఉపసంహరించుకోవడం, ఆసియా మార్కెట్లలో ప్రతికూల సంకేతాలు మార్కెట్లపై ఒత్తిడిని మరింత పెంచాయి. ఒక్కసారిగా బిఎస్ఇలో ఇన్వెస్టర్ల సంపద ఎనిమిది లక్షలకోట్లు ఆవిరికాగా బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.474 లక్షల కోట్లకు పడిపోయింది. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 107 డాలర్లకు చేరువ కావడం, అమెరికా 10 ఏళ్ల ట్రెజరీ ఈల్డ్ 5.2 శాతాన్ని దాటడం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా నిఫ్టీ 22,800 స్థాయి దిగువన ముగిసింది. అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగియగా బ్యాంకింగ్, రియల్టీ, మెటల్ షేర్లలో భారీ అమ్మకాలు నమోదయ్యాయి.బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 1,124 పాయింట్లు నష్టపోయి 72,771.72వద్ద ముగిసింది. నిఫ్టీ50 సూచీ 360.25 పాయింట్లు క్షీణించి 22,780.25 వద్ద స్థిరపడింది.నిఫ్టీని ప్రధానంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు దిగజార్చాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.32 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.25 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.87 శాతం నష్టపోయాయి.బీఎస్ఈ మిడ్‌క్యాప్ 150 సూచీ, బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 250సూచీలు చెరో 1.62 శాతం క్షీణించాయి. బీఎస్ఈలో మొత్తం 1,271 షేర్లు లాభపడగా 3,218 షేర్లు నష్టపోయాయి. మరో 245 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. కమోడిటీ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ నవంబర్ 2026 ఫ్యూచర్స్ ధర 3.54 డాలర్లు శాతం పెరిగి బ్యారెల్‌కు 100.98 డాలర్లకు చేరింది. అమెరికా 10 ఏళ్ల బాండ్ 0.93 శాతం పెరిగి 5.235 శాతానికి చేరింది. భారత్ 10 ఏళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ కూడా 7.120 శాతం నుంచి 7.177 శాతానికి పెరిగింది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే తగ్గింది. రూపాయి మారకం 96.0100 వద్ద ట్రేడవుతోంది. గత సెషన్‌లో ఇది 95.7500 వద్ద ముగిసింది.ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 సెటిల్‌మెంట్ బంగారం ఫ్యూచర్స్ 2.14 శాతం తగ్గి రూ.1,47,490కు చేరాయి. నిఫ్టీ బ్యాంక్ సూచీ 1.99 శాతం క్షీణించి 54,471.65 వద్ద ముగిసింది.యెస్ బ్యాంక్ 5.87 శాతం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 4.69 శాతం, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ 3.88 శాతం, కెనరా బ్యాంక్ 3.47 శాతం, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 3.43 శాతం, బ్యాంక్ ఆఫ్ బరోడా 3.30 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.25 శాతం, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 2.23 శాతం, ఎస్‌బీఐ 2.14 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.87 శాతం నష్టపోయాయి. అయితే ఫెడరల్ బ్యాంక్ 0.93 శాతం లాభపడింది. సోమ్ డిస్టిలరీస్ అండ్ బ్రూవరీస్ 9.20 శాతం పెరిగింది.లుపిన్ 1.43 శాతం తగ్గింది.సిల్వర్ టచ్ టెక్నాలజీస్ 0.40 శాతం లాభపడింది. కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్: 0.95 శాతం క్షీణించింది.జ్యోతి సిఎన్‌సి ఆటోమేషన్: 1.98 శాతం పడిపోయింది.

## ఆగస్టులో పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి 8%

### తయారీ, విద్యుత్ రంగాల దూకుడుతో 60 బేసిస్ పాయింట్లు పెరుగుదల



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** దేశ పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి ఆగస్టు నెలలో 8 శాతానికి వేగం పుంజుకుంది. జూలైలో నమోదైన సవరించిన 7.4 శాతం వృద్ధితో పోలిస్తే ఇది 60 బేసిస్ పాయింట్ల అధికం. తయారీ, విద్యుత్ రంగాల పనితీరు మెరుగుపడటం ఇందుకు ప్రధాన కారణమని సోమవారం విడుదల చేసిన జాతీయ గణాంకాల కార్యాలయం గణాంకాలు వెల్లడించాయి.ఆగస్టు పారిశ్రామిక ఉత్పత్తి సూచీ 123.3గా నమోదైంది. జూలైలో ఇది 125.6గా ఉండగా, గత ఏడాది ఆగస్టులో 114.2గా ఉంది. 29 నెలల్లో ఇది రెండో అత్యధిక పారిశ్రామిక వృద్ధి. జూన్‌లో 8.8 శాతం వృద్ధి నమోదైంది.తయారీ రంగంలో 9 శాతం వృద్ధి ఐఐపీ సూచీలో సుమారు 76 శాతం వాటా కలిగిన తయారీ రంగం వృద్ధి జూలైలోని సవరించిన 8.2 శాతం నుంచి ఆగస్టులో 9 శాతానికి పెరిగింది. 29 నెలల్లో ఇది ఈ రంగానికి రెండో అత్యధిక వృద్ధి.

## లక్ష కోట్ల విలువైన బాండ్ల విక్రయం: ఆర్బీఐ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 28:** దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో అధికంగా ఉన్న నగదు లభ్యతను తగ్గించేందుకు రిజర్వుబ్యాంకు భారీగా ప్రభుత్వ బాండ్లనువిక్రయిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు దాదాపు రూ.1లక్ష కోట్ల విలువైన బాండ్లను నికరంగా విక్రయించినట్లు ట్రెజరీ అధికారులు తెలిపారు. గత దశాబ్దానికి పైగా కాలంలో ఒక ఆర్థికసంవత్సరంలో నమోదైన అత్యధిక నికర బాండ్ విక్రయాలు ఇవేనని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. డిసెంబర్ నాటికి ఈ మొత్తం మరో రూ 1లక్ష కోట్లు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.ప్రత్యేక విండో ద్వారాబ్యాంకులు డాలర్లను సమీకరించుకునేందుకు ఆర్‌బీఐ అనుమతించడంతో బ్యాంకింగ్ వ్యవస్థలోకి భారీగా రూపాయి లిక్విడిటీ వచ్చింది. ఇది దేశ విదేశీ మారక నిల్వలకు మద్దతుతోపాటు చమురు ధరలు పెరిగిన సమయంలో రూపాయికి కొంత ఊరటనిచ్చింది.అయితే అధిక లిక్విడిటీ కారణంగా ఓవర్‌నైట్ వడ్డీరేట్లు ఆర్‌బీఐపాలసీ రేటు కంటే దిగువకు పడిపోయాయి.

## ఐపిఒల జోరు..మనీవ్యూ ఇష్యూకు 98.44 రెట్లు సబ్‌స్క్రిప్షన్




**ముంబయి, సెప్టెంబరు 28:** ప్రాథమిక మార్కెట్‌లో [illegible] కంపెనీల ఐపీఓలకు ఇన్వెస్టర్ల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. స్టాక్ ఎక్స్ఛేంజీల వద్ద నమోదైన వివరాల ప్రకారం మనీవ్యూ ఐపీఓకు భారీగా స్పందన లభించగా, ఏవన్ స్టీల్స్ ఇండియా, ఓరియంట్ కేబుల్స్, జర్మన్ గ్రీన్ స్టీల్ అండ్ పవర్ ఇష్యూలు కూడా బలమైన సబ్‌స్క్రిప్షన్‌ను నమోదు చేశాయి.షా ఇన్వెస్టర్స్ హోమ్‌షా ఇన్వెస్టర్స్ హోమ్ ఐపీఓకు 37,79,440 షేర్లకు గాను 11,72,320 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఇష్యూ 0.31 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. షేర్ ధరల శ్రేణిని రూ.159-167గా నిర్ణయించారు. కనీసం 85 షేర్లకు, ఆ తర్వాత అదే గుణితాల్లో బిడ్ చేయాల్సి ఉంటుంది.ఎస్ఆర్ఐటీ ఇండియాఎస్ఆర్ఐటీ ఇండియా ఐపీఓకు 1,17,60,000 షేర్లు ఆఫర్ చేయగా 1,17,17,925 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఇష్యూ 1 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ధరల శ్రేణి రూ.123-130గా ఉంది. కనీసం 115 షేర్లకు బిడ్ చేయాలి.ఏవన్ స్టీల్స్ ఇండియాఏవన్ స్టీల్స్ ఇండియా 73,84,934 షేర్లకు గాను ఏకంగా 8,55,60,909 షేర్లకు బిడ్లు వచ్చి11.59 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఐపీఓ ధరల శ్రేణి రూ.385-405గా ఉంది. కనీసం 37 షేర్లకు బిడ్ చేయాలి. మనీవ్యూమనీవ్యూ ఐపీఓలో 23,25,24,175 షేర్లకు గాను 22,88,93,42,070 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఇష్యూ 98.44 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ధరల శ్రేణి రూ.32-34గా నిర్ణయించారు. కనీసం 441 షేర్లకు, ఆ తర్వాత అదే గుణితాల్లో బిడ్ చేయాల్సి ఉంటుంది. ఎస్‌వెక్టర్ ఐపీఓకు 7,42,29,166 షేర్లు ఆఫర్ చేయగా 8,33,05,404 షేర్లకు బిడ్లు వచ్చాయి. ధరల శ్రేణి రూ.30-32గా ఉంది. రన్‌వాల్ ఎంటర్‌ప్రైజెస్ ఐపీఓకు 1,21,11,294 షేర్లకుగాను 85,16,837 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఇష్యూ 0.70 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ధరల శ్రేణి రూ.290-305గా ఉంది. జర్మన్ గ్రీన్ స్టీల్ అండ్ పవర్ ఐపీఓకు 1,60,62,879 షేర్లకు గాను 8,25,13,478 షేర్లకు బిడ్లు వచ్చాయి. ధరల శ్రేణి రూ.132-139గా ఉంది. ఓరియంట్ కేబుల్స్ (ఇండియా) ఐపీఓకు 1,49,76,743 షేర్లు ఆఫర్ చేయగా 12,29,17,355 షేర్లకు బిడ్లు వచ్చాయి. దీంతో ఇష్యూ 8.21 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ధరల శ్రేణి రూ.258-272గా ఉంది.

# టాటాసన్స్ లిస్టింగ్‌కు టాటాట్రస్ట్‌నో..



**ముంబయి, సెప్టెంబరు 28:** టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్‌ను పబ్లిక్ లిస్టింగ్ నుంచి తప్పించేందుకు టాటా ట్రస్టులు పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనను ముందుకు తెచ్చాయి. టాటా సన్స్‌లో 66 శాతం వాటా కలిగిన టాటా ట్రస్టులు టాటా ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్ సొల్యూషన్స్, టాటా కన్సల్టింగ్ ఇంజినీర్స్ సంస్థలను టాటా సన్స్‌లో విలీనం చేయాలని ప్రతిపాదించాయి.ఈ విలీనం పూర్తయితే పునర్వ్యవస్థీకరించిన టాటా సన్స్ నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ లేదా కోర్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీగా పరిగణించాల్సిన నియంత్రణ ప్రమాణాలకు లోబడి ఉండదని టాటా ట్రస్టులు చెపుతున్నాయి. దీంతో టాటా సన్స్‌ను లిస్టెడ్ కంపెనీగా మార్చాల్సిన అవసరం లేకుండా, అన్‌లిస్టెడ్ ప్రైవేట్ కంపెనీగా కొనసాగించే అవకాశం ఏర్పడుతుందనిభావన.ఈ ప్రతిపాదనను టాటా సన్స్ బోర్డు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని టాటా ట్రస్టులు కోరాయి. ముఖ్యంగా విలీనానికి ముందు ఆర్బీఐ నుంచి ఎన్వోసీ పొందాలని సూచించాయి. ఆర్‌బీఐ టాటా సన్స్‌ను అప్పర్ లేయర్ ఎన్‌బిఎఫ్‌సిగా వర్గీకరించింది. ఈ హోదా కారణంగా నియంత్రణ నిబంధనల ప్రకారం కంపెనీ లిస్టింగ్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే టాటా సన్స్ ఎన్‌బిఎఫ్‌సి వ్యవస్థ నుంచి బయటకు రావాలని ఆర్‌బీఐని కోరినా ఆ అభ్యర్థనను తిరస్కరించడంతో లిస్టింగ్ అంశం మరోసారి కీలకంగా మారింది.ఈ నేపథ్యంలో టాటా ట్రస్టులు తాజా పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనను తీసుకొచ్చాయి. 2026 మార్చి 31 నాటికి ప్రతిపాదిత విలీన సంస్థకు మొత్తం రూ.1,05,043 కోట్ల ఆపరేటింగ్ ఆదాయం ఉండేదని టాటా ట్రస్టుల ప్రతిపాదన పేర్కొంది. ఇది మొత్తం ఆదాయంలో 64.3 శాతానికి సమానం. అదే సమయంలో ఆర్థిక ఆస్తుల నుంచి వచ్చే ఆదాయం రూ.40,072 కోట్లుగా ఉండేది.పునర్వ్యవస్థీకరించిన సంస్థ నికర ఆస్తులు రూ.2,00,158 కోట్లు ఉండగా, అందులో గ్రూప్‌కంపెనీల్లో పెట్టుబడులు రూ. 1,77,120 కోట్లుగా ఉంటాయి. ఇది మొత్తం నికర ఆస్తుల్లో 90శాతం కంటే తక్కువ. టాటా ట్రస్టుల తాజా ప్రతిపాదనకు టాటా సన్స్ బోర్డు ఆమోదం, ఆర్‌బీఐ అనుమతి, విలీన ప్రక్రియ పూర్తవడం వంటి అనేక దశలు ఉన్నాయి. ఇవన్నీ పూర్తయిన తర్వాతే ప్రతిపాదిత పునర్వ్యవస్థీకరణ అమల్లోకి వస్తుంది. టాటా ట్రస్టుల ప్రకారం, ఈ నిర్మాణం టాటా గ్రూప్ సంప్రదాయ సంస్థాగత నమూనాను కొనసాగించడంతో పాటు నియంత్రణనిబంధనలను పాటించేలా చేస్తుంది. అదే సమయంలో టాటా సన్స్‌ను అన్‌లిస్టెడ్ ప్రైవేట్ హోల్డింగ్ కంపెనీగా కొనసాగించేందుకు అవకాశం కల్పిస్తుంది.

## ఆర్బీఐ రెపోరేట్ల పెంపు పరిమితమే: నోమురా



**ముంబయి, సెప్టెంబరు 28:** భారతీయ రిజర్వ్ బ్యాంక్ రానున్న రోజుల్లో భారీ స్థాయిలో వడ్డీ రేట్లను పెంచే అవకాశం లేదని, పరిమిత స్థాయిలోనే ద్రవ్య విధానాన్ని కఠినతరం చేసే అవకాశం ఉందని గ్లోబల్ బ్రోకరేజ్ సంస్థ నోమురా అంచనా వేసింది. ప్రస్తుతం మార్కెట్లు వచ్చే ఏడాది కాలంలో దాదాపు 125 బేసిస్ పాయింట్ల వడ్డీ రేట్ల పెంపును అంచనా వేస్తున్నప్పటికీ, ఆ స్థాయిలో కఠిన చర్యలు ఉండకపోవచ్చని తెలిపింది. ద్రవ్యోల్బణం విస్తృతంగా ఆర్థిక వ్యవస్థ అంతటా వ్యాపిస్తున్న సంకేతాలు లేవని ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పరిమితమేనని అంచనావేసింది. భారత్‌లో ట్రెండ్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిం దని నోమురా తెలిపింది. తమ ఇన్‌ఫ్లేషన్ జనరలైజేషన్ ఇండెక్స్ కూడా దేశ ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు విస్తృతంగా పెరుగుతున్నట్లు ఎలాంటి సంకేతాలు ఇవ్వడం లేదని పేర్కొంది. నోమురా రూపొందించిన ముందస్తు సూచీ రానున్న కాలంలో ఆర్థిక వృద్ధి సాధారణ స్థాయి కంటే దిగువన ఉండే అవకాశాన్ని సూచిస్తోందని తెలిపింది. ఆహారం, ఇంధన ధరల ప్రభావంరానున్న ఆరునెలల్లో ఆహారం, ఇంధన ధరల పెరుగుదల కారణంగా హెడ్‌లైన్ ద్రవ్యోల్బణం మరింత పెరిగే అవకాశం ఉందని నోమురా అంచనా వేసింది. 2027లో వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం 5.2శాతంగా ఉండవచ్చని 2028లో ఇది ఆర్‌బీఐ నిర్దేశించిన 4 శాతం మధ్యస్థ లక్ష్యానికి చేరువయ్యే అవకాశంఉందని పేర్కొంది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు విస్తృతంగా వ్యాపిస్తున్న సంకేతాలు పరిమితంగా ఉన్నందున, పూర్తిస్థాయి కఠిన ద్రవ్య విధానం వచ్చే అవకాశం తక్కువని నోమురా పేర్కొంది. అక్టోబర్, డిసెంబర్ నెలల్లో ఆర్‌బీఐ ఒక్కోసారి 25 బేసిస్ పాయింట్ల చొప్పున రెపో రేటును పెంచవచ్చని నోమురా అంచనా వేసింది. దీంతో తుది రెపో రేటు 5.75 శాతానికి చేరుకోవచ్చని తెలిపింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.